VELTHURU TELUGU DAILY

# వెలుతురు

తెలుగు దిన పత్రిక

రంగారెడ్డి, నల్గొండ : బుధవారం 08.07.2026
సంపుటి : 09 సంచిక : 29 , పేజీలు : 12 , వెల:రూ . 5/-

SRI SHANTHI PUBLICATIONS PUBLISHED FROM TELANGANA | ANDHRAPRADESH

www.velthuru.com




## కాళేశ్వరం విధ్వంసానికి కేసీఆర్ బాధ్యత వహించాలి: సీఎం రేవంత్ రెడ్డి

# డిజిటల్ గవర్నెన్స్ తో ముందుకు

### క్షేత్రస్థాయి అధ్యయనానికి కమిటీ



- వంద రోజుల్లో కొలిక్కి తీసుకురావాలి
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

**హైదరాబాద్ వెలుతురు జూలై 07:**

పరిపాలనలో మరింత పారదర్శకతకు డిజిటల్ గవర్నెన్స్ దిశగా చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులకు సూచించారు. ఇందుకు సంబంధించి ప్రణాళికలు సిద్ధం చేయడంతో పాటు అవసరమైన చట్టాలను రూపొందించాలని ఆదేశించారు. మంగళవారం ఎంసీఆర్ హెఆర్డీలోని బోధి పెవిలియన్ లో కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలపై సీఎం రేవంత్ రెడ్డి సమీక్ష నిర్వహించారు. ప్రజలకు మెరుగైన సేవలను అందించడంతో పాటు సంక్షేమ పథకాలు నేరుగా లబ్ధిదారులకు చేర్చేందుకు డిజిటల్ గవర్నెన్స్ ఉపయోగపడుతుందని అభిప్రాయపడ్డారు. ప్రభుత్వ ఉద్యోగులతో పాటు కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు ఒకటో తారీఖున జీతాలు అందించేందుకు వివరాలను పూర్తిగా డిజిటలైజ్ చేయాలని అధికారులకు సూచించారు. వివిధ విభాగాలలోని కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు, జీతాలు, బ్యాంక్ అకౌంట్ వివరాలను పూర్తిగా డిజిటలైజ్ చేయాలన్నారు.రాష్ట్రంలో దాదాపు 4800 కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఏజెన్సీలు ఉండగా..

▶ మిగతా 2లో

## గురుకులాలు, హాస్టళ్లలో క్లీన్ అండ్ గ్రీన్ కు ప్రాధాన్యం, మెనూ అమలులో రాజీ ఉండొద్దు

- బీసీ స్టడీ సర్కిల్స్ బలోపేతానికి ప్రత్యేక కమిటీ
- జూలై 16 నుంచి కులవృత్తుల మేళా.. అన్ని కులాలకు అవకాశం
- స్కిల్ డెవలప్మెంట్‌తో బీసీలకు మరిన్ని ఉపాధి అవకాశాలు ఎకనామిక్ సపోర్ట్ స్కీమ్స్‌పై అధ్యయనం చేయాలి
- బీసీ సంక్షేమ శాఖలో సంక్షేమం, నాణ్యత, ఉపాధి కల్పనకు ప్రాధాన్యత
- బీసీ సంక్షేమ శాఖ ఉన్నతాధికారులతో సమీక్షా



సమావేశంలో మంత్రి పొన్నం ప్రభాకర్

**హైదరాబాద్ వెలుతురు 7 జూలై :**

గురుకులాలు, హాస్టళ్లు ప్రారంభమై 20 రోజులు పూర్తైన నేపథ్యంలో గత సమీక్షా సమావేశంలో తీసుకున్న నిర్ణయాల అమలుపై బీసీ సంక్షేమ శాఖకు సంబంధించిన కార్యక్రమాలపై సచివాలయంలో రవాణా మరియు బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఉన్నతాధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు.

▶ మిగతా 2లో

## ప్రజలకు మెరుగైన సేవలందించడమే ప్రభుత్వ లక్ష్యం

- రూ.360 కోట్లతో రెవెన్యూ శాశ్వత భవనాలు
- 10 ఆర్డీవో,107 తహశీల్దార్, 53 సబ్ రిజిస్ట్రార్ భవనాల నిర్మాణం
- రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

**హైదరాబాద్ వెలుతురు జూలై 07:**



రాష్ట్రంలో రెవెన్యూ పరిపాలనను మరింత బలోపేతం చేయడంతో పాటు ప్రజలకు ఆధునిక, గౌరవప్రదమైన సేవలు అందించాలనే లక్ష్యంతో దశలవారీగా తహసీల్దార్, ఆర్డీవో, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు శాశ్వత భవనాల నిర్మాణాన్ని ప్రభుత్వం వేగవంతం చేస్తోందని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార & పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి తెలిపారు.భవనాల నిర్మాణాలపై మంగళవారం నాడు అధికారులతో మంత్రి గారు సమీక్షించారు.

▶ మిగతా 2లో

## విజయ్ ఎన్నిక చెల్లదంటూ పిటిషన్



- విచారణకు స్వీకరించిన తమిళనాడు హైకోర్టు
- తమిళనాడు ముఖ్యమంత్రి జోసఫ్ విజయ్ ఎన్నిక చెల్లదంటూ సవాలు

2

## ఈటల రాజేందర్ బీజేపీ నేతనా లేక బీఆర్ఎస్ ఏజెంట్‌నా




- బీజేపీ ఎంపీ ఈటెల పై టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ ఫైర్...

**హైదరాబాద్ వెలుతురు జూలై 07:**

ఈటల రాజేందర్ మాట్లాడుతుంటే ఆయన బీజేపీ నేతలా మాట్లాడుతున్నారో, లేక బీఆర్ఎస్ ఏజెంట్‌లా మాట్లాడుతున్నారో ప్రజలకే అర్థం కావడం లేదు అని టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ అన్నారు.

## ఐటీ ఉద్యోగుల కోసం డైలీ షటిల్స్ సర్వీసులను ప్రారంభించిన మంత్రి పొన్నం ప్రభాకర్

**హైదరాబాద్ వెలుతురు జూలై 07:**

జేఆర్సీ కన్వెన్షన్ లో ఐటీ ఉద్యోగుల కోసం డైలీ షటిల్స్ సర్వీసులను ప్రారంభించిన మంత్రి పొన్నం ప్రభాకర్

కార్యక్రమంలో పాల్గొన్న టీపీసీసీ ప్రచారాక కమిటీ చైర్మన్ మధుయాష్కి గౌడ్, అడిషనల్ ట్రాన్స్పోర్ట్ కమిషనర్ రమేష్, డైలీ షటిల్స్ ప్రతినిధులకు మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ ఐటీ ఉద్యోగుల కోసం




డైలీ షటిల్స్ ప్రారంభించిన శ్రీనివాస్ గారికి శుభాకాంక్షలు.హైదరాబాద్ గ్లోబల్ సిటీ గా మార్చడానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు అనేక ప్రణాళికలు రూపొందిస్తూ మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నారు.ఇందుకోసం నగరంలో నిర్వహించిన గ్లోబల్ సమ్మిట్ 2047 ద్వారా పబ్లిక్ ట్రాన్స్పోర్ట్ ఒక భాగంగా అభివృద్ధి చేయాలని ప్రణాళికలు రూపొందించారు.

▶ మిగతా 2లో

## చిన్నారులే దేశ సంపద, ఏ చిన్నారి అంగన్వాడి సేవలకు దూరం కాకూడదు: మంత్రి సీతక్క




- ఎంసీఆర్ హెచ్ఆర్డీలో మొబైల్ అంగన్వాడి వాహనాన్ని ప్రారంభించిన మంత్రులు సీతక్క, వివేక్

**హైదరాబాద్ వెలుతురు జూలై 07:**

చిన్నారులే దేశ సంపద, దేశ భవిష్యత్తని, తెలంగాణ–2047 లక్ష్య సాధనలో నేటి చిన్నారులే కీలక పాత్ర పోషిస్తారని మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క అన్నారు. అందుకే ఏ ఒక్క చిన్నారికీ అంగన్వాడి సేవలు అందకుండా ఉండకూడదనే సంకల్పంతో రాష్ట్ర ప్రభుత్వం మొబైల్ అంగన్వాడి కేంద్రాలను ప్రారంభిస్తోందని తెలిపారు. ఎంసీఆర్ హెచ్ఆర్డీలో కార్మిక శాఖ మంత్రి వివేక్‌తో కలిసి కార్మిక శాఖ సహకారంతో మహిళా, శిశు సంక్షేమ శాఖ రూపొందించిన మొబైల్ అంగన్వాడి వాహనాన్ని మంత్రి సీతక్క జెండా ఊపి ప్రారంభించారు. ఈ మొబైల్ అంగన్వాడి వాహనం మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలోని ఇందిరమ్మ కాలనీ లో అంగన్వాడి సేవలు అందించనుంది.

▶ మిగతా 12లో

## ప్రధాని మోదీకి ఇండోనేసియా అత్యున్నత పౌర పురస్కారం

- జకార్తాలో నరేంద్ర మోదీకి చారిత్రాత్మక గౌరవం
- 'బింటాంగ్ ఆదిపుర్ణ' మెడల్‌ను ప్రదానం చేసిన ప్రెసిడెంట్
- అధ్యక్షుడు ప్రబోవో సుబియాంటోతో ప్రధాని కీలక భేటీ
- రక్షణ, వాణిజ్య రంగాల్లో వ్యూహాత్మక ఒప్పందాలు
- రెండు దేశాల మధ్య సరికొత్త భాగస్వామ్య అధ్యాయం
- సాంకేతికత, ఆరోగ్య రంగాల విస్తరణపై కీలక చర్చలు
- మోదీకి ఘన స్వాగతం పలికిన ఇండోనేసియా ప్రభుత్వం
- సాంస్కృతిక బంధాన్ని మరింత బలోపేతం చేసేలా పర్యటన
- ద్వైపాక్షిక సంబంధాల బలోపేతంలో చారిత్రాత్మక మైలురాయి
- అత్యున్నత పురస్కారాన్ని భారతీయులకు అంకితం చేసిన ప్రధాని



**ఇండోనేసియా వెలుతురు జూలై 07:**

భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఇండోనేసియా పర్యటనలో సరికొత్త చరిత్ర సృష్టించారు.

▶ మిగతా 2లో

## రూ. 338 కోట్లతో నాలుగు లేన్ల రహదారులకు శ్రీకారం

- దేశం మొత్తం తెలంగాణ మోడల్ రోడ్లు అనేలా చేసి చూపిస్తాం
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి పనులు
- రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి




## జననేత డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి సేవలు చిరస్మరణీయం

- టీపీసీసీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్
- దివంగత ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, ప్రజానేత డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి జయంతి సందర్భంగా తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టీపీసీసీ) అధ్యక్షులు, ఎమ్మెల్సీ శ్రీ మహేష్ కుమార్ గౌడ్ నివాళి



**హైదరాబాద్ వెలుతురు జూలై 07:**

ప్రజల సంక్షేమమే ప్రభుత్వ పాలనకు కేంద్రబిందువుగా ఉండాలని ఆచరణలో చూపించిన అరుదైన నాయకుడు డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి అని పేర్కొన్నారు.

▶ మిగతా 5లో

# డిజిటల్ గవర్నెన్స్ తో...

(మొదటి పేజీ తరువాయి)




ఇందులో 4300 ఏజెన్సీలు ఉద్యోగులకు ఈఎస్ఐ, పీఎఫ్ చెల్లించడం లేదని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. ఏజెన్సీలకు ప్రభుత్వం చెల్లింపులు చేసినా, ఉద్యోగులకు సమయానికి జీతాలు చెల్లించడం లేదని తెలిపారు. దీనిపై ప్రభుత్వం సీరియస్ గా ఉందని, అలాంటి ఏజెన్సీలపై కఠిన చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. డిజిటల్ గవర్నెన్స్ తో సమస్యకు చెక్ పెట్టాలని సూచించారు. కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు ఒకటి నుంచి 5వ తేదీలోగా పారదర్శకంగా జీతాలు చెల్లింపులు జరిపేందుకు డిజిటల్ గవర్నెన్స్ ఉపయోగపడుతుందన్నారు.

అందుకే పూర్తి వివరాలను డిజిటలైజ్ చేయాలని తెలిపారు. ఇందుకు వివిధ విభాగాల అధికారులతో ఒక కమిటీ ఏర్పాటు చేయాలని సూచించారు. కమిటీ 100 రోజుల్లో ఈ అంశాన్ని కొలిక్కి తీసుకు రావాలని ఆదేశించారు. హెల్త్ కార్డులు, ఇతర బెనిఫిట్స్ అమలు చేసేందుకు ప్రభుత్వ ఉద్యోగుల వివరాలను కూడా డిజిలైజ్ చేయాలన్నారు. నిరంతరం మానీటరింగ్ చేసేందుకు ఆర్థిక శాఖ విభాగం ఆధ్వర్యంలో ఒక ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఈ సమీక్షా సమావేశంలో ఎంపీ వేం నరేందర్ రెడ్డి, సలహాదారు రామకృష్ణారావు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, MA&UD ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్, సీఎం ప్రధాన కార్యదర్శి వి. శేషాద్రి, MCRHRD వైస్ చైర్మన్ శాంతి కుమారి, వేతన సవరణ కమిషనర్ ఎన్. శివ శంకర్,ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా, ప్రణాళికా విభాగం కార్యదర్శి గౌరవ్ ఉప్పల్, ఇతర ఉన్నతాధికారులు హాజరయ్యారు.

# ఈటల రాజేందర్ బీజేపీ నేతనా లేక...

(మొదటి పేజీ తరువాయి)

కన్నెపల్లి పంప్‌హౌస్ నుంచి నీళ్లు తీయొద్దని చెప్పింది ఎవరో కాదు... కేంద్ర ప్రభుత్వ పరిధిలోని ఎన్‌డీఎస్ఏ (NDSA – నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ). కేటీఆర్ గారు టెక్నికల్ ఎక్స్‌పర్ట్ కాదు... అసలైన ఎక్స్‌పర్ట్స్ ఎన్‌డీఎస్ఏ వాళ్లే.అక్కడ భద్రతా కారణాల దృష్ట్యా నీళ్లు విడుదల చేయొద్దని నిషేధించింది కేంద్ర ప్రభుత్వ సంస్థే.ఈటల రాజేందర్ ఢిల్లీకి పోయి ప్రధానమంత్రి నరేంద్ర మోదీని అడిగి రావాలి.ఈ రెండు నాలుకల ధోరణి ఏంటి?ఆయన మాటల్లో బీజేపీ లైన్ ఉందా, బీఆర్ఎస్ స్క్రిప్ట్ ఉందా అనేది తెలంగాణ సమాజం గమనిస్తోంది.బీఆర్ఎస్, బీజేపీలు రెండూ ఒకటే అని మేము మొదటి నుంచి చెప్తూనే ఉన్నాం. ఇప్పుడు అది వంద శాతం నిజమని తేలిపోయింది.ఢిల్లీలో దోస్తీ... గల్లీలో కుస్తీ అన్నట్టుంది వీరి వ్యవహారం. ప్రజా క్షేత్రంలో బీజేపీ, బీఆర్ఎస్ ఆడుతున్న ఈ కపట నాటకాలను కాంగ్రెస్ పార్టీ తెలంగాణ ప్రజల ముందు ఖచ్చితంగా ఎండగడుతుంది.

# కాళేశ్వరం విధ్వంసానికి కేసీఆర్ బాధ్యత వహించాలి: సీఎం రేవంత్ రెడ్డి

- **కాళేశ్వరం రీడిజైన్‌తో ఖర్చు పెరిగిందని విమర్శ**
- **నాణ్యతా లోపాలతోనే బ్యారేజీలు దెబ్బతిన్నాయని వ్యాఖ్య**
- **ప్రాజెక్టు పునరుద్ధరణకు నిపుణులతో చర్యలు చేపడుతున్నామని వెల్లడి**
- **అసెంబ్లీలో కాళేశ్వరంపై సమగ్ర చర్చకు సిద్ధమని ప్రకటన**

**హైదరాబాద్ వెలుతురు జూలై 07:**

ప్రజాభవన్‌లో నిర్వహించిన సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కాళేశ్వరం ప్రాజెక్టుపై బీఆర్ఎస్ నేతల విమర్శలకు ఘాటుగా స్పందించారు. కాళేశ్వరం విషయంలో చేసిన తప్పులను ఇతరులపై నెట్టి రాజకీయ ఉనికిని కాపాడుకోవాలని బీఆర్ఎస్ ప్రయత్నిస్తోందని ఆరోపించారు. ప్రాజెక్టుకు సంబంధించిన వివిధ సంస్థల నివేదికలను సమగ్రంగా ప్రజల ముందుంచిన మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డిని అభినందించారు.ప్రాణహిత–చేవెళ్ల ప్రాజెక్టును కాంగ్రెస్ ప్రభుత్వం 16.40 లక్షల ఎకరాలకు సాగునీరు అందించాలనే లక్ష్యంతో ప్రారంభించిందని సీఎం గుర్తు చేశారు. తెలంగాణ ఏర్పాటుకు ముందు ప్రాజెక్టుపై రూ.6,150 కోట్లు, ఆ తర్వాత బీఆర్ఎస్ ప్రభుత్వం మరో రూ.5,523 కోట్లు ఖర్చు చేసిందన్నారు. ఆ తర్వాత ప్రాజెక్టును రీడిజైన్ చేసి అంచనా వ్యయాన్ని రూ.38 వేల కోట్ల నుంచి రూ.81 వేల కోట్లకు పెంచారని విమర్శించారు. అయితే నీటి లభ్యత పెరగలేదని,

ఆయకట్టు కూడా విస్తరించలేదని అన్నారు.కాళేశ్వరం రీడిజైన్‌కు ప్రభుత్వం నియమించిన కమిటీ మేడిగడ్డ వద్ద బ్యారేజీ నిర్మాణాన్ని వ్యతిరేకిస్తూ నివేదిక ఇచ్చినా, దానిని కేసీఆర్ పక్కన పెట్టి తనకు అనుకూలంగా నివేదిక తెప్పించుకున్నారని ఆరోపించారు. ప్రణాళిక, డిజైన్, నిర్మాణం, నిర్వహణలో నాణ్యత లోపించడంతోనే నేటి పరిస్థితి వచ్చిందన్నారు.కాళేశ్వరం ప్రారంభమైన ఏడాదిలోనే మేడిగడ్డలో సమస్యలు తలెత్తాయని, 2020లోనే మరమ్మతులు చేయాలని ఇంజినీర్లు ప్రభుత్వానికి నివేదించినా చర్యలు తీసుకోలేదన్నారు. కన్నెపల్లి పంప్‌హౌస్ మునిగిపోవడం, మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల్లో ఏర్పడిన సమస్యలు ఒక్కరోజులో వచ్చినవి కావని, నిర్మాణ దశ నుంచే లోపాలు ఉన్నాయని పేర్కొన్నారు. ఈ బ్యారేజీల నిర్మాణానికి ముందు సరైన భూగర్భ పరీక్షలు కూడా నిర్వహించలేదని విమర్శించారు.ఎన్‌డీఎస్ఏ నివేదికలో కూడా నాణ్యతా లోపాలు, నిర్వహణ వైఫల్యాలు, నిబంధనల ఉల్లంఘనల వల్లే బ్యారేజీలు దెబ్బతిన్నట్లు స్పష్టమైందన్నారు. లక్ష కోట్లకు పైగా ఖర్చు చేసిన ప్రాజెక్టును కాపాడేందుకు ప్రభుత్వం నిపుణులతో కలిసి పునరుద్ధరణ చర్యలు చేపడుతోందని తెలిపారు.కాళేశ్వరంపై చర్చకు వస్తే బీఆర్ఎస్ మిడిమిడి జ్ఞానం ఉన్నవారిని పంపుతోందని ఎద్దేవా చేసిన సీఎం, కేసీఆర్ కోరిన తేదీన అసెంబ్లీ లేదా ఉభయ సభల సంయుక్త సమావేశంలో ప్రాజెక్టుపై సమగ్ర చర్చకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. స్పీకర్‌కు లేఖ రాసి తేదీ ఖరారు చేయాలని బీఆర్ఎస్‌కు సూచించారు.తొమ్మిదిన్నరేళ్ల పాలనలో భారీ అప్పులు చేసి, కాళేశ్వరం పేరుతో లక్షల కోట్ల రూపాయలు ఖర్చు చేసినా ప్రజలకు ఉపయోగపడేలా ప్రాజెక్టును నిర్వహించలేదని ఆరోపించారు. ఇలాంటి విధ్వంసానికి కారణమైన కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావులను "ఆర్థిక ఉగ్రవాదులు"గా అభివర్ణించారు.

కేసీఆర్ చేసిన తప్పులకు తెలంగాణ ప్రజలు శిక్ష అనుభవించకూడదని స్పష్టం చేసిన సీఎం, ప్రజలకు ఉపయోగపడే నిర్మాణాలు, సంక్షేమ పథకాలను తమ ప్రభుత్వం కొనసాగిస్తోందన్నారు. ప్రజల ప్రయోజనమే ప్రభుత్వానికి ప్రధానమని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు.

# ప్రజలకు మెరుగైన సేవలందించడమే...

(మొదటి పేజీ తరువాయి)

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తొలివిడతలో అద్దె భవనాలు, శిథిలావస్థలో ఉన్న 107 తహసీల్దార్ కార్యాలయాలు, 10 ఆర్డీవో కార్యాలయాలకు 263 కోట్ల రూపాయిలతో అలాగే స్టాంప్స్ & రిజిస్ట్రేషన్ శాఖకు సంబంధించి రూ.97 కోట్ల రూపాయిలతో 48 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు, ఆదిలాబాద్, ఖమ్మం, మహబూబ్‌నగర్ జిల్లాల్లో జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయాలు, నిజామాబాద్, వరంగల్ జిల్లాల్లో డీఐజీ కార్యాలయాలను నిర్మిస్తున్నట్లు వెల్లడించారు. ఈ మొత్తం భవనాల కోసం రెండు విభాగాలకు సంబంధించి 360 కోట్ల రూపాయిలతో పరిపాలనా అనుమతులు జారీ చేసినట్లు తెలిపారు. ఈ భవనాలన్నీ ఒకే నమూనాలో, ఆధునిక సౌకర్యాలతో నిర్మించి ప్రజలకు వేగవంతమైన, పారదర్శకమైన సేవలు అందించేలా రూపొందిస్తామని చెప్పారు. వీటి నిర్మాణ బాధ్యతను తెలంగాణ హౌసింగ్ కార్పొరేషన్‌కు అప్పగించినట్లు తెలిపారు.గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని మంత్రి పేర్కొన్నారు. అద్దె భవనాల్లో ప్రభుత్వ కార్యాలయాలు కొనసాగడం వల్ల ప్రజలు ఇబ్బందులు పడుతున్న పరిస్థితికి శాశ్వత పరిష్కారం చూపేందుకు ఈ చర్యలు చేపడుతున్నామని తెలిపారు.హౌసింగ్ అధికారులు జిల్లా స్థాయిలో రెవెన్యూ అధికారులతో సమన్వయం చేసుకొని కొత్త భవనాల నిర్మాణానికి అవసరమైన స్థలాలను గుర్తించి నిర్మాణ పనులను వేగంగా ప్రారంభించాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్రవ్యాప్తంగా రెవెన్యూ, రిజిస్ట్రేషన్ సేవలందించే కార్యాలయాలు ప్రజలకు సులభంగా అందుబాటులో ఉండేలా, భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా నిర్మించబడతాయని మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి స్పష్టం చేశారు.ఇప్పటికే ఔటర్ రింగ్ రోడ్డు పరిధిలో 39 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలను 13 క్లస్టర్లుగా విభజించి ఇంటిగ్రేటెడ్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలను నిర్మిస్తున్నామని ప్రభుత్వంపై ఎలాంటి ఆర్థిక భారం పడకుండా ప్రైవేటు నిర్మాణ రంగ సంస్థలతో నిర్మిస్తున్నామని తెలిపారు. ఐదు సంవత్సరాల నిర్వహణా బాధ్యతను కూడా ఆ సంస్థలే తీసుకున్నాయని ఇప్పటికే నాలుగు ప్రాంతాల్లో ఇంటిగ్రేటెడ్ భవనాలకు శంకుస్థాపన చేయగా నిర్మాణపనులు చురుగ్గా సాగుతున్నాయని మంత్రి పొంగులేటి తెలిపారు.

# విజయ్ ఎన్నిక చెల్లదంటూ పిటిషన్

- **క్రీడా శాఖ మంత్రి ఆదవ్ అర్జున విజయాన్ని కూడా సవాలు చేస్తూ పిటిషన్లు**
- **జస్టిస్ వీ లక్ష్మీనారాయణన్ ఏకసభ్య ధర్మాసనం విచారణ**
- **పిటిషన్లలోని సాంకేతిక లోపాలను వారం రోజుల్లోగా సరిదిద్దాలని ఆదేశం**
- **లోపాలు సవరించిన తర్వాతే సీఎం, మంత్రికి నోటీసులు జారీ**
- **హైకోర్టు ఎన్నికల పిటిషన్ల విచారణను ఆరు నెలల్లోగా పూర్తి చేయాలని స్పష్టీకరణ**
- **నామినేషన్ అఫిడవిట్‌లో విజయ్ తప్పుడు సమాచారం ఇచ్చారన్న ఇనిగో**
- **పెండింగ్ కేసులు దాచారని, ఎన్నికల ఖర్చులు పూర్తిగా చూపలేదని ఆరోపణ**
- **ప్రచారంలో చిన్నపిల్లలను చట్టవిరుద్ధంగా వాడుకున్నారని డీఎంకే అభ్యర్థి ఫిర్యాదు**
- **తిరుచ్చి ఈస్ట్ ఉపఎన్నికపై స్టే విధించి, తనను విజేతగా ప్రకటించాలని డిమాండ్**

**చెన్నై వెలుతురు జూలై 07:**

తమిళనాడు రాజకీయాల్లో సంచలనం సృష్టిస్తూ.. ముఖ్యమంత్రి జోసఫ్ విజయ్, రాష్ట్ర క్రీడాభివృద్ధి శాఖ మంత్రి ఆదవ్ అర్జునల ఎన్నికల విజయాన్ని సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్లను మద్రాస్ హైకోర్టు విచారణకు స్వీకరించింది. మంగళవారం ఈ పిటిషన్లపై జస్టిస్ వీ లక్ష్మీనారాయణన్ నేతృత్వంలోని ఏకసభ్య ధర్మాసనం విచారణ చేపట్టింది. విచారణ సందర్భంగా పిటిషన్లలో కొన్ని ప్రాథమిక చట్టపరమైన, సాంకేతిక లోపాలు (ఫార్మ్–25 అఫిడవిట్ వంటివి) ఉన్నట్లు న్యాయమూర్తి గుర్తించారు. ఈ లోపాలను వారం రోజుల్లోగా సరిదిద్దాలని పిటిషనర్లకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ఈ సాంకేతిక ప్రక్రియలన్నీ పూర్తయిన తర్వాతే ముఖ్యమంత్రి విజయ్, మంత్రి ఆదవ్ అర్జునలతో పాటు కేంద్ర ఎన్నికల సంఘానికి 3 వారాల గడువిస్తూ రిజిస్ట్రీ ద్వారా నోటీసులు జారీ చేయనున్నట్లు హైకోర్టు వెల్లడించింది.

### ఆరు నెలల్లో విచారణ పూర్తి

ప్రాతినిధ్య చట్ట నిబంధనల ప్రకారం ఎన్నికల పిటిషన్ల విచారణను అత్యంత వేగంగా, ఆరు నెలల లోపే పూర్తి చేయాల్సి ఉంటుందని ఈ సందర్భంగా హైకోర్టు న్యాయమూర్తి స్పష్టం చేశారు. అందుకే ఎలాంటి జాప్యం లేకుండా పిటిషనర్లు తమ తరపున ప్రైవేటు నోటీసులు కూడా పంపుకోవచ్చని కోర్టు అనుమతించింది. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో సీఎం విజయ్ పెరంబూర్, తిరుచ్చి ఈస్ట్ (తిరుచిరాపల్లి ఈస్ట్) నియోజకవర్గాల నుంచి విజయం సాధించిన సంగతి తెలిసిందే. వీటిలో పెరంబూర్ స్థానం నుంచి ముగ్గురు, తిరుచ్చి ఈస్ట్ నుంచి ఒకరు చొప్పున మొత్తం నాలుగు పిటిషన్లు విజయ్‌కు వ్యతిరేకంగా దాఖలయ్యాయి.

### విజయ్‌పై డీఎంకే అభ్యర్థి ఇనిగో తీవ్ర ఆరోపణలు

తిరుచ్చి ఈస్ట్ నియోజకవర్గంలో విజయ్ చేతిలో ఓడిపోయిన డీఎంకే అభ్యర్థి ఎస్. ఇనిగో ఇరుదయరాజ్ దాఖలు చేసిన పిటిషన్‌లో సీఎంపై తీవ్ర ఆరోపణలు చేశారు. విజయ్ తన నామినేషన్ అఫిడవిట్‌లో పెండింగ్ కేసుల వివరాలను కావాలనే దాచారని, తన నిజమైన ఎన్నికల ఖర్చులను పూర్తిగా చూపకుండా ఎన్నికల నిబంధనలను ఉల్లంఘించారని పేర్కొన్నారు. అంతేకాకుండా, ఓటర్లపై ఒత్తిడి తెచ్చేందుకు ఎన్నికల ప్రచారంలో చట్టవిరుద్ధంగా చిన్నపిల్లలను ఉపయోగించుకున్నారని ఇనిగో తన పిటిషన్‌లో ప్రస్తావించారు. నిబంధనల ఉల్లంఘనకు పాల్పడిన విజయ్ విజయాన్ని రద్దు చేసి, ఆ స్థానంలో తనను విజేతగా ప్రకటించాలని కోరారు. అలాగే విజయ్ రాజీనామాతో ఖాళీ అయిన తిరుచ్చి ఈస్ట్ నియోజకవర్గ ఉపఎన్నిక ప్రక్రియపై స్టే విధించాలని డీఎంకే అభ్యర్థి ఇనిగో ఇరుదయరాజ్ న్యాయస్థానాన్ని ఆశ్రయించారు.

# గురుకులాలు, హాస్టళ్లలో క్లీన్ అండ్ గ్రీన్ కు...

(మొదటి పేజీ తరువాయి)

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గురుకులాలు, హాస్టళ్లు పరిశుభ్రంగా, పచ్చదనంతో కూడిన క్లీన్ అండ్ గ్రీన్ వాతావరణంలో ఉండేలా అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రభుత్వం నిర్ణయించిన మెనూను అన్ని గురుకులాలు, హాస్టళ్లలో తప్పనిసరిగా అమలు చేయాలని సూచించారు.జిల్లా బీసీ సంక్షేమ అధికారులు (డీబీసీవోలు) క్రమశిక్షణతో విధులు నిర్వహిస్తూ విద్యార్థుల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని మంత్రి స్పష్టం చేశారు. ప్రజాప్రతినిధులు తరచూ గురుకులాలు, హాస్టళ్లను సందర్శించి విద్యార్థుల పరిస్థితులను స్వయంగా పరిశీలించాలని సూచించారు.స్టడీ సర్కిల్స్‌లో మరింత నాణ్యత పెంపొందించేందుకు, సివిల్స్‌తో పాటు వృత్తి శిక్షణ, నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేసేందుకు ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేయాలని మంత్రి ఆదేశించారు. ఢిల్లీ, అహ్మదాబాద్ వంటి ఇతర రాష్ట్రాల్లో విజయవంతంగా అమలవుతున్న స్టడీ సర్కిల్స్ విధానాలను అధ్యయనం చేసి రాష్ట్రంలో అమలు చేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.జూలై 16 నుంచి హెచ్ఎండీఏ గ్రౌండ్స్‌లో నిర్వహించనున్న కులవృత్తుల మేళాలో అన్ని కులాల సంప్రదాయ వృత్తిదారులకు సమాన అవకాశాలు కల్పించాలని సూచించారు. మహిళల ఆర్థిక స్వావలంబనకు తోడ్పడే కుట్టు మిషన్ పథకం అమలు కోసం సమగ్ర విధి విధానాలను రూపొందించాలని ఆదేశించారు.బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో స్కిల్ డెవలప్మెంట్ కార్యక్రమాలను మరింత విస్తృతంగా చేపట్టి ఉపాధి అవకాశాలను పెంచాలని, ఎకనామిక్ సపోర్ట్ స్కీమ్స్‌పై సమగ్ర అధ్యయనం చేసి అమలుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించారు.ఐఐటీలు, ఐఐఎంలలో సీట్లు సాధించిన గురుకుల విద్యార్థులకు అందించే ల్యాప్‌టాప్‌ల పంపిణీపై సమగ్ర నివేదిక సమర్పించాలని మంత్రి ఆదేశించారు. బీసీ సంక్షేమ శాఖ కమిషనర్, గురుకులాల కార్యదర్శి ఆకస్మికంగా గురుకులాలు, హాస్టళ్లను తనిఖీ చేస్తూ విద్యార్థులకు నాణ్యమైన సౌకర్యాలు అందుతున్నాయో లేదో నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. కాటమయ్య రక్షణ కవచాల శిక్షణ పూర్తి చేసుకొని కిట్లు అందని జిల్లాల్లో వెంటనే పంపిణీ పూర్తి చేయాలని అధికారులను మంత్రి ఆదేశించారు.ఈ సమీక్షా సమావేశంలో బీసీ సంక్షేమ శాఖ కార్యదర్శి బాలమయదేవి, గురుకులాల కార్యదర్శి సైదులు, బీసీ సంక్షేమ శాఖ అధికారులు మల్లయ్య బట్టు, అలోక్ కుమార్, మామిడి హరికృష్ణ, శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఐటీ ఉద్యోగుల కోసం డైలీ షటిల్స్ సర్వీసులను...

(మొదటి పేజీ తరువాయి)

ప్రజలకు సేవ చేయడానికి వస్తున్న వ్యవస్థకు ప్రభుత్వం తరుపున సహకారం ఉంటుంది..

ఆర్టీసీ నష్టాల్లో ఉన్న సంస్థను ఉద్యోగుల సంక్షేమం, ప్రయాణికుల సౌలభ్యం కల్పిస్తూ సేవలు మెరుగుపరిచి మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం అందిస్తూ లాభాల బాటలోకి తీసుకొస్తున్నాం ఆర్టీసీ 350 రూట్ లలో కొత్తగా బస్సులు నడుపుతుంది రవాణా శాఖ ఈవీ పాలసీ తీసుకొచ్చాం నగరంలో ఈవీ వాహనాలకు ప్రాధాన్యత ఇవ్వాలి..డైలీ షటిల్ సర్వీసుల లో కూడా ఐటీ ఉద్యోగుల కోసం ఉపయోగించే వాటికి ఇవీ వాహనాలు ఉపయోగించాలి.ఈవీ వాహనాల వినియోగం పెంచి కాలుష్యాన్ని తగ్గించవచ్చు ప్రభుత్వం లాస్ట్ మైల్ కనెక్టివిటీ పేరుతో మెట్రో ,రైల్వే ,ఆర్టీసీ ద్వారా కింది స్థాయి వరకు రవాణా సౌకర్యాలు మెరుగు పరిచే లక్ష్యంగా ముందుకు పోతున్నాం.

రవాణా శాఖ ప్రగతికి చిహ్నం ఐటీ ఉద్యోగులకు, విద్యనభ్యసించే వారికి రవాణా శాఖ మంత్రి గా ఇలాంటి అంశాల్లో సానుకూలంగా ఉంటాం.మోటార్ వెహికిల్ యాక్ట్ కు కట్టుబడి మీ కార్యకలాపాలు ఉండాలి. నగరంలో పెరుగుతున్న జనాభా కి అనుగుణంగా రవాణా సౌకర్యాలు మెరుగుపరుస్తున్నాం.ర

వాణా శాఖ ఈవీ పాలసీ, స్క్రాప్ పాలసీ, తీసుకొచ్చాం, వాహన్ , సారథి తీసుకొచ్చాం.. ఆటోమేటిక్ టెస్టింగ్ స్టేషన్ లు తీసుకొస్తున్నాం రోడ్డు ప్రమాదాలు తగ్గించడానికి రిఫ్లెక్టర్ సిస్టం తీసుకొస్తున్నాం.ప్రజా ప్రయోజనాల కోసం రవాణా శాఖ అనేక సంస్కరణలు తీసుకొస్తుంది.

# ప్రధాని మోదీకి ఇండోనేసియా అత్యున్నత పౌర పురస్కారం

(మొదటి పేజీ తరువాయి)

రెండు దేశాల మధ్య దశాబ్దాల మైత్రిని మరింత ముందుకు తీసుకెళ్లేలా సాగుతున్న ఈ పర్యటనలో ప్రధానికి అరుదైన గౌరవం దక్కింది. అంతర్జాతీయంగా భారత్ ప్రతిష్టను పెంచుతూ, ఇండోనేసియా ప్రభుత్వం తమ దేశ అత్యున్నత పౌర పురస్కారమైన 'బింటాంగ్ ఆదిపుర్ణ ఆఫ్ ది రిపబ్లిక్ ఆఫ్ ఇండోనేషియా' (Bintang Adipurna) మెడల్‌ను ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి బహూకరించింది. జకార్తాలోని ప్రెసిడెన్షియల్ ప్యాలెస్‌లో జరిగిన ఘనమైన వేడుకలో ఇండోనేసియా అధ్యక్షుడు ప్రబోవో సుబియాంటో స్వయంగా ఈ పురస్కారాన్ని ప్రధానికి ప్రదానం చేశారు. ఇరు దేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాలను బలోపేతం చేయడంలో ప్రధాని మోదీ పోషించిన విశిష్ట పాత్రకు గుర్తింపుగా ఈ అత్యున్నత పురస్కారాన్ని అందజేశారు. ఈ అరుదైన గౌరవాన్ని ప్రధాని మోదీ 140 కోట్ల మంది భారత ప్రజలకు అంకితం చేశారు.



### రంగాల వారీగా కీలక ఒప్పందాలు

అవార్డు ప్రదానోత్సవం అనంతరం ప్రధాని నరేంద్ర మోదీ, అధ్యక్షుడు ప్రబోవో సుబియాంటోల మధ్య ఉన్నత స్థాయి ద్వైపాక్షిక చర్చలు జరిగాయి. ఈ భేటీలో భాగంగా రక్షణ, వాణిజ్యం, సాంకేతికత, ఆరోగ్యం, సాంస్కృతిక రంగాలలో ఇరు దేశాలు పలు కీలక ఒప్పందాలపై సంతకాలు చేశాయి. ముఖ్యంగా ఇండో–పసిఫిక్ ప్రాంతంలో సముద్ర భద్రత, రక్షణ రంగంలో పరస్పర సహకారాన్ని పెంపొందించుకోవాలని ఇరు దేశాల అధినేతలు నిర్ణయించారు. డిజిటల్ టెక్నాలజీ, హెల్త్‌కేర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ మరియు ద్వైపాక్షిక వాణిజ్య పరిమాణాన్ని మరింత పెంచేలా సరికొత్త రోడ్‌మ్యాప్‌ను సిద్ధం చేసుకున్నారు. ఈ చారిత్రాత్మక పర్యటన ద్వారా భారత్–ఇండోనేసియా సంబంధాలు సరికొత్త గమ్యస్థానానికి చేరుకున్నాయని అంతర్జాతీయ దౌత్య నిపుణులు విశ్లేషిస్తున్నారు.

# తెలంగాణకు అంతర్జాతీయ వర్సిటీల రాక గర్వకారణం: డాక్టర్ రేఖ బోయాలపల్లి

హైదరాబాద్ వెలుతురు జూలై 07:

కేంద్ర ప్రభుత్వ జాతీయ విద్యా విధానం (NEP 2020), యూజీసీ (UGC) నూతన నిబంధనల నేపథ్యంలో లండన్, కొలరాడో, బర్మింగ్‌హామ్ వంటి ప్రపంచ ప్రఖ్యాత విదేశీ విశ్వవిద్యాలయాలు హైదరాబాద్‌లో తమ క్యాంపస్‌లను ఏర్పాటు చేసేందుకు ముందుకు రావడం పట్ల ప్రముఖ పబ్లిక్ లీడర్‌షిప్ అండ్ కమ్యూనికేషన్స్ ప్రొఫెషనల్ డాక్టర్ రేఖ బోయాలపల్లి  హర్షం వ్యక్తం చేశారు. భాగ్యనగరం ఇకపై కేవలం ఐటీ, ఫార్మా, ఏరోస్పేస్ రంగాలకే పరిమితం కాకుండా అంతర్జాతీయ విద్యా హబ్‌గా రూపాంతరం చెందబోతోందని ఆమె పేర్కొన్నారు.ఈ సందర్భంగా డాక్టర్ రేఖ బోయాలపల్లి మాట్లాడుతూ.. ఈ అంతర్జాతీయ క్యాంపస్‌ల స్థాపన వల్ల తెలంగాణకు బహుళ ప్రయోజనాలు చేకూరనున్నాయని వివరించారు. ముఖ్యంగా ప్రతి ఏటా ఉన్నత చదువుల కోసం విదేశాలకు వెళ్లే వేలాది మంది విద్యార్థులకు స్థానికంగానే ప్రపంచ స్థాయి విద్య అందుబాటులోకి వస్తుందని, దీనివల్ల మేధో వలసలకు (Brain Drain) అడ్డుకట్ట పడటమే కాకుండా, మన దేశ సంపద మరియు ప్రతిభ ఇక్కడే నిలిచిపోతాయని ఆమె ఆశాభావం వ్యక్తం చేశారు."హైదరాబాద్‌లోని ఐటీ, ఫార్మా కారిడార్లకు ఈ విదేశీ విద్యా సంస్థలు అనుసంధానం కావడం ద్వారా విద్యార్థులకు నాణ్యమైన ఇంటర్న్‌షిప్‌లు, లైవ్ ప్రాజెక్ట్‌లు దక్కుతాయి. పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా స్థానిక యువత అంతర్జాతీయ నైపుణ్యాలను పెంపొందించుకోవడానికి ఇది ఒక సువర్ణావకాశం," అని డాక్టర్ రేఖ అభిప్రాయపడ్డారు.అంతే కాకుండా, ఈ గ్లోబల్ వర్సిటీల రాకతో బోధన, సాంకేతిక, పరిపాలనా రంగాల్లో స్థానిక యువతకు వేలాదిగా కొత్త ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని ఆమె తెలిపారు. ఐఐటీ హైదరాబాద్, బిట్స్ పిలానీ, కేంద్రీయ విశ్వవిద్యాలయం వంటి ప్రతిష్టాత్మక స్థానిక సంస్థలతో కలిసి అంతర్జాతీయ నిధులతో ఉమ్మడి పరిశోధనలు (Joint Research) చేపట్టేందుకు ఈ పరిణామం ఎంతగానో దోహదపడుతుందని, ముున్ముందు ఫ్యూచర్ సిటీ (Future City) లో వీటికి శాశ్వత ప్రాంగణాలు కేటాయించాలనే ప్రభుత్వ ఆలోచన అభినందనీయమని డాక్టర్ రేఖ బోయలపల్లి స్పష్టం చేశారు.



# మహిళా రిజర్వేషన్ ఇక ఆలస్యం వద్దు... "ఆజ్ కరో అబ్ హీ కరో!"

డా. రేఖ బోయలపల్లి వైస్ ప్రెసిడెంట్, తెలంగాణ ప్రదేశ్ మహిళా కాంగ్రెస్

నల్లగొండ వెలుతురు జూలై 07:

మంగళవారం రోజున నల్గొండలో అఖిల భారత మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు అల్కా లాంబా గారి ఆదేశాల మేరకు, తెలంగాణ ప్రదేశ్ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు  ఎర్రబెల్లి స్వర్ణ గారి నాయకత్వంలో, జిల్లా అధ్యక్షురాలు వాపగాని మాధవి గారి ఆధ్వర్యంలో, అఖిల భారత మహిళా కాంగ్రెస్ జాతీయ కార్యదర్శి మయూరి సింగ్ ముఖ్య అతిథిగా పాల్గొన్న "ఆజ్ కరో – అబ్ హీ కరో" పోస్ట్‌కార్డ్ సంతకాల సేకరణ కార్యక్రమం విజయవంతంగా నిర్వహించబడింది.33% మహిళా రిజర్వేషన్



బిల్లును వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ప్రధానమంత్రికి పోస్ట్‌కార్డులు పంపించడంతో పాటు, ప్రచారానికి మద్దతుగా మిస్డ్ కాల్స్ కూడా ఇచ్చాము.మహిళల హక్కులు ఇక వాయిదా కాదు... అమలు ఇప్పుడే కావాలి.

# కాళేశ్వరంపై బీఆర్ఎస్ వ్యాఖ్యలు మానుకోవాలి: మహేష్ కుమార్ గౌడ్

- కాళేశ్వరం పేరుతో భారీ అవినీతి జరిగిందన్న టీపీసీసీ చీఫ్
- ఇంజినీర్ల సూచనలు పట్టించుకోకే ప్రాజెక్టు దెబ్బతిందని విమర్శ
- ఎన్‌డీఎస్ఏ అనుమతులు లేకుండా నీటి నిల్వ ప్రమాదకరమని హెచ్చరిక
- కాళేశ్వరం పునరుద్ధరణకు కాంగ్రెస్ చర్యలు చేపడుతుందని వెల్లడి

హైదరాబాద్ వెలుతురు జూలై 07:

కాళేశ్వరం ప్రాజెక్టుపై బీఆర్ఎస్ నేతలు ఎంత తక్కువ మాట్లాడితే అంత మంచిదని టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. కాళేశ్వరం పేరుతో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ కుటుంబం వేల కోట్ల రూపాయల అవినీతికి పాల్పడిందని ఆరోపించారు. ఇంజినీర్ల సూచనలను పట్టించుకోకుండా కేసీఆర్ వ్యవహరించడంతో కాళేశ్వరం ప్రాజెక్టు "కూళేశ్వరం"గా మారిందని విమర్శించారు.కాళేశ్వరం పేరుతో కోట్ల రూపాయల అక్రమాలు జరిగాయని, ఇంజినీర్లను పక్కనపెట్టి తానే ఇంజినీర్‌నని భావిస్తూ కేసీఆర్ నియంతృత్వ ధోరణితో వ్యవహరించడం వల్ల ప్రాజెక్టు నాణ్యత దెబ్బతిందన్నారు. ఇప్పుడు వారం రోజుల్లో నీళ్లు ఇస్తామని చెబుతున్న కేటీఆర్, బీఆర్ఎస్



ప్రభుత్వం తొమ్మిదిన్నరేళ్ల పాలనలో ఏం చేసిందో ప్రజలకు చెప్పాలని డిమాండ్ చేశారు.కాళేశ్వరం ప్రాజెక్టులో జరిగిన అవినీతి కారణంగానే ప్రాజెక్టు మనుగడకే ముప్పు ఏర్పడిందన్నారు. వర్షాభావం ఉన్న సమయంలో సముద్రంలోకి నీటిని వదులుతున్నారంటూ కేటీఆర్ చేస్తున్న వ్యాఖ్యలు ఆయన అనుభవరాహిత్యానికి నిదర్శనమని పేర్కొన్నారు. కేసీఆర్ ప్రభుత్వం అవినీతితో కాళేశ్వరాన్ని దెబ్బతీస్తే, కాంగ్రెస్ ప్రభుత్వం దానిని కాపాడేందుకు చర్యలు తీసుకుంటోందని చెప్పారు.మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల పునాదుల నాణ్యతపై ఇప్పటికే అనుమానాలు వ్యక్తమయ్యాయని, ఈ విషయం కేటీఆర్‌కు తెలియదా అని ప్రశ్నించారు. నాణ్యతా లోపాలున్న ప్రాజెక్టులో పంపులను ప్రారంభిస్తే ఎలాంటి పరిణామాలు ఎదురవుతాయో తెలుసుకోవాలని సూచించారు. గతంలో కేసీఆర్ తాను ఇంజినీర్‌నంటూ గొప్పలు చెప్పుకుని ప్రాజెక్టు నాణ్యతను దెబ్బతీశారని, ఇప్పుడు కేటీఆర్ కూడా అదే అహంభావంతో అవగాహన లేకుండా మాట్లాడుతున్నారని విమర్శించారు.

ఎన్‌డీఎస్ఏ, సీడబ్ల్యూసీ అనుమతులు లేకుండా బ్యారేజీలను నిర్వహించడం ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడటమేనన్నారు. ఎన్‌డీఎస్ఏ గుర్తించిన లోపాలను సరిచేయకుండా నీటిని నిల్వ చేయడం అశాస్త్రీయమని, ప్రమాదకరమని హెచ్చరించారు.త్వరలో సాంకేతిక పరీక్షలు నిర్వహించి కాళేశ్వరం ప్రాజెక్టు పునరుద్ధరణ పనులు చేపట్టేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందని మహేష్ కుమార్ గౌడ్ తెలిపారు. ప్రజల ప్రాణాలు, ప్రజాధనాన్ని కాపాడటమే ప్రభుత్వ ప్రాధాన్యమని పేర్కొన్నారు. ప్రజల నీటి సెంటిమెంట్‌ను అడ్డం పెట్టుకుని అశాస్త్రీయంగా ప్రాజెక్టు నిర్మించి పనికిరాకుండా చేసిన బాధ్యత బీఆర్ఎస్ ప్రభుత్వానిదేనని ఆరోపించారు. వారం రోజుల్లో నీళ్లు ఇస్తామంటున్న కేటీఆర్, తొమ్మిదిన్నరేళ్లలో జరిగిన అక్రమాలపై పశ్చాత్తాపం వ్యక్తం చేస్తే మంచిదని, లేకపోతే ప్రజలు బీఆర్ఎస్ నేతలను నిలదీస్తారని హెచ్చరించారు

# పర్యాటక అభివృద్ధికి సమగ్ర రోడ్‌మ్యాప్ సిద్ధం చేయాలి

- రాష్ట్ర వ్యాప్తంగా పర్యాటక ప్రదేశాల అభివృద్ధి, ప్రమోషన్ పై దృష్టి సారించాలి
- పర్యాటక ప్రాంతాల్లో పరిశుభ్రత, నిర్వహణ, మెరుగైన సేవలకు ప్రాధాన్యం
- పెట్టుబడులను ఆకర్షించేలా పీపీపీ, లీజ్ విధానాల్లో ప్రతిపాదనలు రూపొందించాలి
- హెరిటేజ్ వాక్‌లు, ఉత్సవాలు, కళలు, వంటకాలకు విస్తృత ప్రచారం కల్పించాలి
- అంతర్జాతీయ స్థాయి హైదరాబాద్ కార్నివాల్ నిర్వహణపై అధ్యయనం చేయాలి

హైదరాబాద్, వెలుతురు జూలై 7:

తెలంగాణలో పర్యాటక రంగాన్ని మరింత ఆకర్షణీయంగా తీర్చిదిద్దేందుకు మౌలిక వసతుల కల్పన, సమర్థ నిర్వహణతో పాటు విస్తృత ప్రచారం, మార్కెటింగ్‌పై ప్రత్యేక దృష్టి సారించాలని పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అధికారులను ఆదేశించారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రస్తుతం ఉన్న పర్యాటక ప్రాంతాలు, కొత్తగా అభివృద్ధి చేసేందుకు అవకాశమున్న ప్రదేశాలను గుర్తించి సమగ్ర ప్రతిపాదనలు రూపొందించాలని సూచించారు. పర్యాటకుల సంఖ్యను పెంచడంతో పాటు పర్యాటక ప్రాజెక్టులు ఆర్థికంగా నిలదొక్కుకునేలా స్థిరమైన నమూనాలను రూపొందించాలని స్పష్టం చేశారు.పర్యాటక అభివృద్ధి, ప్రమోషన్, మౌలిక వసతుల కల్పన, పర్యాటక ప్రాంతాల నిర్వహణ, పెట్టుబడుల ఆకర్షణ, హెరిటేజ్ వాక్‌లు, ఉత్సవాలు, హైదరాబాద్‌లో అంతర్జాతీయ స్థాయి కార్నివాల్ నిర్వహణ, తదితర అంశాలపై మంత్రి జూపల్లి కృష్ణారావు పర్యాటక సలహా మండలి సభ్యులు, ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో పర్యాటక, భాషా సాంస్కృతిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వాణీప్రసాద్, పర్యాటక అభివృద్ధి సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ గౌతమి, పర్యాటక శాఖ డైరెక్టర్ లక్ష్మణ్ రంజిత్ నాయక్, భాషా సాంస్కృతిక శాఖ డైరెక్టర్ నర్సింహారెడ్డి, పర్యాటక సలహా మండలి సభ్యులు పాపారావు, రాందేవ్ రావు, బాలాజీ, జుల్ఫికర్ తదితరులు పాల్గొన్నారు.మూస పద్ధతులకు స్వస్తి పలికి వినూత్నమైన, ఆచరణ సాధ్యమైన, నిర్దిష్ట కాలపరిమితితో కూడిన ప్రతిపాదనలను రూపొందించాలని అధికారులకు మంత్రి జూపల్లి కృష్ణారావు సూచించారు. కొత్త పర్యాటక ప్రాంతాల అభివృద్ధి, ఇప్పటికే ఉన్న గమ్యస్థానాల బలోపేతం, వినూత్న పర్యాటక అనుభూతుల కల్పన, పెట్టుబడుల ఆకర్షణ, ఉపాధి అవకాశాల సృష్టి ద్వారా తెలంగాణను దేశంలోనే అగ్రగామి పర్యాటక గమ్యస్థానంగా నిలపడం ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు.ఈ సందర్భంగా పర్యాటక సలహా మండలి సభ్యులు..  పర్యాటక అభివృద్ధికి సంబంధించిన పలు ప్రతిపాదనలు, సూచనలను మంత్రి దృష్టికి తీసుకువచ్చారు.

### జిల్లా స్థాయిలో పర్యాటక వ్యవస్థను బలోపేతం చేయాలి

రాష్ట్రంలోని 33 జిల్లాల్లో పర్యాటక కార్యకలాపాల పర్యవేక్షణ, సమన్వయానికి సమర్థమైన వ్యవస్థను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని మంత్రి పేర్కొన్నారు. జిల్లా స్థాయిలో పర్యాటక అధికారులను నియమించే అంశాన్ని పరిశీలించాలని సూచించారు. పర్యాటక శాఖ, పర్యాటక అభివృద్ధి సంస్థ మధ్య సమన్వయం పెంచడంతో పాటు క్షేత్రస్థాయిలో బాధ్యతలను స్పష్టంగా నిర్దేశించాలన్నారు. అధికారులకు అవసరమైన అధికారాలను అప్పగించి, నిరంతర పర్యవేక్షణ, ఫీడ్‌బ్యాక్ వ్యవస్థను ఏర్పాటు చేయాలని సూచించారు.పర్యాటక ప్రాంతాల్లో రోజువారీ నిర్వహణ అత్యంత కీలకమని మంత్రి స్పష్టం చేశారు. మరుగుదొడ్లు, తాగునీరు, ఆహారం, పరిశుభ్రత, ఇతర సేవల నిర్వహణలో లోపాలకు తావులేకుండా చూడాలన్నారు. ఫెసిలిటీ మేనేజ్‌మెంట్ వ్యవస్థను బలోపేతం చేసి, పర్యాటక ప్రాంతాల పరిరక్షణ, నిర్వహణకు సంబంధించి రెండు, మూడు రోజుల్లో ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. పర్యాటకుల రద్దీని దృష్టిలో ఉంచుకొని తొలిదశలో కొన్ని ప్రాంతాలను గుర్తించి తాత్కాలిక కాటేజీల ఏర్పాటుకు ఉన్న అవకాశాలను పరిశీలించాలని సూచించారు.

### పెట్టుబడులకు అనువైన ప్రాంతాలను గుర్తించాలి

పర్యాటక రంగంలో ప్రభుత్వ, ప్రైవేటు పెట్టుబడులను పెంచేందుకు అవకాశమున్న ప్రాంతాలను గుర్తించడానికి ముగ్గురు సభ్యులతో కమిటీని ఏర్పాటు చేయాలని మంత్రి సూచించారు. పీపీపీ, లీజ్ విధానాల్లో ప్రాజెక్టుల అభివృద్ధికి అనువైన స్థలాలను గుర్తించి జాబితా రూపొందించాలన్నారు. ముఖ్యంగా హైదరాబాద్ వెలుపల పర్యాటక పెట్టుబడులను ప్రోత్సహించేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని పేర్కొన్నారు.పర్యాటక రంగంలో కొత్త ఆలోచనలు, వినూత్న ప్రాజెక్టులకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. వింటేజ్ కార్ల ప్రదర్శన కేంద్రం, స్కల్ప్చర్ వ్యాలీ, స్టోన్ స్కల్ప్చర్ విలేజ్, మెటల్ కాస్టింగ్ స్కల్ప్చర్ విలేజ్, గ్రాఫిటీ విలేజ్, హాలిడే విలేజ్, థీమ్ రిసార్టులు వంటి ప్రతిపాదనల సాధ్యాసాధ్యాలను అధ్యయనం చేయాలని పేర్కొన్నారు.

### హెరిటేజ్ వాక్‌లను విస్తరించాలి

హైదరాబాద్‌లోని చార్మినార్, కోఠి, పుత్లీబౌలి, లాడ్‌బజార్ తదితర ప్రాంతాల్లో హెరిటేజ్, కల్చరల్ వాక్‌లను మరింత విస్తృతంగా నిర్వహించే



అవకాశాలను పరిశీలించాలని మంత్రి సూచించారు.  పర్యటన ప్యాకేజీల రూపకల్పన, శిక్షణ పొందిన గైడ్‌ల ఏర్పాటు, పాతబస్తీ, కొత్త నగరంలోని పర్యాటక ప్రాంతాలను అనుసంధానిస్తూ ఆర్టీసీ సహకారంతో షటిల్ బస్సు సర్వీసుల నిర్వహణపై ప్రతిపాదనలు రూపొందించాలన్నారు.బోనాలు, బతుకమ్మతో పాటు తెలంగాణ కళలు, నృత్యాలు, సంగీతం, వంటకాలు, వారసత్వ సంపదను పర్యాటక ప్రమోషన్‌లో భాగం చేయాలని సూచించారు. తారామతి బారాదరిలో పర్యాటకులకు అవసరమైన మౌలిక సదుపాయాలు, టికెటింగ్, మరుగుదొడ్లు, ఇతర సేవలను మెరుగుపరిచేందుకు చర్యలు చేపట్టాలన్నారు. రాష్ట్రంలోని పర్యాటక ప్రాంతాల సమాచారం పర్యాటకులకు సులభంగా అందుబాటులో ఉండేలా సమగ్ర వెబ్‌సైట్, బ్రోచర్లు, ఇతర ప్రచార సాధనాలను రూపొందించాలని సూచించారు.

### అంతర్జాతీయ కార్నివాల్ నిర్వహణ అవకాశాలపై అధ్యయనం

హైదరాబాద్‌లో అంతర్జాతీయ స్థాయి కార్నివాల్ నిర్వహించే అవకాశాలపై సమావేశంలో చర్చించారు. తెలంగాణ వారసత్వం, కళలు, హస్తకళలు, వంటకాలు, చెరువులు, సంస్కృతి, ఆధునిక ఆవిష్కరణలకు ప్రాధాన్యం కల్పిస్తూ కార్నివాల్ నిర్వహణకు సంబంధించిన వివిధ ప్రతిపాదనలను పర్యాటక సలహా మండలి సభ్యులు మంత్రి దృష్టికి తీసుకువచ్చారు.ప్రపంచ ప్రసిద్ధ కార్నివాల్‌లను అధ్యయనం చేసి తెలంగాణ ప్రత్యేకతను ప్రతిబింబించేలా హైదరాబాద్‌లో అంతర్జాతీయ స్థాయి కార్నివాల్ నిర్వహణకు ఉన్న అవకాశాలను పరిశీలించాలని మంత్రి సూచించారు. ప్రతిపాదనలను సమగ్రంగా అధ్యయనం చేసి, సాధ్యాసాధ్యాలు, నిర్వహణ విధానం, భాగస్వామ్య సంస్థలు, అవసరమైన మౌలిక వసతులు తదితర అంశాలతో కూడిన కార్యాచరణ ప్రణాళికను రూపొందించాలని ఆదేశించారు.

### సోమశిలలో పర్యాటక అవకాశాలను అన్వేషించాలి

సోమశిలలోని దాదాపు 1,600 ఎకరాల భూమిని సమర్థంగా వినియోగించుకునేందుకు సమగ్ర అభివృద్ధి ప్రణాళిక రూపొందించాలని మంత్రి అధికారులను ఆదేశించారు. సోమశిల పరిసరాల్లోని ఆలయ సముదాయం, కృష్ణా నది బ్యాక్‌వాటర్స్, అందుబాటులో ఉన్న భూములను పరిగణనలోకి తీసుకొని పర్యాటక అభివృద్ధికి ఉన్న అవకాశాలను సమగ్రంగా అధ్యయనం చేయాలని మంత్రి సూచించారు. స్టార్ హోటళ్లు, వెడ్డింగ్ డెస్టినేషన్లు, వాటర్ స్పోర్ట్స్, గోల్ఫ్ కోర్సు తదితర ప్రతిపాదనల సాధ్యాసాధ్యాలను పరిశీలించాలన్నారు.పాలంపేట, సోమశిలతో పాటు అనువైన ఇతర పర్యాటక ప్రాంతాల్లో హోమ్‌స్టేల ఏర్పాటుకు ఉన్న అవకాశాలను అధ్యయనం చేయాలని పేర్కొన్నారు. కవ్వాల్ టైగర్ రిజర్వ్, అమ్రాబాద్ టైగర్ రిజర్వ్ లతో సహా రాష్ట్రంలోని ప్రకృతి, అటవీ పర్యాటక ప్రాంతాలకు ఆశించిన స్థాయిలో పర్యాటకులు ఎందుకు రావడం లేదో విశ్లేషించాలని సూచించారు. ప్రచారం, రవాణా, వసతి, సేవల్లో ఉన్న లోపాలను గుర్తించి వాటి పరిష్కారానికి ప్రతిపాదనలు రూపొందించాలన్నారు.పర్యాటకులకు మెరుగైన సేవలు, అనుభూతులను అందించేందుకు టూరిస్ట్ గైడ్ల ఎంపిక, వృత్తిపరమైన శిక్షణకు పటిష్ఠమైన వ్యవస్థను రూపొందించాలని మంత్రి ఆదేశించారు.

# డిజిటల్ యుగంలో బంధాల పోలిక.. ప్రకృతి నేర్పే జీవన పాఠాలెన్నో!

పసివాడు వీధి చివర నిలబడి ఆకాశంలోకి గాలిపటాన్ని ఎగరేస్తున్న దృశ్యం మనకు కేవలం ఒక వినోదంగానే కనిపించవచ్చు. కానీ, అందులో ఒక అద్భుతమైన జీవిత సత్యం అంతర్లీనంగా దాగి ఉంది. దారం ఆ బాలుడి చేతిలోనే ఉన్నప్పటికీ, గాలి వీచే దిశను బట్టి ఆ పటం ఒక్కోసారి ఆకాశ వీధిలో విహరిస్తుంది, మరికొన్ని సార్లు ఒక్కసారిగా కిందకు జారుతుంది. ఆ గాలిపటం ఎంత ఎత్తుకు ఎగురుతుందో, ఏ క్షణంలో తెగిపోతుందో ఆ అమాయకపు బాల్యానికి తెలియదు. అయినప్పటికీ, ఆ పసివాడి ముఖంలో కనిపించే ఆనందం మాత్రం వర్ణనాతీతం. ఎందుకంటే, వాడి దృష్టి కేవలం ఆ గాలిపటపు ప్రయాణాన్ని ఆస్వాదించడంలోనే ఉంది. సమకాలీన మానవ జీవితం కూడా సరిగ్గా ఇటువంటిదే. మనమందరం అదృశ్యమైన ఒక కాలమనే దారాన్ని చేతబూని, కాలప్రవాహం ఎటు వీస్తే అటు కదులుతూ, అనంతమైన విశ్వంలో ఎగురుతున్న గాలిపటాలమే అనడంలో ఎలాంటి సందేహం లేదు.ప్రస్తుత నాగరిక ప్రపంచం మానవాళికి ఒక విభిన్నమైన సామాజిక పాఠాన్ని నేర్పుతోంది. శైశవ దశ నుంచే ప్రతి ఒక్కరి మస్తిష్కంలో మొదటి స్థానంలో నిలవాలి, సమకాలీనుల కంటే ముందుండాలి,పోటీ ప్రపంచంలో నెగ్గాలి అనే నినాదాలు నిరంతరం మార్మోగుతున్నాయి. పాఠశాల స్థాయిలోనే మార్కుల కొరకై సాగే అగమ్యగోచర పోరాటం, కాలేజీలలో ప్రవేశాల కోసం పడే ఆరాటం, వృత్తిగత జీవితంలో పదోన్నతుల కోసం సాగే అంతర్గత యుద్ధాలు ఇలా ప్రతి దశలోనూ మనిషి తీవ్రమైన మానసిక ఒత్తిడికి లోనవుతున్నాడు.చివరికి ఆత్మీయులు, బంధుమిత్రుల మధ్య కూడా ఆర్థిక స్థితిగతులను, సంపాదనను పోల్చి చూసే విపరీత ధోరణి ప్రబలిపోయింది. ఈ సామాజిక ఒత్తిడి కారణంగా, సహజమైన మానవ జీవితం కాస్తా ఒక కృత్రిమ పరుగు పందెంగా రూపాంతరం చెందింది. ఈ



నేపథ్యంలోనే ఒక ప్రాథమిక ప్రశ్న ఉదయిస్తుంది: జీవితం అనేది నిజంగానే ఒక పందెమా? అంతిమ విజయమే పరమావధి అనుకుంటే, అసలు ఆ విజయానికి నిర్వచనం ఏమిటి? మనం ఎవరిని అధిగమించి ముందుకు సాగాలి? ఏ తీరానికి చేరిన తర్వాత ఈ పరుగును నిలిపివేయాలి?ఈ గందరగోళ పరిస్థితిలో, శతాబ్దాల క్రితం భగవద్గీతలో శ్రీకృష్ణ పరమాత్ముడు అర్జునునికి ప్రబోధించిన దివ్య సందేశం మనకు మార్గదర్శకంగా నిలుస్తుంది. కర్మణ్యేవాధికారస్తే మా ఫలేషు కదాచన అనే శ్లోకం కేవలం ఆధ్యాత్మిక సూక్తి మాత్రమే కాదు, అది మానవ జీవితాన్ని సరైన కోణంలో దర్శించడానికి ఉపయోగపడే ఒక అద్భుతమైన జీవన తత్వశాస్త్రం. ప్రస్తుత సమాజంలో పోటీ అనేది కేవలం ఫలితంపైనే కేంద్రీకృతమై ఉంటుంది. జయపజయాలనే రెండు తీవ్రమైన అంచుల మధ్య నలిగిపోయే సగటు మనిషికి ఈ పోటీ మానసిక అశాంతిని మిగులుస్తుంది.అయితే, జీవితాన్ని ఒక ప్రయాణంగా భావించినప్పుడు ఆ దృక్పథమే మారిపోతుంది. ప్రయాణంలో సాగే ప్రతి అడుగుకూ ఒక విశిష్టమైన అర్థం ఉంటుంది. ఎదురయ్యే ప్రతి మలుపూ ఒక నూతన అనుభవాన్ని, పాఠాన్ని నేర్పుతుంది. అందుకే పెద్దలు గమ్యం కంటే గమనమే అత్యంత ముఖ్యం అని పదే పదే స్పష్టం చేశారు.మన పురాణాలు, ఇతిహాసాలను పరిశీలిస్తే ఈ సత్యం మరింత స్పష్టమవుతుంది. శ్రీరాముని వనవాసం అనేది కేవలం ఒక శిక్షగా భావించలేము, అదొక సుదీర్ఘమైన అనుభవాల ప్రయాణం. ఆ పద్నాల్గేళ్ల కాలంలో ఆయన అరణ్యాలలో ఎంతోమంది మహర్షులను, సామాన్యులను కలుసుకున్నారు, భిన్న సామాజిక పరిస్థితులను అవగతం చేసుకున్నారు, తన ధర్మాన్ని లోకానికి చాటిచెప్పారు. అది ఎవరితోనూ సాగించిన పోటీ కాదు, అదొక ఆత్మశోధనతో కూడిన మహోన్నత ప్రయాణం. అదే విధంగా, పాండవుల అరణ్య, అజ్ఞాతవాసాలు కూడా వారిని శారీరకంగా, మానసికంగా మరింత దృఢపరిచాయి. బాహ్య ప్రపంచానికి వారు ఓడిపోయినట్లు కనిపించినప్పటికీ, ఆ ప్రయాణంలోనే వారు తమ అంతర్గత శక్తులను తెలుసుకోగలిగారు.ప్రస్తుత డిజిటల్ విప్లవ యుగంలో మానసిక ఒత్తిడి మరింత తీవ్రతరమైంది. ఉదయం నిద్ర లేచింది మొదలు సామాజిక మాధ్యమాలను (సోషల్ మీడియా) వీక్షించడం ఒక వ్యసనంగా మారింది. ఎవరో కొత్త విలాసవంతమైన కారు కొన్నారనో, మరొకరు విదేశీ పర్యటనకు వెళ్లారనో, ఇంకెవరో ఆకాశహర్మ్యాన్ని నిర్మించుకున్నారనో వచ్చే ప్రకటనలు సగటు మనిషిలో తెలియని అభద్రతా భావాన్ని సృష్టిస్తున్నాయి. తక్షణమే మన మనస్సులో ఇతరులతో పోలిక మొదలై, నేను ఎందుకు వెనుకబడిపోయాను? అనే నైరాశ్యం వెంటాడుతుంది. కానీ, ఈ కృత్రిమమైన పోలికలు, అనారోగ్యకరమైన పోటీలు మనకు నిజమైన ఆనందాన్ని ఇస్తున్నాయా లేక అంతర్గత ప్రశాంతతను దూరం చేస్తున్నాయా అని ప్రతి ఒక్కరూ ఆత్మపరిశీలన చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.మరోవైపు, మన చుట్టూ ఉన్న ప్రకృతిని గమనిస్తే మనకు ఒక నిత్యసత్యం బోధపడుతుంది. ఏ నదీ కూడా సముద్రం తో లేదా పక్కన ఉన్న మరో నదితో పోటీ పడదు. అది తన సహజ మార్గంలో నిరంతరం ప్రవహిస్తూనే ఉంటుంది. ఒక చెట్టు పక్కనున్న మరో చెట్టుతో స్పర్ధ పెట్టుకోదు. అది తన వేళ్లను భూమిలోకి బలంగా పంపుతూ, కొమ్మలను ఆకాశం వైపునకు చాస్తూ తన ఉనికిని చాటుకుంటుంది. సూర్యుడు, చంద్రుడు ఒకరితో ఒకరు పోటీ పడరు. ఎవరి కాలమానంలో వారు ఉదయించి, జగత్తుకు వెలుగును ప్రసాదిస్తారు.

ఈ అనంత సృష్టిలో ఎక్కడా బలవంతపు పోటీ లేదు. ఉన్నదల్లా కేవలం ఒక సహజసిద్ధమైన, సమతుల్యమైన జీవన ప్రయాణం మాత్రమే.అయితే, పోటీతత్వం అనేది సమాజంలో పూర్తిగా వ్యర్థమైనదని మనం భావించలేము. నిర్మాణాత్మకమైన, ఆరోగ్యకరమైన పోటీ మనిషిని నిరంతరం మెరుగుపరుస్తుంది. అది కష్టపడే తత్వాన్ని పెంపొందించి, నూతన శిఖరాలను అధిరోహించడానికి అవసరమైన ప్రేరణను అందిస్తుంది. ఒక ఉత్తమ క్రీడాకారుడు ఎప్పుడూ ఇతరులను ఓడించాలని కాకుండా, తన పాత రికార్డులను తానే బద్దలు కొట్టడానికి శ్రమిస్తాడు. ఒక విద్యార్థి తన గత మార్కులతో తానే పోటీ పడి, ప్రస్తుత విద్యా సంవత్సరంలో మరింత మెరుగైన ప్రతిభను కనబరుస్తాడు. ఇటువంటి స్వీయ పోటీ అత్యంత శ్రేయస్కరమైనది. ఎందుకంటే ఇది ఇతరులను తక్కువ చేయడానికి కాదు, తనను తాను ఉన్నతీకరించుకోవడానికి దోహదపడుతుంది. సమస్య ఎక్కడ వస్తుందంటే, ఇతరుల జీవన ప్రమాణాలను కొలమానంగా తీసుకుని, మన అంతర్గత సంతోషాన్ని త్యాగం చేసినప్పుడు మాత్రమే మానసిక పతనం ప్రారంభమవుతుంది.కాబట్టి జీవితం పోటీనా, ప్రయాణమా అనే ప్రశ్నకు సమాధానం ఒక్క మాటలో చెప్పలేం. బహుశా జీవితం ఈ రెండింటి కలయిక కావచ్చు. కానీ మన దృష్టి మాత్రం ప్రయాణం వైపే ఉండాలి. ఎందుకంటే ఒక గమ్యాన్ని చేరిన వెంటనే మరో కొత్త గమ్యం మనల్ని ఆకర్షిస్తూనే ఉంటుంది. ఉద్యోగం వచ్చాక ప్రమోషన్, ఇల్లు కట్టాక మరేదో పెద్ద ఆస్తి ఇలా అంతులేని పరుగు సాగుతూనే ఉంటుంది. ఈ పరుగులోనే మనం అత్యంత విలువైన ప్రస్తుత క్షణాన్ని, అనగా మన జీవితాన్ని పూర్తిగా కోల్పోతున్నాం.లోకమనే రంగస్థలంపై జరిగే ఈ నాటకంలో అసలైన ఆనందం గెలవడంలో లేదు, ఆ ఆటను పూర్తిగా ఆస్వాదించడంలోనే ఉంది. పసిపిల్లలు ఆడుకునేటప్పుడు గెలుపోటములను లెక్కించరు, కేవలం ఆ ఆటలోని ఆనందాన్ని మాత్రమే అనుభవిస్తారు. మనం కూడా జీవితాన్ని అదే దృక్పథంతో చూడగలిగితే, పోటీ అనే మానసిక భారం తొలగిపోయి, జీవన ప్రయాణంలోని లఘుత్వం మనకు సొంతమవుతుంది. అప్పుడే ఈ మానవ జన్మకు ఒక పరి పూర్ణమైన సార్థకత చేకూరుతుంది. అది గెలుపుఓటముల లెక్కల కంటే, అనుభవాల నెలవుగా, అనుభూతుల వెలుగుగా మారిపోతుంది.



డా. సూర్యదేవర రామకృష్ణ ,
Moral Philosopher, 9490754169

# తెలంగాణ ఉద్యమకారులకు న్యాయం ఎప్పుడు?

**త్యాగాలను గౌరవించే సంక్షేమ విధానమే నిజమైన తెలంగాణకు నివాళి**


తెలంగాణ అనేది కేవలం ఒక భౌగోళిక ప్రాంతం కాదు. అది ఆత్మగౌరవానికి, స్వీయ పాలనకు, సామాజిక న్యాయానికి, ప్రజాస్వామ్య హక్కుల సాధనకు ప్రతీక. భారతదేశ చరిత్రలో అనేక ఉద్యమాలు జరిగినప్పటికీ, ప్రజల ఆకాంక్షలతో, విద్యార్థుల త్యాగాలతో, రైతుల పోరాటాలతో, ఉద్యోగుల సహకారంతో, కళాకారుల చైతన్యంతో, మహిళల భాగస్వామ్యంతో, అమరవీరుల రక్తసాక్ష్యంతో రాష్ట్రంగా అవతరించిన ఉద్యమాలలో తెలంగాణ ఉద్యమం ఒక విశిష్ట స్థానం సంపాదించింది. అందుకే తెలంగాణ చరిత్రను పోరాటాల చరిత్రగా, త్యాగాల చరిత్రగా పేర్కొంటారు.1956లో భాషాప్రాతిపదికన రాష్ట్రాల పునర్వ్యవస్థీకరణ సందర్భంగా తెలంగాణ ప్రజల ఆకాంక్షలను పక్కనపెట్టి, అప్పటి సిఫారసులను పూర్తిగా అమలు చేయకుండా తెలంగాణను ఆంధ్ర రాష్ట్రంతో విలీనం చేయడం వల్ల ఈ ప్రాంతంలో అసంతృప్తి పెరిగింది. ఉద్యోగాలు, నీటి వనరులు, నిధులు, విద్యా అవకాశాలు, రాజకీయ ప్రాతినిధ్యం వంటి అనేక అంశాల్లో అన్యాయం జరుగుతోందనే భావన ప్రజల్లో బలపడింది. అదే భావన తరువాతి దశాబ్దాల్లో తెలంగాణ ఉద్యమానికి బలమైన పునాది వేసింది.1968–69లో ప్రారంభమైన ప్రత్యేక తెలంగాణ ఉద్యమం విద్యార్థుల నాయకత్వంలో ఉధృతరూపం దాల్చింది. వందలాది మంది యువకులు ప్రాణాలు కోల్పోయారు. వేలాది మంది జైలు జీవితం అనుభవించారు. అనేక కుటుంబాలు జీవితాంతం బాధలను మోశాయి. అయినప్పటికీ తెలంగాణ ఆకాంక్ష ఆగలేదు. తరతరాలుగా ఆ ఉద్యమ జ్వాల కొనసాగింది. ఉద్యోగులు, ఉపాధ్యాయులు, న్యాయవాదులు, రైతులు, కార్మికులు, రచయితలు, కళాకారులు, మేధావులు, ప్రొఫెసర్, ప్రజా సంఘాలు తమ వంతు పాత్ర పోషించాయి.2001 తర్వాత ఉద్యమం కొత్త దశలోకి ప్రవేశించింది. 2009 తర్వాత విద్యార్థి యువత మళ్లీ ఉద్యమానికి అగ్రగామిగా నిలిచింది. వందలాది మంది యువకులు ఆత్మబలిదానాలు చేసుకున్నారు. వేలాది మంది ఉద్యమకారులు అరెస్టులు, కేసులు, లాఠీచార్జీలు, జైలు శిక్షలు ఎదుర్కొన్నారు. చివరకు దశాబ్దాల నిరీక్షణకు ముగింపు పలుకుతూ 2014 జూన్ 2న తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించింది. ఈ రాష్ట్ర ఆవిర్భావం రాజకీయ నిర్ణయం మాత్రమే కాదు, అది వేలాది కుటుంబాల కన్నీళ్లకు, అమరవీరుల త్యాగాలకు లభించిన చారిత్రక గౌరవం.రాష్ట్రం ఏర్పడిన తర్వాత తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న వేలాది మంది ఉద్యమకారులు తమ త్యాగాలకు తగిన గుర్తింపు లభిస్తుందని ఆశించారు. కానీ ఆ ఆశలు పూర్తిస్థాయిలో నెరవేరలేదనే అభిప్రాయం ఇప్పటికీ పలువురిలో ఉంది. కొందరు ఉద్యమకారులు వృద్ధాప్యంలో ఆర్థిక ఇబ్బందులతో జీవిస్తున్నారు. మరికొందరు ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్నారు. ఉద్యమ సమయంలో విద్యను, ఉద్యోగ అవకాశాలను కోల్పోయిన అనేక మంది విద్యార్థులు ఇప్పటికీ స్థిరమైన జీవనోపాధి లేక ఇబ్బందులు పడుతున్నారు. అమరవీరుల కుటుంబాల్లో కూడా పలు సమస్యలు కొనసాగుతున్నాయి. ఉద్యమంలో ప్రధాన పాత్ర పోషించిన కళాకారులు, విద్యార్థి నాయకులు, మహిళలు, ప్రజా సంఘాల కార్యకర్తలు వంటి అనేక వర్గాలు సరైన గుర్తింపుకు ఇంకా ఎదురుచూస్తున్నాయి.ఏ రాష్ట్ర చరిత్రలోనైనా స్వాతంత్ర్య సమరయోధులకు, రాష్ట్ర సాధన కోసం పోరాడిన వారికి ప్రత్యేక గౌరవం ఇవ్వడం ప్రభుత్వాల నైతిక బాధ్యతగా పరిగణించబడుతుంది. దేశవ్యాప్తంగా స్వాతంత్ర్య సమరయోధులకు ప్రత్యేక పెన్షన్లు, వైద్య సదుపాయాలు, గౌరవాలు అందుతున్నాయి. కొన్ని రాష్ట్రాలు తమ రాష్ట్ర ఉద్యమాల్లో పాల్గొన్న వారికి ప్రత్యేక సంక్షేమ పథకాలను కూడా అమలు చేస్తున్నాయి. అదే దృష్టితో తెలంగాణ ఉద్యమకారులకు ప్రత్యేక సంక్షేమ విధానం రూపొందించాల్సిన అవసరం స్పష్టంగా కనిపిస్తోంది.ఈ నేపథ్యంలో తెలంగాణ ఉద్యమకారులకు గౌరవ వేతనం, గృహ స్థలం, గుర్తింపు కార్డులు, ఆరోగ్య భద్రత, కుటుంబ సంక్షేమం వంటి అంశాలపై ప్రభుత్వం సమగ్ర విధానాన్ని రూపొందించాలనే డిమాండ్ బలంగా వినిపిస్తోంది. ఇది కేవలం ఆర్థిక సహాయం కాదు. ఇది ఒక చారిత్రక ఉద్యమంలో భాగస్వాములైన వారికి రాష్ట్రం ప్రకటించే అధికారిక కృతజ్ఞత. ఉద్యమకారులకు ఇచ్చే పెన్షన్‌ను సాధారణ సంక్షేమ పథకంగా చూడలేం. అది వారి త్యాగాలకు సమాజం తెలిపే గౌరవ నివాళి.ఇటీవలి కాలంలో తెలంగాణ లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే ఉద్యమకారులకు 250 గజాల నివాస స్థలం, గౌరవవేతనం వంటి అంశాలపై ప్రభుత్వ స్థాయిలో చర్చ జరగడం ఉద్యమ వర్గాల్లో ఆశలను పెంచింది. అయితే హామీలకే పరిమితం కాకుండా వాటిని పారదర్శకంగా, చట్టబద్ధంగా అమలు చేయడం మరింత ముఖ్యమైనది. అర్హులైన ప్రతి ఉద్యమకారుడికి న్యాయం జరిగేలా స్పష్టమైన అర్హత ప్రమాణాలు, ధృవీకరణ వ్యవస్థ, అప్పీల్ విధానం, ప్రజలకు అందుబాటులో ఉండే ఆన్‌లైన్ నమోదు ప్రక్రియ వంటి అంశాలను సమగ్రంగా రూపొందించాలి.ఉద్యమంలో నిజంగా పాల్గొన్న వారిని గుర్తించడం ఒక సవాలు అయినప్పటికీ, అది అసాధ్యమైన పని కాదు. పోలీసు కేసులు, అరెస్టు రికార్డులు, న్యాయస్థాన పత్రాలు, వార్తాపత్రికల కథనాలు, ఉద్యమ సంఘాల ధృవీకరణలు, ఫోటోలు, వీడియోలు, ప్రత్యక్ష సాక్ష్యాలు వంటి ఆధారాలతో పారదర్శక పరిశీలన జరిపితే నిజమైన ఉద్యమకారులను గుర్తించడం సాధ్యమవుతుంది. అదే సమయంలో తప్పుడు లబ్ధిదారులకు అవకాశం లేకుండా కఠినమైన పరిశీలన వ్యవస్థను ఏర్పాటు చేయడం కూడా అంతే అవసరం.తెలంగాణ రాష్ట్ర సాధన ఒక తరం చేసిన త్యాగం. ఆ త్యాగానికి ప్రతిఫలంగా మరో తరం గౌరవంతో జీవించే అవకాశాన్ని కల్పించడం రాష్ట్రం యొక్క నైతిక బాధ్యత. ఉద్యమకారుల గౌరవాన్ని కాపాడే సంక్షేమ విధానం అమలులోకి వచ్చినప్పుడే తెలంగాణ ఉద్యమం సాధించిన విలువలకు పూర్తి అర్థం లభిస్తుంది.తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమం గురించి చర్చించేటప్పుడు కేవలం పెన్షన్ లేదా గృహ స్థలం వంటి రెండు అంశాలకే పరిమితం కావడం సరైంది కాదు. తెలంగాణ రాష్ట్ర సాధనలో పాల్గొన్న వారి త్యాగం అనేక రూపాల్లో ఉంది. కొందరు తమ విద్యను కోల్పోయారు. మరికొందరు ఉద్యోగాలను వదులుకున్నారు. వేలాది మంది జైలు శిక్షలు అనుభవించారు. పోలీసు కేసులు ఎదుర్కొన్నారు. లాఠీచార్జీల్లో గాయపడ్డారు. అనేక మంది కళాకారులు, రచయితలు, ప్రజాగాయకులు, మహిళలు, రైతులు, కార్మికులు, ఉద్యోగులు, విద్యార్థులు తమ వ్యక్తిగత జీవితాలను పక్కనపెట్టి ఉద్యమానికి అంకితమయ్యారు. అలాంటి ఉద్యమాన్ని గౌరవించాలంటే ప్రభుత్వం రూపొందించే సంక్షేమ విధానం కూడా అంతే సమగ్రంగా ఉండాలి.

ఉద్యమకారులకు అందించే నెలవారీ గౌరవవేతనాన్ని సాధారణ సామాజిక భద్రతా పథకాలతో పోల్చరాదు. ఇది వారి వయస్సు లేదా పేదరికానికి ఇచ్చే సహాయం కాదు, రాష్ట్ర సాధన కోసం చేసిన త్యాగానికి ప్రభుత్వం ప్రకటించే గౌరవ సూచిక. అందువల్ల దీనిని "ఉద్యమ గౌరవ వేతనం"గా చట్టబద్ధ హోదాతో అమలు చేయడం సముచితం. ఉద్యమంలో గాయపడిన వారు, దీర్ఘకాలం జైలు జీవితం గడిపిన వారు, ప్రజా ఉద్యమానికి పూర్తి కాలం అంకితమైన వారు వంటి వర్గాలకు ప్రత్యేక ప్రమాణాల ఆధారంగా అధిక గౌరవవేతనం ఇవ్వడం కూడా పరిశీలించవచ్చు.ఇదే విధంగా 250 గజాల గృహ స్థలం కేటాయింపు కూడా కేవలం భూమి పంపిణీ కార్యక్రమంగా ఉండకూడదు. సాధ్యమైన చోట ఒకే ప్రాంతంలో సమగ్రంగా అభివృద్ధి చేసిన ఉద్యమకారుల కాలనీలు ఏర్పాటు చేయాలి. అక్కడ రహదారులు, తాగునీరు, విద్యుత్, పార్కులు, పాఠశాలలు, ఆరోగ్య కేంద్రాలు, కమ్యూనిటీ హాల్, గ్రంథాలయం, తెలంగాణ ఉద్యమ స్మారక భవనం వంటి మౌలిక వసతులు కల్పిస్తే అవి భవిష్యత్ తరాలకు స్ఫూర్తి కేంద్రాలుగా నిలుస్తాయి. ప్రభుత్వం నగర ప్రాంతాల్లో భూమి కొరతను ఎదుర్కొంటే శివారు ప్రాంతాల్లో ప్రణాళికాబద్ధంగా టౌన్‌షిప్‌లను అభివృద్ధి చేయవచ్చు.ఉద్యమకారుల కుటుంబాల సంక్షేమం కూడా ప్రభుత్వ విధానంలో అంతర్భాగం కావాలి. అమరవీరుల కుటుంబాలకు జీవితకాల ఆర్థిక భద్రత, కుటుంబ సభ్యుల్లో ఒకరికి ఉపాధి అవకాశం, పిల్లలకు కేజీ నుంచి పీజీ వరకు ఉచిత విద్య, ఉన్నత విద్య కోసం ప్రత్యేక స్కాలర్‌షిప్‌లు, విదేశీ విద్యా సహాయం వంటి చర్యలు తీసుకోవాలి. ఉద్యమకారుల పిల్లలకు నైపుణ్యాభివృద్ధి శిక్షణ, స్వయం ఉపాధి రుణాలు, పారిశ్రామిక ప్రోత్సాహకాలు కల్పిస్తే అది సంక్షేమంతో పాటు సాధికారతకు దోహదం చేస్తుంది.

ఆరోగ్య భద్రత కూడా అత్యంత కీలకమైన అంశం. ఉద్యమ సమయంలో గాయపడినవారు, వృద్ధాప్యంలో ఉన్న ఉద్యమకారులు, అమరవీరుల కుటుంబాలకు ప్రత్యేక ఆరోగ్య కార్డులు జారీ చేసి ప్రభుత్వ, గుర్తింపు పొందిన ప్రైవేటు ఆసుపత్రుల్లో నాణ్యమైన వైద్య సేవలు ఉచితంగా అందించాలి. వృద్ధ ఉద్యమకారులకు ఇంటి వద్ద వైద్య సేవలు, వార్షిక ఆరోగ్య పరీక్షలు వంటి ప్రత్యేక కార్యక్రమాలను కూడా రూపొందించవచ్చు.ఈ మొత్తం వ్యవస్థకు బలమైన పునాది కావాల్సింది చట్టబద్ధమైన తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమ కమిషన్. ఈ కమిషన్ అర్హతల పరిశీలన, గుర్తింపు కార్డుల జారీ, సంక్షేమ పథకాల అమలు, ఫిర్యాదుల పరిష్కారం, వార్షిక నివేదికల సమర్పణ వంటి బాధ్యతలను నిర్వహించాలి. జిల్లా స్థాయిలో ఉప కమిటీలు, రాష్ట్ర స్థాయిలో నిపుణులతో కూడిన పర్యవేక్షణ మండలి ఉంటే పారదర్శకత మరింత పెరుగుతుంది.

ఉద్యమకారుల గుర్తింపులో పారదర్శకత అత్యంత కీలకం. నిజమైన ఉద్యమకారులు అన్యాయం ఎదుర్కోకుండా, అదే సమయంలో తప్పుడు లబ్ధిదారులకు అవకాశం లేకుండా స్పష్టమైన అర్హత ప్రమాణాలను రూపొందించాలి. పోలీసు కేసులు, అరెస్టు రికార్డులు, కోర్టు పత్రాలు, ఉద్యమ సంస్థల ధృవీకరణలు, పత్రికా కథనాలు, ఫోటోలు, వీడియోలు, ప్రజాప్రతినిధుల సిఫారసులు వంటి ఆధారాలను సమగ్రంగా పరిశీలించే విధానం ఉండాలి. తిరస్కరించబడిన దరఖాస్తులకు అప్పీల్ చేసే అవకాశం కల్పించడం కూడా న్యాయబద్ధ పరిపాలనలో భాగం.సంక్షేమంతో పాటు ఉద్యమ చరిత్రను పరిరక్షించడం కూడా ప్రభుత్వ బాధ్యత. తెలంగాణ ఉద్యమానికి సంబంధించిన పత్రాలు, చిత్రాలు, వీడియోలు, అరుదైన వస్తువులు, అమరవీరుల జీవిత విశేషాలు, ఉద్యమ గీతాలు, ప్రజా కళారూపాలను ఒకేచోట భద్రపరిచే రాష్ట్ర స్థాయి మ్యూజియం ఏర్పాటు చేయాలి. ప్రతి జిల్లాలో అమరవీరుల స్మారక వనం, ఉద్యమ స్ఫూర్తి కేంద్రం ఏర్పాటు చేస్తే చరిత్ర ప్రజలకు మరింత చేరువ అవుతుంది.తెలంగాణ ఉద్యమంలో కళాకారుల పాత్ర విశేషమైనది. జానపద గీతాలు, బుర్రకథలు, ఒగ్గుకథలు, నాటకాలు, కవిత్వం ఉద్యమానికి ప్రాణం పోశాయి. అందువల్ల తెలంగాణ జానపద కళల అభివృద్ధికి ప్రత్యేక విశ్వవిద్యాలయం లేదా పరిశోధనా సంస్థ ఏర్పాటు చేయడం సమయోచిత నిర్ణయం అవుతుంది. ఉద్యమ కళాకారులకు గౌరవ వేతనాలు, పరిశోధన అవకాశాలు, యువతకు శిక్షణా కేంద్రాలు ఏర్పాటు చేస్తే ఉద్యమ స్ఫూర్తి తరతరాలకు కొనసాగుతుంది.తెలంగాణ ఉద్యమ చరిత్రను పాఠ్యపుస్తకాలలో సమగ్రంగా చేర్చడం కూడా అవసరం. విద్యార్థులు కేవలం రాష్ట్ర ఆవిర్భావ తేదీని మాత్రమే కాకుండా, ఆ రాష్ట్రం కోసం జరిగిన ప్రజా పోరాటాలను, త్యాగాలను, రాజ్యాంగబద్ధమైన ఉద్యమాల విలువను తెలుసుకోవాలి. అప్పుడు మాత్రమే భవిష్యత్ తరాలకు ప్రజాస్వామ్యంపై, సామాజిక న్యాయంపై మరింత అవగాహన పెరుగుతుంది.మొత్తంగా చూస్తే తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమ విధానం అనేది ఒక ప్రభుత్వ పథకం మాత్రమే కాదు. అది తెలంగాణ సమాజం తన చరిత్రకు, తన త్యాగాలకు, తన విలువలకు ఇచ్చే గౌరవం. అందుకే ఈ విధానం రాజకీయ ప్రకటనగా కాకుండా, శాశ్వత ప్రజా విధానంగా రూపుదిద్దుకోవాలి.తెలంగాణ రాష్ట్రం ఏర్పడి దశాబ్దానికి పైగా గడిచినా ఉద్యమకారుల సంక్షేమంపై సమగ్ర చట్టం ఇప్పటికీ లేకపోవడం ఒక లోటుగా చెప్పాలి. ఉద్యమంలో పాల్గొన్న వేలాది మంది ప్రజల సేవలను గుర్తించడం ఒక ప్రభుత్వ సంకల్పంపై మాత్రమే ఆధారపడకుండా, శాశ్వత చట్టబద్ధ వ్యవస్థ ద్వారా కొనసాగాలి. ప్రభుత్వం మారినా విధానం మారకుండా ఉండాలంటే "తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమ చట్టం" రూపొందించి రాష్ట్ర శాసనసభలో ఆమోదించడం అత్యంత అవసరం. ఆ చట్టంలో అర్హత ప్రమాణాలు, గౌరవ వేతనం, గృహ భద్రత, వైద్య సదుపాయాలు, విద్యా హక్కులు, కుటుంబ సంక్షేమం, ఫిర్యాదుల పరిష్కారం, నిధుల కేటాయింపు వంటి అంశాలను స్పష్టంగా పొందుపరచాలి.ఈ చట్టం అమలుకు ప్రత్యేక నిధిని ఏర్పాటు చేయడం కూడా అవసరం. వార్షిక బడ్జెట్‌లో ప్రత్యేక నిధిని కేటాయించడం ద్వారా ఉద్యమకారుల సంక్షేమ కార్యక్రమాలకు నిరంతర ఆర్థిక భరోసా కల్పించవచ్చు. అదే విధంగా ప్రతి మూడు నెలలకు ఒకసారి అమలు పురోగతిపై ప్రజలకు నివేదిక విడుదల చేస్తే పారదర్శకత పెరుగుతుంది.ఉద్యమకారులకు రాజకీయ, సామాజిక ప్రాతినిధ్యం కల్పించడం కూడా సముచితం. ఉద్యమం కోసం జీవితాన్ని అంకితం చేసిన వారికి ప్రభుత్వ సలహా మండళ్లు, కార్పొరేషన్లు, కమిషన్లు, సాంస్కృతిక సంస్థలు, స్థానిక సంస్థలలో తగిన ప్రాతినిధ్యం కల్పిస్తే ఉద్యమ అనుభవం ప్రజా పరిపాలనకు ఉపయోగపడుతుంది. ప్రజాస్వామ్యంలో త్యాగాలను గౌరవించే మార్గం కేవలం సత్కారాలు మాత్రమే కాదు; నిర్ణయాత్మక వ్యవస్థల్లో భాగస్వామ్యం కల్పించడం కూడా అంతే ముఖ్యమైనది.తెలంగాణ ఉద్యమ చరిత్రను భవిష్యత్ తరాలకు సజీవంగా అందించేందుకు రాష్ట్రవ్యాప్తంగా స్మారక నిర్మాణాలు చేపట్టాలి. ప్రతి జిల్లాలో అమరవీరుల స్మారక వనం, ఉద్యమ మ్యూజియం, పరిశోధనా కేంద్రం, డిజిటల్ ఆర్కైవ్ ఏర్పాటు చేయాలి. ఉద్యమానికి సంబంధించిన పత్రాలు, చిత్రాలు, వీడియోలు, అరుదైన వస్తువులు, జానపద గీతాలు, ఉద్యమ సాహిత్యం, ప్రజా కళారూపాలను శాశ్వతంగా భద్రపరచాలి. ఇవి కేవలం స్మారకాలు కాకుండా పరిశోధన, విద్య, ప్రజా చైతన్యానికి కేంద్రాలుగా మారాలి.హైదరాబాద్‌లో దేశ రాజధానిలోని ఇండియా గేట్ తరహాలో తెలంగాణ అమరవీరులకు అంకితమైన ఒక విశిష్ట స్మారక సముదాయాన్ని నిర్మించాలనే ఆలోచన కూడా పరిశీలించదగినది. అక్కడ అమరవీరుల పేర్లు, ఉద్యమ చరిత్ర, డిజిటల్ ప్రదర్శనలు, శాశ్వత జ్యోతి, పరిశోధన కేంద్రం, గ్రంథాలయం, యువతకు చరిత్రను పరిచయం చేసే ప్రదర్శనశాలలు ఏర్పాటు చేస్తే అది తెలంగాణ ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలుస్తుంది.ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన జానపద కళాకారుల సేవలను గుర్తిస్తూ ప్రత్యేక జానపద విశ్వవిద్యాలయం లేదా రాష్ట్ర స్థాయి పరిశోధనా సంస్థను ఏర్పాటు చేయడం ద్వారా తెలంగాణ సాంస్కృతిక వారసత్వాన్ని పరిరక్షించవచ్చు. ఉద్యమ గీతాలు, ప్రజా కళలు, తెలంగాణ భాషా వైవిధ్యం, జానపద సాహిత్యంపై పరిశోధనలకు ప్రోత్సాహం లభిస్తుంది. అదే సమయంలో ఉద్యమ కళాకారులకు ఉపాధి అవకాశాలు కూడా విస్తరిస్తాయి.అలాగే ప్రతి సంవత్సరం తెలంగాణ ఉద్యమకారుల దినోత్సవాన్ని రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించడం ద్వారా ఉద్యమంలో పాల్గొన్న ప్రతి వర్గాన్ని సత్కరించే సంప్రదాయాన్ని ఏర్పరచాలి. పాఠశాలలు, కళాశాలలు, విశ్వవిద్యాలయాల్లో ఉద్యమ చరిత్రపై వ్యాసరచన, వక్తృత్వం, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తే యువతకు ఉద్యమ స్ఫూర్తి చేరుతుంది.

అయితే ఈ మొత్తం ప్రక్రియలో ఒక ముఖ్యమైన అంశాన్ని ఎప్పుడూ మరచిపోకూడదు. ఉద్యమకారుల సంక్షేమ పథకాల అమలులో పారదర్శకత, నిష్పాక్షికత, సామాజిక న్యాయం తప్పనిసరి. ఉద్యమంలో పాల్గొన్న ప్రతి వర్గానికి సమాన అవకాశాలు లభించేలా, నిజమైన అర్హులకు మాత్రమే ప్రయోజనం అందేలా బలమైన ధృవీకరణ వ్యవస్థ ఉండాలి. బోగస్ లబ్ధిదారులకు అవకాశం లేకుండా సాంకేతిక ఆధారిత పరిశీలన, స్వతంత్ర అప్పీల్ వ్యవస్థ, ప్రజాపర్యవేక్షణ వంటి చర్యలు అమలు చేయాలి.తెలంగాణ ఉద్యమం కేవలం ఒక రాష్ట్రాన్ని సాధించడం కోసం జరిగిన రాజకీయ పోరాటం కాదు. అది ఆత్మగౌరవం, స్వీయ పాలన, సమాన అవకాశాలు, సామాజిక న్యాయం కోసం సాగిన చారిత్రక ప్రజా ఉద్యమం. ఆ ఉద్యమం విజయవంతం కావడానికి వేలాది మంది తమ జీవితాలను అంకితం చేశారు. వారి త్యాగాలను కేవలం జ్ఞాపకాలలో నిలుపుకోవడం సరిపోదు; సంక్షేమ విధానాల రూపంలో, చట్టబద్ధ హక్కుల రూపంలో, విద్యా వ్యవస్థలో, సాంస్కృతిక నిర్మాణాల్లో శాశ్వతంగా నిలపాలి.తెలంగాణ రాష్ట్రం ఏర్పడడానికి కారణమైన అమరవీరులు, ఉద్యమకారులు, విద్యార్థులు, రైతులు, ఉద్యోగులు, మహిళలు, కళాకారులు, ప్రజా సంఘాల సేవలను గుర్తించి సమగ్ర సంక్షేమ విధానాన్ని అమలు చేయడం ఏ ప్రభుత్వానికైనా రాజకీయ వాగ్దానం మాత్రమే కాదు, చారిత్రక బాధ్యత కూడా. ఈ బాధ్యతను నెరవేర్చినప్పుడే తెలంగాణ ఉద్యమం సాధించిన లక్ష్యాలకు పూర్తి అర్థం వస్తుంది. త్యాగాలను గౌరవించే రాష్ట్రంగానే తెలంగాణ చరిత్రలో చిరస్థాయిగా నిలుస్తుంది.



మన్నారం నాగరాజు
సామాజిక రాజకీయ విశ్లేషకులు

# కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కొలన్ రాజశేఖర్ రెడ్డి జన్మదిన వేడుకలు

**కుత్బుల్లాపూర్ (వెలుతురు ప్రతినిధి) జూలై 07:**



నిజాంపేట్ సర్కిల్ అధ్యక్షులు కొలన్ రాజశేఖర్ రెడ్డి జన్మదిన వేడుకలు మంగళవారం ప్రగతి నగర్ (276) డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బొమ్ము వెంకటేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో ప్రగతినగర్, బాచుపల్లి నిజాంపేట్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కోటపాటి మురళి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.ఈసందర్భంగా నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున హాజరై కేక్ కట్ చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం బాణాసంచా కాల్చి సంబరాలు జరుపుకున్నారు.ఈకార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ చిట్ల దివాకర్, బండారు లేఔట్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వరగాని వాసు, రాష్ట్ర మహిళా కాంగ్రెస్ నాయకురాలు రఫియా బేగం, బిక్కన్ షా, కొలన్ బాల్ రెడ్డి, రాజేంద్ర, రాంచందర్ నాయక్, మొహమ్మద్, ఏరోళ్ల విష్ణు, వేణు, సురేందర్, దాసరి మహేష్, శ్రీనివాస్, మెడ శ్రీనివాస్, సయ్యద్ రఫాత్, మద్ది నారాయణ రెడ్డి, ప్రశాంత్ రెడ్డి, సోము, దాసరి మహేష్, తులసి దాస్, సీనియర్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, స్థానిక ప్రజలు, కాంగ్రెస్ పార్టీ శ్రేణులు పాల్గొని కొలన్ రాజశేఖర్ రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

# ద్విచక్ర వాహన చోరి కేసులో అరెస్ట్, రిమాండ్

**కుత్బుల్లాపూర్ (వెలుతురు ప్రతినిధి) జూలై 07:**



బాచుపల్లి పోలీస్ స్టేషన్ క్రైమ్ సిబ్బంది ద్విచక్ర వాహనాల చోరీలకు పాల్పడుతున్న ఒక నేరస్థుని మంగళవారం అరెస్టు చేశారు.లేట్ల ప్రవీణ్ వయస్సు 25 సంవత్సరాలు, నివాసం ప్రగతినగర్ ఆర్ జి కె సొంత ఊరు బిజినపల్లి నాగర్ కర్నూల్ జిల్లా , అదుపులోకి తీసుకొని జ్యుడీషియల్ రిమాండ్ కి తరలించారు.నిందితుడి నుండి 2 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకోవడం జరిగింది. యమహా ఆర్ఎక్స్ నంబర్AP 02 F 6793 ( Cr. No- 603/2026 U/Sec. 305(b) BNS బాచుపల్లి పోలీస్ స్టేషన్, రెండవది యమహా ఆర్ ఎక్స్ 135 AP 01 F 2675 ఇతనిపై వివిధ పోలీస్ స్టేషన్ నిందితుడు మీద ఉన్న పాత కేసు వివరాలు:1)540/2026u/s 305(b) BNS

బాచుపల్లి పోలీస్ స్టేషన్

2).1039/25 u/s 305(b) BNS దుండిగల్ పోలీస్ స్టేషన్ కేసులు ఉన్నాయి. మంగళవారం రిమాండ్ కు తరలించారు.

# ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ (సార్) ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలి జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి

**ఇబ్రహీంపట్నం వెలుతురు జులై 07:**

ఇబ్రహీంపట్నం నియోజకవర్గం కొంగరకలన్ రంగారెడ్డి జిల్లా కార్యాలయంలో జరిగిన ప్రత్యేక ఇం టెన్సివ్ రివిజన్ సార్ కార్యక్రమంఅమలుపై జిల్లాకలెక్టర్ సంబంధిత అధికారులతో మంగళవా రం వీడియోకాన్ఫరెన్స్ నిర్వహించి పురోగతిని సమీక్షించారు ఈ వీడియోకాన్ఫరెన్స్‌లో జిల్లాలోని ఆర్డీ వోలు జోనల్ మున్సిపల్ కమిషనర్లు డిప్యూటీ కలెక్టర్లు జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారిజిల్లా వి ద్యాశాఖ అధికారి వ్యవసాయ మార్కెట్ కమిటీ అధికారులు తహసీల్దార్లుమున్సిపల్ కమిషనర్లు ఎంపీడీవోలు ఏపీఎంలు ఏపీఓలు ఎంపీఓలు సీడీపీఓలు మెప్మా అధికారులు ప్రభుత్వ డిగ్రీ కళా శాలల ప్రిన్సిపాల్స్ సూపర్వైజర్లు తదితర అధికారులు పాల్గొన్నారు ఈసందర్భంగా జిల్లా కలెక్టర్ సి నారాయణరెడ్డి మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటివరకు 92శాతం ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ పూర్తయిందని.మిగిలిన ఫారాల పంపిణీని ఈరోజు సాయంత్రంలోపు పూర్తిచేయాలని అధికా రులను ఆదేశించారు బూత్ లెవల్ అధికారులు ప్రజల నుంచి నింపిన ఎన్యూమరేషన్ ఫారాలను సకాలంలో సేకరించి వెంటనే సంబంధితయాప్‌లో డిజిటలైజేషన్ ప్రక్రియను ప్రారంభించాలని సూ చించారుజిల్లాలోని ప్రతిఅర్హత కలిగిన ఓటరు ముసాయిదా ఓటరు జాబితాలో నమోదు అయ్యే లా అనర్హులను ఓటరు జాబితా నుంచి తొలగించేలా అన్నిశాఖలు సమన్వయంతో పనిచేయాల ని ఆదేశించారు ప్రతిపోలింగ్



కేంద్రానికి అవసరమైనమేర ప్రత్యామ్నాయ సిబ్బందిని గుర్తించాలని, ఫారాల నింపడం పరిశీలించడం డిజిటలైజేషన్ పనులకోసం ఉపాధ్యాయులు ప్రభుత్వడిగ్రీ కళా శాలల విద్యార్థులు అదనపుసిబ్బంది వాలంటీర్ల సేవలను వినియోగించుకోవాలని సూచించారు ప్రతిపోలింగ్ కేంద్రంలో కనీసం రెండు హెల్ప్‌డెస్క్‌లు ఏర్పాటుచేసి ప్రజలకు అవసరమైన స హాయం అందించాలని ఆదేశించారు ఎన్నికల నమోదు అధికారులు సహాయఎన్నికల నమోదు అధి కారులు ప్రతి పోలింగ్ కేంద్రంలో బలమైన బృందాలను ఏర్పాటు చేసి ప్రక్రియను సమర్థవంతంగా పర్యవేక్షించాలని తెలిపారు ఈరోజునుంచే కార్యాచరణప్రణాళికను సిద్ధంచేసి రేపటి నుంచి గ్రా మాలు మున్సిపల్ వార్డుల స్థాయిలో సర్ ఫారం ఫిల్లింగ్ మేళాలు నిర్వహించాలని సూ చించా రుఫారాల నిర్వహణలో పూర్తి పారదర్శకత పాటించాలని బీఎల్ఓలు ఫారాలను సక్రమంగా స్వీక రించి ప్రత్యేకంగా నియమించిన సిబ్బందితో పరిశీలింపజేసి అనంతరం సంబంధిత యాప్‌లో డిజి టలైజ్ చేసి భద్రపరచాలని ఆదేశించారు ప్రతిదశకు సంబంధించిన మాన్యువల్ రికార్డులనుకూడా తప్పనిసరిగా నిర్వహించాలని సూచించారు ప్రతిరోజు కనీసం20శాతం పనులు పూర్తయ్యేలా కా ర్యాచరణ రూపొందించాలని రాబోయే ఐదురోజుల్లో 100 శాతం లేదా కనీసం 90శాతం ప్రక్రియ పూర్తి చేసే లక్ష్యంతో పనిచేయాలని అధికారులకు సూచించారు మండలస్థాయి సీనియర్ అధికా రులు పోలింగ్ కేంద్రాలను వర్గీకరించి అవసరాన్నిబట్టి పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణ ప్రక్రియ ను రేపటి నుంచిప్రారంభించాలని ఆదేశించారు ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ మొత్తం ప్రక్రియను జి ల్లా స్థాయి అధికారులు మండలస్థాయి అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని జిల్లా కలెక్టర్ ఆ దేశించారు ముసాయిదా ఓటరు జాబితా సిద్ధమైన అనంతరం రాజకీయ పార్టీల ప్రతిని ధులతో స మావేశాలు నిర్వహించివారి అభిప్రాయాలను సేకరించి సంబంధిత నివేదికను జిల్లాయంత్రాంగా నికి సమ ర్పించాలని సూచించారువీడియో కాన్ఫరెన్స్అనంతరం జిల్లాక లెక్టర్ జిల్లాలోని ప్రతి ఆర్డీ వో జోనల్ మున్సిపల్ కమిషనర్లతో విడివిడిగా మాట్లాడి వారి కార్యాచరణ ప్రణాళికలను స మీ క్షించారు నిర్దేశించిన లక్ష్యాలను నిర్ణీతగడువులోగా పూర్తి చేసేందుకు సమన్వయంతో కృషిచేయా లని అధికారులను ఆదేశించారు .

# ఆరుట్ల గ్రామపంచాయతీ కార్యాలయానికి బిఆర్ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కుర్చీలను విరాళంగా అందజేసిన ఫౌండేషన్ సభ్యులు

- **గ్రామపంచాయతీ కార్యాలయానికి కుర్చీలు విరాళంగా అందజేసిన బి అర్ ఆర్ ఫౌండేషన్ చైర్మన్ బూడిద రాంరెడ్డి కి ప్రత్యేక ధన్యవాదాలు**
- **ఆరుట్ల గ్రామ సర్పంచ్ మానిపాటి శోభా కుమార్**

**మంచాల వెలుతురు జులై 07:**

మంచాల మండలం ఆరుట్ల గ్రామంలో సామాజిక సేవ కార్యక్రమంలోభాగంగా గ్రామపంచాయతీ కార్యాలయానికి బిఅర్ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కుర్చీలు విరాళంగా గ్రామసర్పంచ్ మానిపాటి శోభాకుమార్ కుఅందజేసిన ఫౌండేషన్ సభ్యులు పున్నంరాము మహమ్మద్ సద్దాం సందర్భంగా అరుట్ల గ్రామసర్పంచ్ మానిపాటి శోభాకుమార్ మాట్లాడుతూ గ్రామపంచాయతీ అవసరాలకోసం కుర్చీలను విరాళంగా అందజేసి గ్రామఅభివృద్ధికి తమవంతు సహకారాన్ని అందించి సేవాభావం చాటుకున్న బిఅర్ఆర్ ఫౌండేషన్ చైర్మన్ బూడిద రాంరెడ్డిగారికి ఆరుట్ల గ్రామపంచాయతీ పాలక మండలి పక్షాన ప్రత్యేకధన్యవాదాలు తెలిపారు బిఅర్ ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గ్రామాల్లో ప్రజల ఇబ్బందులు తెలుసుకొని వాటర్ ఫిల్టర్లు ఏర్పాటు త్రాగునీటి ఇబ్బందులు తీర్చడానికి బోర్లు వేయించి ప్రజలస మస్యలు పరిష్కరించడం అనారోగ్యంతో ఉన్న ప్రజలకు ఆసరాగా ఉంటాను అ ని భరోసాకల్పిస్తూ ఆర్థిక సహాయం అందించడం ప్రజలకోసం మరెన్నోసేవా కార్యక్రమాలు చేస్తూ ముందుకెళ్లడం అభినందనీయం అనిఅన్నారు గ్రామాల్లో బిఅర్ ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో చే స్తున్న సేవలనుచూసి గ్రామాల్లో ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు అనిఅన్నారు ఈ కార్యక్ర మంలోగ్రామపంచాయతీ కార్యదర్శి చిలుకల



వెంకటేష్ గ్రామపంచాయతీ వార్డు సభ్యులు రావులజంగయ్య మానిపాటి భానుప్రసాద్ మాడుగుల బాలమని కృష్ణగౌడ్ లాలగారి మణెమ్మ గ్రామ స్తులు మహమ్మద్ యుసుఫ్ అలీ నుకం శేఖర్ ముదిరాజ్ కావాలి నరసింహ ముదిరాజ్ ఆనం గళ్ళ నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

# జననేత డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి సేవలు చిరస్మరణీయం





**(మొదటి పేజీ తరువాయి)**

రైతులు, పేదలు, విద్యార్థులు, మహిళలు, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతే ఆయన రాజకీయ తత్వమని అన్నారు.ప్రజా ప్రస్థానం పాదయాత్ర ద్వారా ప్రజల కష్టాలను ప్రత్యక్షంగా తెలుసుకుని, అధికారంలోకి వచ్చిన తర్వాత వాటికి అనుగుణంగా సంక్షేమ కార్యక్రమాలను అమలు చేయడం వైఎస్సార్ నాయకత్వ విశిష్టత అని మహేష్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు. రైతులకు ఉచిత విద్యుత్, ఆరోగ్యశ్రీ, 108 అత్యవసర అంబులెన్స్ సేవలు, ఫీజు రీయింబర్స్‌మెంట్, ఇందిరమ్మ గృహాలు, జలయజ్ఞం వంటి పథకాల ద్వారా కోట్లాది మంది జీవితాల్లో మార్పు తీసుకొచ్చారని గుర్తు చేశారు.ప్రజలతో మమేకమై వారి సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లడం, సంక్షేమాన్ని పాలనా విధానంగా మలచడం ద్వారా వైఎస్సార్ దేశ రాజకీయాల్లో ప్రత్యేక ముద్ర వేశారని అన్నారు.ప్రజా సంక్షేమానికి అంకితమైన ఆయన సేవలు ఎల్లప్పుడూ స్ఫూర్తిదాయకంగా నిలుస్తాయని పేర్కొన్నారు.ప్రజా సేవ పట్ల అంకితభావం, పేదల పట్ల అపారమైన నిబద్ధత, సమాజంలోని ప్రతి వర్గం అభ్యున్నతికి కృషి చేసిన నాయకుడిగా డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి తెలుగు ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోతారని మహేష్ కుమార్ గౌడ్ అన్నారు.ఈ సందర్భంగా ప్రజానేత వైఎస్సార్ ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని ప్రజా సంక్షేమం, సామాజిక న్యాయం, సమగ్ర అభివృద్ధి లక్ష్యాల సాధనకు ప్రతి కాంగ్రెస్ కార్యకర్త కట్టుబడి పనిచేయాలని ఆయన పిలుపునిచ్చారు.

# మున్సిపల్ కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని: సీఐటీయూ డిమాండ్

**కుత్బుల్లాపూర్ (వెలుతురు ప్రతినిధి) జూలై 07:**

నిజాంపేట్ సర్కిల్ పరిధిలో పనిచేస్తున్న మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ... సీఐటీయూ బాచుపల్లి మండల కమిటీ ఆధ్వర్యంలో నిజాంపేట్ సర్కిల్ మున్సిపల్ కార్యాలయం (జీహెచ్ఎంసీ) ఎదుట మున్సిపల్ కార్మికులతో ధర్నా నిర్వహించారు. అనంతరం డిప్యూటీ కమిషనర్ సాబీర్ అలీకి వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా సీఐటీయూ తెలంగాణ మున్సిపల్ వర్కర్స్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా కార్యదర్శి N. శ్రీనివాస్ మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులు తక్కువ వేతనాలతో, సరైన భద్రతా పరికరాలు లేకుండా, అనేక ఇబ్బందులను ఎదుర్కొంటూ పనిచేస్తున్నారని తెలిపారు. కార్మికుల శ్రమకు తగిన గుర్తింపు, హక్కులు కల్పించడం ప్రభుత్వ బాధ్యతని పేర్కొన్నారు. వారు ప్రధానంగా ఈ డిమాండ్లను ప్రభుత్వం, అధికారులు వెంటనే అమలు చేయాలని కోరారు. మున్సిపల్ కార్మికులకు నెలకు రూ.26,000 కనీస వేతనం అమలు చేయాలని, పెండింగ్‌లో ఉన్న ఈఎస్ఐ, పీఎఫ్ బకాయిలను వెంటనే చెల్లించాలని,



జీహెచ్ఎంసీ కార్మికులకు అమలులో ఉన్న వేతనాలు, సౌకర్యాలు, ప్రభుత్వ జీవోలను నిజాంపేట్ సర్కిల్ కార్మికులకు అమలు చేయాలన్నారు.కార్మికులకు చీపుర్లు, షూస్, గ్లోవ్స్, సబ్బులు, నూనెలు, భద్రతా ఎప్రాన్, డ్రైనేజీ పనిముట్లు తదితర భద్రతా సామగ్రిని క్రమం తప్పకుండా అందించాలని, ప్రగతినగర్ నుంచి బాచుపల్లికి బదిలీ చేసిన కార్మికులను తిరిగి ప్రగతినగర్‌లోనే విధులకు నియమించాలని కోరారు. ప్రతి కార్మికుడికి నిబంధనల ప్రకారం క్యాజువల్ సెలవులు మంజూరు చేయాలని, జీహెచ్ఎంసీలో అమలులో ఉన్న రూ.18,500 వేతనాన్ని నిజాంపేట్ సర్కిల్ మున్సిపల్ కార్మికులకు అమలు చేయాలని, అధికారుల వేధింపులను నిలిపివేసి 8 గంటల పని దినాన్ని అమలు చేయాలని, జీహెచ్ఎంసీలో అమలులో ఉన్న పండుగ సెలవులు, మహిళలకు సంబంధించిన ప్రత్యేక సెలవులు ఇతర సంక్షేమ జీవోలను నిజాంపేట్ సర్కిల్‌లో పూర్తిగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్మికుల న్యాయమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించకపోతే సీఐటీయూ ఆధ్వర్యంలో ఉద్యమాన్ని మరింత ఉద్ధృతం చేస్తామని హెచ్చరించారు. ఈకార్యక్రమంలో సీఐటీయూ తెలంగాణ మున్సిపల్ వర్కర్స్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా కమిటీ సభ్యుడు ఉన్నికృష్ణ, నిజాంపేట్ సర్కిల్ CITU మున్సిపల్ అధ్యక్షుడు రాథోడ్ సంతోష్, సిఐటియు మండల కమిటీ సభ్యులు పి.భాస్కర్ నిజాంపేట్ సర్కిల్ మున్సిపల్ కార్యదర్శి పెంటయ్య, సిఐటియు మున్సిపల్ మండల కమిటీ సభ్యులు నరసింహ, లక్ష్మి , ఈశ్వరయ్య, నాగలక్ష్మి , రాములు, శ్రీను, నాగజ్యోతి, నాగశేషు, తిరుపతి, మైపాల్‌తో కార్మికులు, పాల్గొన్నారు.

# రూ 10 కోట్ల 90 లక్షలతో దూలపల్లి–జీడిమెట్ల పారిశ్రామిక వాడ రహదారి అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్

**కుత్బుల్లాపూర్ (వెలుతురు ప్రతినిధి) జూలై 07:**

కుత్బుల్లాపూర్ మాజీ శాసనసభ్యులు కూన శ్రీశైలం గౌడ్ మంగళవారం దూలపల్లి గ్రామం నుంచి జీడిమెట్ల పారిశ్రామిక వాడకు వెళ్లే సుమారు రెండు కిలోమీటర్ల రహదారి అభివృద్ధి పనులకు స్థానిక నాయకులు, ప్రజలతో కలిసి శంకుస్థాపన చేశారు. నాలుగు నెలల క్రితం స్థానిక ప్రజల విజ్ఞప్తి మేరకు పూర్తిగా దెబ్బతిన్న ఈ రహదారిని కూన శ్రీశైలం గౌడ్ స్వయంగా పరిశీలించారు. అనంతరం రహదారి నిర్మాణానికి తక్షణమే నిధులు మంజూరు చేయాలని కోరుతూ సంబంధిత సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌తో పాటు సంబంధిత మంత్రులకు లేఖలు అందజేశారు.ఆయన చేసిన నిరంతర కృషి ఫలితంగా రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ఈ రహదారి నిర్మాణానికి పరిపాలనా అనుమతి మంజూరు చేసి, రూ.10.90లక్షలు నిధులను విడుదల చేసింది. టెండర్ ప్రక్రియ పూర్తికావడంతో ఈరోజు అభివృద్ధి పనులను ప్రారంభించారు.ఈ సందర్భంగా కూన శ్రీశైలం గౌడ్ మాట్లాడుతూ,10 సంవత్సరాల పాటు పాలించిన బిఆర్ఎస్ పార్టీ స్థానిక ఎమ్మెల్యే ఏలాంటివి అభివృద్ధి కార్యక్రమాలకు నిధులు కేటాయించకుండా ప్రజలకు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు అన్నారు, ఈ రోడ్డు ధ్వంసమైననేపథంలో అనేకమంది ఈ రహదారీ గుండా ప్రయాణించే ఉద్యోగుల ఇతర స్థానిక ప్రజలు ప్రమాదాలకు గురయ్యారని విమర్శించారు,అదేవిధంగా రహదారి నిర్మాణ పనులను నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా, నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని సంబంధిత కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. ఈ రహదారి పూర్తయితే దూలపల్లి గ్రామ ప్రజలతో పాటు జీడిమెట్ల పారిశ్రామిక వాడకు నిత్యం రాకపోకలు సాగించే వేలాది మంది కార్మికులు, ఉద్యోగులు, వాహన దారులకు ఎంతో సౌకర్యం కలుగుతుందని ఆయన పేర్కొన్నారు.రోడ్డు నిర్మాణానికి పూర్తిస్థాయిలో సహకరించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి అదేవిధంగా జిల్లా ఇన్చార్జ్ మంత్రివర్యులు శ్రీధర్ బాబు మరియు గతంలో కుత్బుల్లాపూర్ జోనల్ కమిషనర్ గా ఉన్నటువంటి సందీప్ కుమార్ ఝా ఐఏఎస్ కి మరియు ప్రస్తుత సీఎంసి



కమిషనర్ సృజన ఐఏఎస్ కి శ్రీశైలం గౌడ్ ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.అనంతరం జీడిమెట్ల పారిశ్రామిక కంపెనీల ప్రతినిధులు మాజీ ఎమ్మెల్యే శ్రీశైలం గౌడ్ కి ధన్యవాదాలు తెలుపుతూ శాలువాతో సత్కరించారు.ఈ కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు మాజీ



సర్పంచ్ జిమ్మి దేవేందర్, భాస్కర్ గౌడ్, మోహన్ రావు, కావలి గోపాల్,నాగేశ్వరరావు, రంగారావు,చాంద్ పాషా, మల్లేష్, వెంకటేశ్, అశోక్,సుదర్శన్ రెడ్డి, నవీన్, ఉపేందర్రెడ్డి, ఖదీర్, మరియు స్థానిక అయ్యప్ప కాలనీ వాసులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## సింగారం గ్రామాన్ని సందర్శించిన ఆర్డీవో శ్రీదేవి

**మునుగోడు వెలుతురు జూలై 07:**



మునుగోడు మండలం సింగారం గ్రామ పంచాయతీ కార్యాలయం దగ్గర జరుగుతున్న ఓటర్ ఎన్యుమరేషన్ కార్యక్రమాన్ని మంగళవారం చండూర్ ఆర్డీవో శ్రీదేవి మునుగోడు తహసీల్దార్ నరేష్ తో కలిసి పర్యవేక్షించారు. ఓటర్లతో మాట్లాడి అనుమానాలను నివృత్తి చేశారు. ఫారం నింపే విషయమై అవగాహన కల్పించారు. ఇప్పటి వరకు సేకరించిన ఎన్యుమరేషన్ ఫారాలు సంఖ్యను BLO ను అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో యాభై శాతం వరకు పూర్తి కావడం పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. ఎన్యుమరేషన్ కు BLO ఇతర నాయకుల సహకారంపై ఆర్డీవో ఆరా తీసి వారిని అభినందించారు.ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి గీత, బిఎల్ ఎ యశోద, బీ ఎల్ ఓ కుంభం చెన్నారెడ్డి, పోగుల ప్రకాష్, పిట్టల రఘు, కుంభం సురేందర్ రెడ్డి, ఉప్పునూతల లింగస్వామి, జంగం చంద్రశేఖర్, గురిజ మల్లేష్, మహిళలు పాల్గొన్నారు.

## SIR ప్రక్రియలో భాగంగా 6వ వార్డు ప్రజలకు అవగాహన

**నార్కట్ పల్లి వెలుతురు జూలై 08:**



SIR (Special Intensive Revision) కార్యక్రమంలో భాగంగా నార్కట్ పల్లి 6వ వార్డు బాధ్యురాలు అద్దంకి నీలిమ (BLO) ఆధ్వర్యంలో ఎన్యూమరేషన్ ఫారాల పరిశీలన మరియు సవరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఫారాలను ఎలాంటి తప్పులు లేకుండా సక్రమంగా నింపే విధానంపై అక్కడి ప్రజలకు అవగాహన కల్పించారు. ఓటరు వివరాల నమోదులో పొరపాట్లు జరగకుండా జాగ్రత్తలు వివరించి, అవసరమైన చోట ఫారాల కరెక్షన్ ప్రక్రియను పూర్తి చేశారు. ప్రజలు తమ ఓటరు వివరాలను సక్రమంగా నమోదు చేసుకోవాలని అధికారులు సూచించారు. ఈ కార్యక్రమంలో వార్డు మెంబర్ బకరం జనార్ధన్, బి ఆర్ ఎస్ నాయకులు మంద సుధాకర్, లింగాల ముత్తయ్య, తెలుగుదేశం పార్టీ భువనగిరి మాజీ కార్యదర్శి లింగాల యాదయ్య , లింగాల దేవేందర్, మంద అరుణ్ కుమార్, లింగాల నవీన్,తదితరులు పాల్గొన్నారు.

## జేఏసీ ఆధ్వర్యంలో ప్రజలకు పిలుపు

- **రోడ్డు పనులు తక్షణమే చేపట్టాలని నిరసన కార్యక్రమాలు**
- **నిరసన కార్యక్రమాల్లో పాల్గొనాలని పట్టణ ప్రజలకు పిలుపు**

**నార్కట్ పల్లి వెలుతురు జూలై 07:**



నార్కట్‌పల్లి పట్టణంలో జాయింట్ యాక్షన్ కమిటీ (JAC) ఆధ్వర్యంలో బుధవారం నుంచి నిర్వహించనున్న కార్యక్రమాల్లో ప్రజలందరూ స్వచ్ఛందంగా పాల్గొని విజయవంతం చేయాలని కోరుతూ విస్తృత ప్రచార కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా అన్ని రాజకీయ పార్టీల నాయకులు, అఖిలపక్ష నాయకులు కలిసి పట్టణంలోని వ్యాపార, కిరాణా, మొబైల్, మెడికల్ దుకాణాలతో పాటు ఆటో సంఘం సభ్యులు, రహదారులపై వ్యాపారం చేస్తున్న తోపుడు బండ్ల వ్యాపారులను కలిసి కార్యక్రమాలకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో జేఏసీ నాయకులు చిరుమర్తి యాదయ్య, దుబ్బాక శ్రీధర్, మేడబోయిన శ్రీనివాస్, వడ్డగోని రామలింగం, కొప్పు శ్రవణ్, వెంపటి శ్రీనివాస్, వడ్డేపల్లి నాగరాజు, లింగాల యాదయ్య, దోసపాటి విష్ణు, మరిదు శివ, బోయపల్లి శీను, మేడబోయిన రాంబాబు, పాలకురి రమేష్, మునుకుంట్ల గణేష్, నోముల నాగరాజు, పానుగుల్ల శివ, బొల్లెద్దు రామలింగం, బొబ్బలి మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ఎమ్మార్పీఎస్ 32వ ఆవిర్భావ దినోత్సవం

- **పద్మశ్రీ మందకృష్ణ మాదిగ జన్మదిన వేడుకలు**

**నార్కట్ పల్లి వెలుతురు జూలై 07:**




నార్కెట్‌పల్లి మండలంలో ఎమ్మార్పీఎస్ (MRPS) 32వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పద్మశ్రీ పురస్కార గ్రహీత, ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మందకృష్ణ మాదిగ జన్మదిన వేడుకలను పురస్కరించుకుని జెండా ఆవిష్కరణతో పాటు కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు.కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నార్కెట్‌పల్లి మండల ఇన్‌చార్జి, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎరసాని గోపాల్ మాదిగ హాజరై మాట్లాడుతూ, 32 సంవత్సరాలుగా ఎమ్మార్పీఎస్ ఉద్యమం సామాజిక న్యాయం కోసం నిరంతర పోరాటం చేస్తూ అట్టడుగు వర్గాల ఆత్మగౌరవాన్ని కాపాడేందుకు కృషి చేస్తోందన్నారు. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని పద్మశ్రీ మందకృష్ణ మాదిగ నాయకత్వంలో సాగిన మాదిగ దండోరా ఉద్యమం దేశవ్యాప్తంగా సామాజిక చైతన్యాన్ని తీసుకొచ్చిందని పేర్కొన్నారు.ఎస్సీ రిజర్వేషన్ల సమాన పంపిణీ కోసం సాగిన ఉద్యమానికి గుర్తింపుగా కేంద్ర ప్రభుత్వం పద్మశ్రీ పురస్కారాన్ని ప్రదానం చేయడం మాదిగ జాతికి దక్కిన గౌరవమని అన్నారు. సామాజిక న్యాయమే ఎమ్మార్పీఎస్ లక్ష్యమని, అణగారిన వర్గాల హక్కుల సాధన కోసం ఉద్యమం నిరంతరం కొనసాగుతుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ టౌన్ కమిటీ అధ్యక్షులు మంద సుధాకర్ మాదిగ, నార్కెట్‌పల్లి మండల అధ్యక్షులు కొమ్ము శీను మాదిగ, టౌన్ ఉపాధ్యక్షుడు లింగాల ముత్తయ్య, వడ్డేపల్లి నాగరాజు మాదిగ, లింగాల యాదయ్య మాదిగ, చెరుకుపల్లి నరసింహ, లింగాల నాగరాజు,అంబాల ప్రవీణ్ మాదిగ, మంద అరుణ్, బోడ రాకేష్ , బోడ, వేణు, దైద అరుణ్, బండారు చరణ్, మంద శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## ఎస్ఐఆర్ సర్వేలో అర్హత కలిగిన ఓటరు తప్పనిసరిగా పాల్గొనాలి

- **మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య**

**నార్కట్ పల్లి వెలుతురు జూలై 07:**



ఎస్ఐఆర్ (Special Intensive Revision) సర్వేలో భాగంగా ఈరోజు మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య సంబంధిత బీఎల్ఓల (BLOs) నుండి ఎన్యూమరేషన్ ఫారాలను స్వీకరించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, భారత ఎన్నికల సంఘం చేపట్టిన ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (SIR) ప్రక్రియ విజయవంతం కావాలంటే ప్రతి అర్హత కలిగిన ఓటరు బాధ్యతాయుతంగా పాల్గొనాలని కోరారు. ప్రతి ఓటరు తమకు అందిన ఎన్యూమరేషన్ ఫారాన్ని పూర్తిగా, సరైన వివరాలతో నింపి, అవసరమైన ధ్రువపత్రాలను జతచేసి నిర్ణీత గడువులోగా సంబంధిత బీఎల్ఓ లేదా ఎన్నికల అధికారులకు సమర్పించాలని విజ్ఞప్తి చేశారు.ఓటు హక్కు ప్రతి భారత పౌరుడికి రాజ్యాంగం కల్పించిన అత్యంత విలువైన ప్రజాస్వామ్య హక్కు అని పేర్కొన్న ఆయన, చిన్న నిర్లక్ష్యం వల్ల భవిష్యత్తులో ఓటరు నమోదు, సవరణ లేదా ఇతర ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉందని తెలిపారు. అందువల్ల ప్రతి కుటుంబం ఈ ప్రక్రియను సీరియస్‌గా తీసుకుని, ఇంట్లోని ప్రతి అర్హత కలిగిన ఓటరు వివరాలను సక్రమంగా నమోదు చేయించాలని సూచించారు.నకిరేకల్ నియోజకవర్గ ప్రజలందరూ ఎన్నికల సంఘానికి పూర్తి సహకారం అందిస్తూ ఈ సర్వేను విజయవంతం చేయాలని, అలాగే తమ బంధువులు, స్నేహితులు, పొరుగు వారిలో అవగాహన కల్పించి ప్రతి అర్హత కలిగిన ఓటరు తప్పనిసరిగా ఎన్యూమరేషన్ ఫారాన్ని సమర్పించేలా సహకరించాలని కోరారు.అదేవిధంగా, బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు శ్రీ కె. చంద్రశేఖర్ రావు (కేసీఆర్), కార్యనిర్వాహక అధ్యక్షులు శ్రీ కె. తారక రామారావు (కేటీఆర్) సూచనల మేరకు బీఆర్ఎస్ పార్టీ నాయకులు, బూత్ లెవల్ ఏజెంట్లు (BLAs) ప్రతి ఇంటిని సందర్శించి, ఒక్క అర్హత కలిగిన ఓటరు కూడా ఓటరు జాబితా నుంచి మిస్ కాకుండా చర్యలు తీసుకోవాలని మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య పిలుపునిచ్చారు.

# జాతీయ ఆహార భద్రతా చట్టానికి ప్రతిపాదించిన సవరణను ఉపసంహరించాలి

- **వ్యకాస జిల్లా అధ్యక్షుడు జల్లెల పెంటయ్య**

**రామన్నపేట వెలుతురు న్యూస్ జులై 07:**



జాతీయ ఆహార భద్రతా చట్టం (ఎన్ఎఫ్ఎస్ఏ) కు ప్రతిపాదించిన సవరణను ఉపసంహరించుకోవాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు జల్లెల పెంటయ్య కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశాడు. స్థానిక శుభాష్ సెంటర్ లో సిపిఎం-వ్యకాస ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించి అనంతరం మాట్లాడుతూ ఈ సవరణ ద్వారా అంత్యోదయ అన్న యోజన (ఏఏవై ) కింద ప్రస్తుతం అమలులో ఉన్న కుటుంబ ప్రాతిపదిక అర్హత విధానాన్ని తొలగించి, వ్యక్తి ప్రాతిపదిక అర్హత విధానాన్ని అమలు చేయాలని కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించింది.ఒక్కో వ్యక్తికి 7 కిలోల ఆహార ధాన్యం ఇస్తామని చెప్పినా, పెద్ద కుటుంబాలకు దీనివల్ల ఎలాంటి అదనపు ప్రయోజనం ఉండదు. ఎందుకంటే వారి మొత్తం కోటా ఇప్పటికీ నెలకు 35 కిలోలకే పరిమితం అవుతుంది. అదే సమయంలో, చిన్న కుటుంబాలు ప్రస్తుతం పొందుతున్న 35 కిలోల పూర్తి హక్కును కోల్పోతాయి. దీంతో సమాజంలోని అత్యంత పేద, బలహీన వర్గాలపై ఈ సవరణ తీవ్ర ప్రతికూల ప్రభావం చూపుతుంది.వృద్ధ దంపతులు, వితంతువులు, దివ్యాంగులు, గిరిజన కుటుంబాలు, భూమిలేని వ్యవసాయ కార్మికులు, రోజువారీ కూలీలు, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారు, చిన్న కుటుంబాలు వంటి వర్గాలు కుటుంబ పరిమాణంతో సంబంధం లేకుండా దీనిపై ఆధారపడుతున్నాయి. ఈ సవరణ వారి ఆహార భద్రతను దెబ్బతీస్తుంది.ముఖ్యంగా కుటుంబ నియంత్రణ కార్యక్రమాలను విజయవంతంగా అమలు చేసి, సగటు కుటుంబ పరిమాణాన్ని తగ్గించిన దక్షిణాది రాష్ట్రాలు ఈ సవరణ వల్ల నష్టపోతాయి. ఎన్నో సంవత్సరాలుగా, 2011 జనగణన ఆధారంగా ఉన్న ఎన్.ఎఫ్.ఎస్.ఏ లబ్ధిదారుల జాబితాను నవీకరించాలని విస్తృతంగా డిమాండ్ వస్తోంది. పాత జాబితాల కారణంగా లక్షలాది అర్హులైన ప్రజలు ఇప్పటికీ ఈ చట్టం ప్రయోజనాలకు దూరంగా ఉన్నారు. ప్రస్తుత జనాభా ఆధారంగా లబ్ధిదారుల జాబితాను నవీకరించి, చట్టం పరిధిని విస్తరించాల్సిన బదులు, మోదీ ప్రభుత్వం అత్యంత పేద ప్రజల ఆహార హక్కులను తగ్గించే ఈ సవరణను తీసుకు రావడం విచారకరం.ఈ పేద వ్యతిరేక సవరణ ద్వారా, ప్రజల దీర్ఘకాల పోరాటాల ఫలితంగా ఆహారాన్ని చట్టబద్ధ హక్కుగా గుర్తిస్తూ తీసుకొచ్చిన జాతీయ ఆహార భద్రతా చట్టాన్ని క్రమంగా బలహీనపరచాలనే కేంద్ర ప్రభుత్వ ఉద్దేశం బహిర్గతమవుతోంది.ప్రతిపాదిత సవరణను తక్షణమే ఉపసంహరించుకోవాలని లేనిపక్షంలో పేదలను సమీకరించి పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి బొడ్డుపల్లి వెంకటేశం, జిల్లా కమిటీ సభ్యులు బలుగూరి అంజయ్య, మండల కమిటీ సభ్యులు నాగటి ఉపేందర్ గొరిగెసోములు,బావండ్లపల్లి బాలరాజు,తొలుపునూరి శ్రీనివాస్, వ్యకాస మండల అధ్యక్షుడు మేడి ముకుంద,డివైఎఫ్ఐ మండల అధ్యక్షుడు మెట్టు శ్రవణ్ కుమార్, ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి పుట్టల ఉదయ్ కుమార్, నాయకులు నాగటి లక్ష్మణ్, గునుగుంట్ల సత్యనారాయణ, తరిగోప్పుల వెంకట్ రెడ్డి, తుర్కపల్లి నరేష్, గట్టు సుందర్, ఆకిటి మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

## పాలడుగు చేనేత సహకార సంఘం ఎన్నిక ఏకగ్రీవం

**మోత్కూరు, జూలై 7, వెలుతురు న్యూస్ :**





రాష్ట్రవ్యాప్తంగా ఈ నెల 10న నిర్వహించనున్న చేనేత సహకార సంఘాల ఎన్నికల ప్రక్రియలో భాగంగా మోత్కూరు మండలం పాలడుగు గ్రామ చేనేత సహకార సంఘం పాలకవర్గం ఏకగ్రీవంగా ఎన్నికైంది. సోమవారం సాయంత్రం నామినేషన్ల స్వీకరణ గడువు ముగియడంతో అన్ని పదవులకు ఒక్కో నామినేషన్ మాత్రమే దాఖలవడంతో పాలకవర్గ సభ్యులంతా ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి తెలిపారు.సంఘం అధ్యక్షుడిగా పసునూరి ప్రభాకర్, ప్రధాన కార్యదర్శిగా మూషం సత్యనారాయణ, ఉపాధ్యక్షుడిగా మూషం స్వామి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. డైరెక్టర్లుగా మూషం లక్ష్మయ్య, గోశిక నరేందర్, జెల్లా సులోచన, గుండు కళావతి, జెల్లా మురళి, మూషం శ్రీనివాస్ ఎన్నికయ్యారు. అనంతరం నూతన పాలకవర్గ సభ్యులతో ఎన్నికల అధికారి మారోజు శ్రీనివాస్ ప్రమాణస్వీకారం చేయించారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల అధికారి మారోజు శ్రీనివాస్, నూతన పాలకవర్గ సభ్యులు, చేనేత కార్మికులు, సంఘ సభ్యులు తదితరులు పాల్గొని నూతన కమిటీకి శుభాకాంక్షలు తెలిపారు.

## ఘనంగా ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం

**మునుగోడు,జూలై 7(వెలుతురు):**



ఎమ్మార్పీఎస్ 32వ ఆవిర్భావ దినోత్సవం సోమవారం మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు.మండల అధ్యక్షుడు పందుల అంజి మాదిగ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో నియోజకవర్గ ఇన్‌చార్జి మేడి శంకర్ మాదిగ పాల్గొని జెండా ఎగురవేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు పద్మశ్రీ మందకృష్ణ మాదిగ నాయకత్వంలో సాగిన ఉద్యమ ఫలితంగానే ఎస్సీ వర్గీకరణ సాధ్యమైందని అన్నారు. పీడిత,అణగారిన వర్గాల హక్కుల కోసం ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు.ప్రతి ఏడాది జూలై 7న ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని, మందకృష్ణ మాదిగ జన్మదినాన్ని ఘనంగా నిర్వహించాలని పిలుపునిచ్చారు.అనంతరం అంబేద్కర్ సెంటర్‌లో డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి, మందకృష్ణ మాదిగ 62వ జన్మదిన వేడుకలను కేక్ కట్ చేసి నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు దుబ్బ గోపాల్, పందుల పర్వతాలు, పందుల మల్లేష్ మాదిగ, పందుల వెంకన్న మాదిగ, పందుల లక్ష్మణ్ మాదిగ, గాదెపాక ప్రభాకర్ మాదిగ, బోయపర్తి యాదయ్య మాదిగ, పందుల భాస్కర్, పందుల గంగాధర్, రాజేష్, పోలే వెంకన్న మాదిగ, దుబ్బ భాస్కర్ మాదిగ, పోలే రాజు మాదిగ, దుబ్బ అనిల్ మాదిగ, జీడిమెట్ల నరసింహ మాదిగ, బొలుగూరి ప్రభాకర్ మాదిగ, మేడి సైదులు, పందుల సైదులు, యాదగిరి, నరసింహ, పవన్, సైదులు తదితరులు పాల్గొన్నారు.

## ఓటర్ ఎన్యుమరేషన్‌ను పరిశీలించిన ఆర్డీవో శ్రీదేవి

**మునుగోడు,జూలై 7 (వెలుతురు):**



మండలంలోని సింగారం గ్రామ పంచాయతీ కార్యాలయంలో కొన సాగుతున్న ఓటర్ ఎన్యుమరేషన్ కార్యక్రమాన్ని చండూర్ ఆర్డీవో శ్రీదేవి మంగళవారం పరిశీలించారు.ఈ సందర్భంగా తహసిల్దార్ నేలపట్ల నరేష్ తో కలిసి కేంద్రాన్ని సందర్శించిన ఆమె ఓటర్లతో మాట్లాడి వారి సందేహాలను నివృత్తి చేశారు. అలాగే ఎన్యుమరేషన్ ఫారాలు సక్రమంగా నింపే విధానంపై అవగాహన కల్పించారు.గ్రామంలో ఇప్పటివరకు సేకరించిన ఎన్యుమరేషన్ ఫారాల వివరాలను బీఎల్ఓను అడిగి తెలుసుకుని, సుమారు 50 శాతం ప్రక్రియ పూర్తవడం పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. మిగిలిన ఎన్యుమరేషన్ ప్రక్రియను నిర్ణీత గడువులో పూర్తి చేయాలని అధికారులకు ఆర్డీవో సూచించారు. కార్యక్రమం విజయవంతంగా నిర్వహించేందుకు బీఎల్ఓలు,స్థానిక నాయకులు,సిబ్బంది అందిస్తున్న సహకారాన్ని అభినందించారు.ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి గీత, బీఎల్ఓ యశోద, బీఎల్ఏ కుంభం చెన్నారెడ్డి,పోగుల ప్రకాష్,పిట్టల రఘు, కుంభం సురేందర్ రెడ్డి, ఉప్పునూతల లింగస్వామి,జంగం చంద్రశేఖర్,గురిజ మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యాసంస్థల బంద్ విజయవంతం చేయాలి

**మునుగోడు,జూలై 7(వెలుతురు):**




రాష్ట్రవ్యాప్తంగా ఈ నెల 10న వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించే విద్యాసంస్థల బంద్‌ను విజయవంతం చేయాలని డివైఎఫ్ఐ జిల్లా సహాయక కార్యదర్శి కట్ట లింగస్వామి, ఏఐఎస్ఎఫ్ జిల్లా కోశాధికారి గోపగోని ఉదయ్ గౌడ్ కోరారు. మంగళవారం మండల కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు.విద్యా సంవత్సరం ప్రారంభమై నెల రోజులు గడిచినా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు యూనిఫాంలు, పాఠ్యపుస్తకాలు పూర్తిస్థాయిలో అందలేదని విమర్శించారు.

ప్రభుత్వ పాఠశాలల సంఖ్యను తగ్గించే నిర్ణయాన్ని ఉపసంహరించుకుని ప్రభుత్వ విద్యను బలోపేతం చేయాలని డిమాండ్ చేశారు. సంక్షేమ వసతి గృహాలకు సొంత భవనాలు నిర్మించి విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించాలని కోరారు.ప్రైవేటు విద్యాసంస్థలు విద్యా హక్కు చట్టం–2009ను పకడ్బందీగా అమలు చేయాలని డిమాండ్ చేశారు.సమావేశంలో డివైఎఫ్ఐ మండల ఉపాధ్యక్షుడు యాట శ్రీకాంత్, ఏఐఎస్ఎఫ్ నాయకుడు కిరణ్,పీఎన్ఎం జిల్లా నాయకుడు పగిళ్ల యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

## ప్రజల ఆరోగ్య సూత్రాలపై అవగాహన సదస్సు

- **రిషారియా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు**
- **అవగాహన కల్పించిన రియా మౌర్య**

**రామన్నపేట వెలుతురు న్యూస్ జూలై 06:**

హైదరాబాద్, ప్రజలు ఆరోగ్య సూత్రాలను పాటిస్తూ సంపూర్ణ ఆరోగ్యం తో జీవనం సాగించాలని రియా మౌర్య అన్నారు. హైదరాబాద్ లోని దోమలగూడ లో రిషారియా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక అవగాహన సదస్సు లో అక్కడి ప్రజలకి ప్రజల ఆరోగ్యం పై అవగాహన కల్పించారు. అక్కడ మురికి కాలువలు ఎక్కువ ఉంది, దోమల బెడద ఎక్కువగా ఉంటుందని, వాటి వల్ల రానున్న రోజుల్లో వర్షాల కారణంగా మురికి నీ లేకుండా చేసుకోవాలని, ఇళ్ల చుట్టూ పక్కల ప్రదేశాలని పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఆరోగ్యమే మహా భాగ్యం అనే నినాదం తో అందరూ ముందుకు సాగుతూ, ఆరోగ్యం పట్ల ఎవరు కూడా నిర్లక్ష్యం చేయకూడదని, ఎలాంటి జబ్బుల బారిన పడకుండా ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. ఆరోగ్యం పట్ల ఎలాంటి అనుమానం వచ్చిన వెంటనే వైద్యులను సంప్రదించాలని, రానున్న కాలంలో రిషారియా ఫౌండేషన్ ఆధ్వర్యంలో మెడికల్ కాంపు లు ఏర్పాటు చేసి, ప్రజలకు ఉచితంగా వైద్య సేవలు అందే విధంగా చర్యలు తీసుకుంటామని అన్నారు.



## చేనేతసంఘ అభివృద్ధి, కార్మికుల సంక్షేమం కోసం పనిచేసే నాయకులనే ఎన్నుకోవాలి

- **చేనేత కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి గుండు వెంకటనర్సు.**

**మోత్కూర్, జులై 7,వెలుతురు న్యూస్ :**



చేనేత వృత్తిపై అవగాహన కలిగి, సంఘ అభివృద్ధి, కార్మికుల సంక్షేమం కోసం పనిచేసే నాయకులనే చేనేత సహకార సంఘాలలో ప్రతినిధులుగా ఎన్నుకోవాలని, చేనేత కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గుండు వెంకటనర్సు కార్మికులకు పిలుపునిచ్చారు. మంగళవారం రోజున ఆయన మోత్కూర్ లో పత్రికా ప్రతినిధులతో మాట్లాడుతూ..... చేనేత సహకార సంఘాలలో క్యాష్ క్రెడిట్ అప్పులు పెరిగి కార్మికులకు పనికల్పించలేని పరిస్థితిలో ఉన్నాయని, దీనికి తోడు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం టెస్కో ద్వారా కొనుగోలు చేయాల్సిన బట్టలను ప్రైవేట్ సంస్థల నుండి టెండర్ ద్వారా కొనుగోలు చెయ్యాలనే ఆలోచన చేనేత కార్మికుల పొట్టకొట్టడమే కాక, చేనేత సహకార సంఘాలను మరియు టెస్కో ను నిర్వీర్యం చేయడమేనని ఆవేదన వ్యక్తం చేశారు. చేనేత సహకార సంఘాల క్యాష్ క్రెడిట్ అప్పును మాఫీచేసి, నూలు బట్టలపై జి.ఎస్.టి.ని పూర్తిగా తొలగించాలని కోరారు.

# ఇండ్ల బిల్లులు మంజూరు చేయాలి

- సబ్ కలెక్టర్‌కు జర్నలిస్టుల వినతి

**వెలుతురు నారాయణఖేడ్ జూలై 07 :**



సంగారెడ్డి జిల్లా :- నారాయణఖేడ్ మున్సిపల్ పరిధిలో ప్రభుత్వం జర్నలిస్టులకు కేటాయించిన ఇండ్ల నిర్మాణానికి సంబంధించిన బిల్లులను క్షమించాలని కోరుతూ మంగళవారం సబ్ కలెక్టర్ ఉమ హారతికి జర్నలిస్టులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..మండల ప్రజా పరిషత్ కార్యాలయం ఎదుట అర్హులైన 43 మంది జర్నలిస్టులకు ప్రభుత్వం కేటాయించిన స్థలాల్లో పలువురు ఇళ్ల నిర్మాణాన్ని పూర్తి చేసుకున్నారని, వెంటనే పూర్తయిన ఇళ్లకు ఇంటి నంబర్లు కేటాయించి, పెండింగ్‌లో ఉన్న బిల్లులను విడుదల చేయాలని కోరారు. అలాగే కాలనీలో రహదారులు, తాగునీరు, విద్యుత్, డ్రైనేజీ వంటి మౌలిక సదుపాయాలను కల్పించి జర్నలిస్టుల కాలనీని అభివృద్ధి చేయాలని కోరారు. సానుకూలంగా స్పందించిన సబ్ కలెక్టర్ ఉమా హారతి సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యల పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

# హోతి(బి)లో వేగంగా అండర్ డ్రైనేజ్, సీసీ రోడ్ల నిర్మాణ పనులు

- పనులను పరిశీలించిన బీఆర్ఎస్ నాయకులు...
- దశలవారీగా గ్రామాభివృద్ధి పనులు పూర్తి చేస్తామని సర్పంచ్ మచ్చేందర్ వెల్లడి...

**జహీరాబాద్ వెలుతురు జూలై 07:**



సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ మండలంలోని హోతి(బి) గ్రామంలో అండర్ డ్రైనేజ్, సీసీ రోడ్ల నిర్మాణ పనులు చురుకుగా కొనసాగుతున్నాయి. గ్రామ సర్పంచ్ దాసరి మచ్చేందర్‌తో కలిసి మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ గుండప్ప, జహీరాబాద్ మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు తట్టు నారాయణ పనులను పరిశీలించి పురోగతిని సమీక్షించారు.ఈ సందర్భంగా సర్పంచ్ దాసరి మచ్చేందర్ మాట్లాడుతూ, గ్రామంలో ఎన్నో సంవత్సరాలుగా మురికి కాలువల సమస్యతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. సర్పంచ్ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు స్థానిక ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు సహకారంతో అండర్ డ్రైనేజ్, సీసీ రోడ్ల నిర్మాణ పనులను చేపట్టామని చెప్పారు. ప్రస్తుతం పనులు వేగంగా కొనసాగుతున్నాయని, మిగిలిన అభివృద్ధి పనులను కూడా దశలవారీగా పూర్తి చేసి గ్రామాన్ని మరింత అభివృద్ధి చేస్తామని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో గ్రామ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు పర్వేజ్ పటేల్, మాజీ సర్పంచ్ చిన్నారెడ్డి, ఉప సర్పంచ్ విష్ణు, చంద్రు, మల్లన్న, షేక్ అలీతో పాటు పలువురు పార్టీ నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# గోవింద్‌పూర్‌లో 'నేను సైతం' కార్యక్రమం





- రూ.3 లక్షలతో 16 సీసీటీవీ కెమెరాల ఏర్పాటు....
- ముఖ్య అతిధులుగా హాజరై ప్రారంభించిన జహీరాబాద్ ఎస్డీపీఓ సైదా, టౌన్ సీఐ ఎస్. శివలింగం....

**జహీరాబాద్ వెలుతురు జూలై 07:**

సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ మండలంలోని గోవింద్‌పూర్ గ్రామంలో గ్రామ పంచాయతీ నిధులతో "నేను సైతం" కార్యక్రమం కింద రూ.3 లక్షల వ్యయంతో 16 సీసీటీవీ కెమెరాలను ఏర్పాటు చేశారు. ఈ కెమెరాలను జహీరాబాద్ ఎస్డీపీఓ సైదా, టౌన్ సీఐ ఎస్. శివలింగం ప్రారంభించారు.ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ గ్రామాల్లో సీసీటీవీ కెమెరాల ఏర్పాటు వల్ల నేరాల నియంత్రణతో పాటు ప్రజల్లో భద్రతాభావం పెరుగుతుందని తెలిపారు. ప్రజలు కూడా పోలీసు శాఖకు సహకరించి తమ గ్రామాలను సురక్షితంగా తీర్చిదిద్దేందుకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు.కార్యక్రమంలో భాగంగా ద్విచక్ర వాహనదారులకు 30 హెల్మెట్లను పంపిణీ చేయడంతో పాటు గ్రామంలో మొక్కలు నాటారు. గ్రామ అభివృద్ధి, భద్రత కోసం కృషి చేస్తున్న గోవింద్‌పూర్ సర్పంచ్ కవిత వెంకట్‌ను ఎస్డీపీఓ, సీఐ అభినందించారు.ఈ కార్యక్రమంలో చిరాగ్‌పల్లి ఎస్ఐ వినయ్ కుమార్, మాజీ సర్పంచ్ తాజుద్దీన్ రాజు, ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# అంగరంగ వైభవంగా శ్రీ పంచముఖ, శ్రీ రామ సాయి దేవాలయ వార్షికోత్సవ వేడుకలు

- అశేష సంఖ్యలో తరలివచ్చిన భక్తులు.. కన్నుల పండుగగా పూజా, హోమ కార్యక్రమాలు..
- వార్షికోత్సవ వేడుకలకు హాజరైన మేయర్ కోలగాని శ్రీనివాస్...

**కరీంనగర్ వెలుతురు జూలై 07:**





కరీంనగర్ నగరపాలక సంస్థ 8వ డివిజన్, అలుగునూర్ పరిధిలోని శ్రీ వెంకటేశ్వర కాలనీలో గల శ్రీ పంచముఖ, శ్రీ రామ సాయి దేవాలయ16వ వార్షికోత్సవ వేడుకలు మంగళవారం రోజున అత్యంత వైభవంగా, భక్తిశ్రద్ధలతో జరిగాయి. ఆలయ ప్రాంగణం ఆధ్యాత్మిక వాతావరణంతో, శ్రీ పంచముఖ ఆంజనేయస్వామి , శ్రీ రామ నామస్మరణతో మార్మోగింది. ఈ ఆధ్యాత్మిక వేడుకల్లో భాగంగా నిర్వహించిన ప్రత్యేక పూజలు, హోమ కార్యక్రమాల్లో భక్తులు అశేష సంఖ్యలో పాల్గొన్నారు.ఆలయ వార్షికోత్సవం సందర్భంగా వేద పండితులు తిరునగిరి వెంకటాద్రి స్వామి, తిరునగిరి హర్షవర్ధన్ ఆధ్వర్యంలో ఉదయం నుంచే విశేష పూజా కార్యక్రమాలు ప్రత్యేక హోమం, అభిషేకాలను. శాస్త్రోక్తంగా ఘనంగా నిర్వహించారు. ఈ దేవాలయ వార్షికోత్సవ వేడుకలకు మేయర్ కోలగాని శ్రీనివాస్ హాజరై, . ఆలయంలోని దైవ సన్నిధిలో ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ కమిటీ బాధ్యులు మేయర్ కోలగాని శ్రీనివాస్ ను సత్కరించారు. వేద పండితులు మేయర్ శ్రీనివాస్ కు ఆశీర్వచనం అందించారు. అలాగే వేడుకల్లో పాల్గొన్న మాజీ ఎంపీపీ కుంట రాజేందర్, మహాత్మా నగర్ గ్రామ సర్పంచ్ పొన్నాల సంపత్ ను ఆలయ కమిటీ సన్మానించింది. స్వామివారిని దర్శించుకునేందుకు భక్తులు భారీగా తరలిరావడంతో దేవాలయ ప్రాంగణం భక్తులతో కిటకిటలాడింది. భక్తులందరికీ ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ నిర్వాహకులు తగు ఏర్పాట్లు చేశారు. కార్యక్రమం అనంతరం భక్తులకు అన్న ప్రసాద వితరణ కార్యక్రమాన్ని అత్యంత భక్తిపూర్వకంగా నిర్వహించారు.ఈ వార్షికోత్సవ వేడుకలు ఆధ్యాత్మిక శోభతో విజయవంతంగా ముగిశాయి. ఈ కార్యక్రమంలో శ్రీ పంచముఖ ఆంజనేయస్వామి దేవాలయ ధర్మకర్తల సేవా సమితి అధ్యక్షులు చిందం నరసయ్య, గడప శేఖర్, సిరిపురం శ్రీనివాస్, సల్ల రాజయ్య, సల్ల మల్లేశం , సుధాకర్ రెడ్డి, మృత్యుంజయం, బండి కుమార్ , బూట్ల కరుణాకర్ , కొట్టాల శ్రీనివాస్ , చిందం అంజి, చిందం మనోహర్ ,మధు, కొత్తూరీ శ్రీనివాస్ , సిద్దయ్య లతోపాటు మహిళలు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# రౌడీ షీటర్లు, అనుమానితులకు చిరాగ్‌పల్లి పోలీసుల కౌన్సెలింగ్

- నేరాలకు దూరంగా ఉండాలి.. చట్టాన్ని గౌరవించాలి...
- శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవు....
- స్టేషన్ హౌస్ ఆఫీసర్ వినయ్ కుమార్...

**జహీరాబాద్ వెలుతురు జూలై 07:**

సంగారెడ్డి జిల్లా చిరాగ్‌పల్లి పోలీస్ స్టేషన్‌లో స్టేషన్ హౌస్ ఆఫీసర్ (ఎస్ఐ) వినయ్ కుమార్ ఆధ్వర్యంలో పోలీస్ స్టేషన్ పరిధిలోని రౌడీ షీటర్లు, అనుమానితులు (సస్పెక్ట్స్), బాడ్ క్యారెక్టర్లకు ప్రత్యేక కౌన్సెలింగ్ కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా ఎస్ఐ వినయ్ కుమార్ మాట్లాడుతూ శాంతి భద్రతలకు విఘాతం కలిగించే చర్యలకు ఎట్టి పరిస్థితుల్లోనూ పాల్పడరాదని సూచించారు. నేరాలకు దూరంగా ఉంటూ చట్టాన్ని గౌరవించి సత్ప్రవర్తనతో జీవించాలని, గ్రామాల్లో ప్రశాంత వాతావరణాన్ని కొనసాగించేందుకు పోలీసులకు సహకరించాలని కోరారు.మద్యం సేవించి గొడవలు, దాడులు, బెదిరింపులు, అక్రమ కార్యకలాపాలకు పాల్పడకుండా బాధ్యతాయుతమైన పౌరులుగా వ్యవహరించాలని సూచించారు. కుటుంబ సభ్యుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని మంచి మార్గంలో నడవాలని హితవు పలికారు.పోలీస్ స్టేషన్ పరిధిలో శాంతి భద్రతల పరిరక్షణకు పోలీసులు ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉంటారని, ఎవరైనా నేరాలకు పాల్పడినా లేదా శాంతి భద్రతలకు విఘాతం కలిగించే చర్యలకు పాల్పడినా చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.ఈ కౌన్సెలింగ్ కార్యక్రమంలో సుమారు 20 మంది రౌడీ షీటర్లు, అనుమానితులు, బాడ్ క్యారెక్టర్లు పాల్గొన్నారు.



# 49వ డివిజన్‌లో ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (ఎస్ఐఆర్)ఫారమ్‌లను అందజేయాలి

- కార్పొరేటర్ ఏన్నంలక్ష్మీ ప్రకాష్

**కరీంనగర్ వెలుతురు జూలై 07:**



కేంద్ర ఎన్నికల కమిషన్ చేపట్టిన ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ. (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ .. ఎస్ ఐ ఆర్) కార్యక్రమంలో భాగంగా, ఓటర్లు తమ వివరాలను నమోదు చేసుకోవాలని 49వ డివిజన్ కార్పొరేటర్ ఎన్నం లక్ష్మి ప్రకాష్ ప్రజలను కోరారు. బి ఎల్ ఓ ల ద్వారా అందిన ఎన్యూమరేషన్ ఫారమ్‌ను ఓటర్లు ఈ క్రింది విధంగా పూర్తి చేయాలని వివరాలు తెలియజేస్తూ సూచించారు.పార్ట్ 1: 2002లో ఓటు హక్కు కలిగి ఉన్న వారి వివరాలు,పార్ట్ 2: తల్లి లేదా తండ్రి వివరాలు,పార్ట్ 3: ప్రస్తుత నివాస వివరాలు ఫారమ్‌పై ఫోటోను అంటించాలని తెలిపారు.పూర్తి చేసిన ఫారమ్‌లను స్వయంగా అందజేయడానికి జూలై 7, 8. ఉదయం 9:00 గంటల నుండి మధ్యాహ్నం 2:00 గంటల వరకు. సనాతన ధర్మం ఆఫీస్, భాగ్యనగర్ రోడ్ నెం. 6 లో సంప్రదించాలని సూచించారు.ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని, తమ ఓటు హక్కు వివరాలను సరిచూసుకోవాలని కార్పొరేటర్ ఎన్నం లక్ష్మి ప్రకాష్ డివిజన్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

# ఒక్క ఓటు–ఒక హక్కు.. ఓటర్ల కోసం ప్రత్యేక హెల్ప్ డెస్క్ ఏర్పాటు

- ఎస్ఐఆర్ ఫారాల సమర్పణకు వార్డు స్థాయిలో సహాయ కేంద్రం....
- ప్రతి ఓటు ప్రజాస్వామ్యానికి విలువైనదే: నామ స్రవంతి రవికిరణ్....

**జహీరాబాద్ వెలుతురు జూలై 07:**

సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని 27వ వార్డులో ఓటర్ల సౌకర్యార్థం ప్రత్యేక హెల్ప్ డెస్క్‌ను ఏర్పాటు చేసినట్లు వార్డు కౌన్సిలర్ నామ స్రవంతి రవికిరణ్ తెలిపారు.

ఎస్ఐఆర్ ఫారాలకు సంబంధించి ప్రజలకు అవసరమైన సహాయం అందించడంతో పాటు ప్రతి అర్హ ఓటరు తప్పనిసరిగా ఫారాలను సమర్పించేలా అవగాహన కల్పించేందుకు ఈ కేంద్రాన్ని ప్రారంభించినట్లు ఆమె పేర్కొన్నారు.174, 177 పోలింగ్ కేంద్రాలకు చెందిన ఓటర్లు హెల్ప్ డెస్క్‌ను సంప్రదించి తమ సందేహాలను నివృత్తి చేసుకోవచ్చని తెలిపారు. రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కు ఎంతో విలువైనదని, ప్రతి ఒక్కరు తమ ఓటు హక్కును పరిరక్షించుకునేందుకు ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగస్వాములు కావాలని ఆమె పిలుపునిచ్చారు.

హెల్ప్ డెస్క్ సహాయంతో భర్తీ చేసిన గణన ఫారాలను ఓటర్లు స్థానిక బీఎల్ఓలకు అందజేశారు. ఈ కార్యక్రమంలో బీఎల్ఏ నరేష్ రెడ్డి, కాజా తదితరులు పాల్గొన్నారు.





# రూ. 70 కోట్ల స్మార్ట్ సిటీ ప్రత్యేక నిధులతో కరీంనగర్ అభివృద్ధికి నూతన అధ్యాయం

- ప్రజల చిరకాల సమస్యలకు శాశ్వత పరిష్కారం
- మేయర్ కొలగాని శ్రీనివాస్
- కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ గారికి ప్రత్యేక కృతజ్ఞతలు

**కరీంనగర్ వెలుతురు జూలై 07::**



కరీంనగర్ నగరాన్ని ఆధునిక, సుందర, సుస్థిర నగరంగా తీర్చిదిద్దే లక్ష్యంతో స్మార్ట్ సిటీ ప్రత్యేక నిధుల కింద రూ.70 కోట్లతో పలు ప్రతిష్ఠాత్మక అభివృద్ధి పనులను చేపట్టనున్నట్లు నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ తెలిపారు.ఈ సందర్భంగా స్మార్ట్ సిటీ నిధుల మంజూరుకు విశేష కృషి చేసి నగర అభివృద్ధికి అండగా నిలిచిన కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి శ్రీ బండి సంజయ్ కుమార్ గారికి నగర ప్రజల తరఫున, నగర పాలక సంస్థ తరఫున హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. అలాగే ఈ అభివృద్ధి కార్యక్రమాలకు సహకరిస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ధన్యవాదాలు తెలియజేశారు.నగరంలో ఎన్నో ఏళ్లుగా ప్రజలు ఎదుర్కొంటున్న వరదలు, ట్రాఫిక్ రద్దీ, పార్కింగ్ కొరత, విద్యుత్ వ్యయం, రహదారులు, ప్రజా మౌలిక వసతుల సమస్యలను శాశ్వతంగా పరిష్కరించే దిశగా ఈ ప్రాజెక్టులు రూపొందించామని తెలిపారు. ఇప్పటికే అన్ని పనులకు సంబంధించి డిటైల్డ్ ప్రాజెక్ట్ రిపోర్ట్స్ (DPRలు) సిద్ధమవుతున్నాయని, త్వరలోనే టెండర్లు పిలిచి పనులను వేగంగా ప్రారంభిస్తామని పేర్కొన్నారు.

## చేపట్టనున్న ప్రధాన అభివృద్ధి పనులు

- రామ్‌నగర్, RTCవర్క్‌షాప్ మరియు మంచిర్యాల చౌరస్తా వరద నివారణకు ఆధునిక హైడ్రాలిక్ డ్రైనేజీ వ్యవస్థ రూ.21.50 కోట్లు
- టవర్ సర్కిల్‌లో మల్టీ లెవెల్ హైడ్రాలిక్ పార్కింగ్ నిర్మాణం – రూ.25.00 కోట్లు
- మున్సిపల్ భవనాలపై సోలార్ ప్యానెల్స్ ఏర్పాటు – రూ.2.00 కోట్లు
- సదాశివపల్లి జంక్షన్ ఆధునీకరణ – రూ.3.00 కోట్లు
- ఎకో-ఫ్రెండ్లీ స్పాంజ్ పార్క్ అభివృద్ధి – రూ.3.00 కోట్లు
- వల్లంపాహాడ్ మోడల్ వైకుంఠధామం నిర్మాణం – రూ.2.50 కోట్లు
- అల్కాపురి కాలనీలో సీసీ రోడ్ల నిర్మాణం – రూ.1.00 కోటి
- యానిమల్ బర్త్ కంట్రోల్ & జంతు సంక్షేమ కేంద్రం ఏర్పాటు – రూ.2.00 కోట్లు
- కేఆర్ కాలనీ నుండి వల్లంపాహాడ్ బ్రిడ్జ్ వరకు సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు – రూ.2.00 కోట్లు
- సర్వేలు, డిజైన్‌లు, DPRల తయారీ కోసం కన్సల్టెన్సీ సేవలు – రూ.1.50 కోట్లు

"ప్రజల అవసరాలే మా ప్రాధాన్యత. నాణ్యతలో రాజీ లేకుండా, పూర్తి పారదర్శకతతో, నిర్ణీత గడువులో ఈ పనులను పూర్తి చేసి కరీంనగర్‌ను రాష్ట్రంలోనే ఆదర్శ నగరంగా తీర్చిదిద్దుతాం. ఈ నగర అభివృద్ధిలో ప్రజలు, ప్రజా ప్రతినిధులు, అధికారులు, మీడియా అందరూ భాగస్వాములు కావాలి" అని మేయర్ కొలగాని శ్రీనివాస్ పిలుపునిచ్చారు.

# బస్తీ ప్రజలకు నాణ్యమైన ఆరోగ్య సేవలు అందించాలి

- క్షయ వ్యాధి, లెప్రసీ కేసులను గుర్తించి రిజిస్ట్రేషన్ చేసి నమోదు చేయాలి.
- వారందరికీ ఆరోగ్య సేవలు అందించాలి.
- వైద్యాధికారులు, సిబ్బంది సమయపాలన పాటించాలి.
- నాణ్యమైన ఆ రోగ్య సేవలు ప్రతి ఒక్కరికి అందించాలి
- గర్భిణీ స్త్రీల పరీక్షలు, సేవలు , వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమం సమర్థ వంతంగా నిర్వహించాలీ.
- అన్ని రకాల మందులు పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో & బస్తీ దవాఖా నాలలో అందుబాటులో ఉన్నవని తెలి యజేశారు.
- అన్ని రకాల పరీక్షలు కూడా అందుబాటులో ఉన్నాయని తెలియ జేశారు.




- మురికివాడాలలో (స్లమ్స్)లో నివసిస్తున్న పేద ప్రజలకు క్రమం తప్పకుండా ఆరోగ్య సేవలు అందించాలి.
- సీజనల్ వ్యాధులపై ప్రజల్లో అవగాహన కల్పించి వ్యాధులు వ్యాపించకుండా చర్యలు చేపట్టాలి
- డా: పుట్ల శ్రీనివాస్
- జిల్లా వైద్య & ఆరోగ్యశాఖ అధికారి, హైదరాబాద్.






**హైదరాబాద్ వెలుతురు జూలై 07:**

మలక్పేటు క్లస్టర్ పరిధిలోని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల, బస్తీ దవాఖాన, ఆర్ బి ఎస్ కే చెందిన వైద్యాధికారులు, సూపర్వైజర్లు, హెల్త్ అసిస్టెంట్లు, ANMలు మరియు ఆశా కార్యకర్తలతో సమీక్ష సమావేశం ఈరోజు యశోద హాస్పిటల్ మలక్పేటు సమావేశ మందిరంలో నిర్వహించబడింది.ఈ సందర్భంగా DM&HO గారు మాట్లాడుతూ, వివిధ జాతీయ , రాష్ట్ర ఆరోగ్య కార్యక్రమాల అమలుపై సూచికల వారిగా సమగ్ర సమీక్ష నిర్వహించారు. కార్యక్రమాల అమలులో వేగం పెంచి సత్వరమే పూర్తి చేయాలని కోరారు.ప్రజలకు నాణ్యమైన ఆరోగ్య సేవలను సమర్థవంతంగా అందించడం ప్రతి ఆరోగ్య సిబ్బంది బాధ్యత అని పేర్కొన్నారు. ప్రభుత్వ ప్రజారోగ్య కార్యక్రమాలను క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలు చేయాలని, గర్భిణీల సంరక్షణ,సేవలు, శిశు టీకాలు, అంటువ్యాధుల నివారణ, సీజనల్ వ్యాధుల నియంత్రణ మరియు ముందు జాగ్రత్త చర్యలలో భాగంగా కీటక జనిత వ్యాధులైన మలేరియా, డెంగీ, చికున్ గునియా పై ఇంటింటి ఆరోగ్య సర్వేలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు.అలాగే, ఆరోగ్య సేవల పట్ల ప్రజల్లో మరింత అవగాహన కల్పించి, ప్రతి అర్హులైన లబ్ధిదారునికి ప్రభుత్వ ఆరోగ్య పథకాల ప్రయోజనాలు అందేలా కృషి చేయాలని ఆదేశించారు. టీబి రోగులకు నిక్షయ్ పోషన్ యోజన ద్వారా ఇచ్చే పేమెంటును సత్కారమే అందించాలి సూచించారు.హెచ్ఐవి ఎయిడ్స్ రోగులు ART సెంటర్లకు వెళ్లి చికిత్స తీసుకునే విధంగా సిబ్బంది పనిచేయాలి సూచించారు.ఈ సమావేశంలో డా : చల్లా దేవి జిల్లా టీబి అధికారి ,అదనపు జిల్లా వైద్యాధికారి డా:అనిత , అడిషనల్ డిఎంహెచ్ఓ (ఎయిడ్స్ &, లెప్రసీ) డాక్టర్ సరస్వతి , ప్రోగ్రామ్ ఆఫీసర్స్ డా: ఆశ్రిత రెడ్డి ,డా. లక్ష్మను,సీనియర్ పబ్లిక్ హెల్త్ ఆఫీసర్స్ , జిల్లా మీడియా అధికారి జక్కుల రాములు, ఇంచార్జ్ మలేరియా అధికారి ఆంజనేయులు,పాల్గొని వివిధ ఆరోగ్య కార్యక్రమాల అమలుపై సమీక్ష నిర్వహించారు. సమావేశంలో హాజరైన వైద్యాధికారులు, సూపర్వైజర్లు, హెల్త్ అసిస్టెంట్లు, ANMలు మరియు ఆశా కార్యకర్తలకు అవసరమైన సూచనలు, మార్గ దర్శకాలు , దిశా నిర్దేశం చేశారు.

# మాదిగలకు రాజ్యాధికారమే లక్ష్యం




- మంత్రి మోత్కుపల్లి నర్సింహులు
- మాదిగ భవనానికి 10 ఎకరాల భూమి కేటాయించాలని డిమాండ్
- బట్టి విక్రమార్క, వివేక్‌లను బర్తరఫ్ చేయాలని డిమాండ్
- ప్రభుత్వం లాక్కున్న దళితుల భూములు తిరిగి ఇవ్వాలి
- దళిత బంధు పెండింగ్ లబ్ధిదారులకు అందించాలని విజ్ఞప్తి

**హైదరాబాద్, వెలుతురు జూలై 07 :**

మాదిగ సామాజిక వర్గాన్ని రాజ్యాధికారం దిశగా నడిపించడమే మాదిగ మహాశక్తి సంఘం ప్రధాన లక్ష్యమని మాజీ మంత్రి మోత్కుపల్లి నర్సింహులు స్పష్టం చేశారు. ఎమ్మార్పీఎస్ ఆవిర్భావం, మాదిగ దండోరా ఉద్యమం ప్రారంభమై 33 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా మాదిగ అమరవీరులకు నివాళులర్పిస్తూ బేగంపేటలోని మహాశక్తి భవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలోని సుమారు 70 లక్షల మంది మాదిగలు తమ ఓటును తమ సామాజిక వర్గ అభ్యున్నతికే వినియోగించాలని ఆయన పిలుపునిచ్చారు. మాదిగల్లో ఐక్యత లేకపోవడం వల్లే రాజకీయంగా వెనుకబడుతున్నారని, లోక్‌సభ, రాజ్యసభల్లో తగిన ప్రాతినిధ్యం దక్కడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో మాజీ ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు మాత్రమే మాల, మాదిగ వర్గాలకు సమాన అవకాశాలు కల్పించారని గుర్తు చేశారు. మాదిగ మహాశక్తి సంఘం ద్వారా మాదిగ సమాజాన్ని రాజకీయంగా ఏకం చేసేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందిస్తున్నట్లు తెలిపారు. మాదిగ భవన నిర్మాణం కోసం ప్రభుత్వం 10 ఎకరాల భూమిని కేటాయించాలని డిమాండ్ చేశారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం మాదిగలను అణచివేసే విధంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. దళితుల సంక్షేమానికి ప్రభుత్వం మరింత చిత్తశుద్ధితో పనిచేయాలని కోరిన ఆయన, మాలలకు అన్యాయం చేస్తున్నారంటూ ఆరోపణలు ఎదుర్కొంటున్న మంత్రులు బట్టి విక్రమార్క, వివేక్‌ను మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం అక్రమంగా స్వాధీనం చేసుకున్న దళితుల భూములను తిరిగి అప్పగించాలని, గతంలో దళిత బంధు పథకం అందని అర్హులందరికీ వెంటనే మంజూరు చేయాలని కోరారు. హుజురాబాద్ ప్రాంతంలో వేలాది మంది దళితులు తమ సమస్యలతో రోడ్డున పడుతున్నారని పేర్కొన్న మోత్కుపల్లి, దళితుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టాలని కోరారు. తన 30 ఏళ్ల రాజకీయ జీవితంలో దళితులపై ఎక్కడ అన్యాయం జరిగినా ప్రశ్నించానని, చుండూరులో మాలలపై జరిగిన దాడిని ఖండిస్తూ చైతన్య రథం ద్వారా రాష్ట్రవ్యాప్తంగా పర్యటించిన విషయాన్ని గుర్తు చేశారు. భవిష్యత్తులో కూడా దళితుల హక్కులు, సామాజిక న్యాయం కోసం నిరంతరం పోరాడుతానని, అవసరమైతే జాతి కోసం ప్రాణాలు అర్పించడానికైనా సిద్ధంగా ఉన్నానని తెలిపారు.ఈ కార్యక్రమం లో నేతలు కృపాకర్ మాదిగ, ముంజగల విజయ్ కుమార్, చింత స్వామి ,డా "సగరపు ప్రసాద్ ,శివ తదితరులు పాల్గొన్నారు.

# రాజ్యాధికారంతోనే మనుగడ నాలుగైదు శాతం ఉన్న విశ్వకర్మీయులను విస్మరిస్తారా..?




- మండలి ప్రతిపక్ష నేత మధుసూదన్ చారి రౌండ్ టేబుల్ సమావేశంలో 6 తీర్మానాలు ఆమోదం

**హైదరాబాద్ వెలుతురు జూలై 07:**

విశ్వబ్రాహ్మణులు ఒక శక్తిగా ఎదగాలని, రాజ్యాధికారంలో వాటా చేజిక్కించుకోవాలని శాసనమండలిలో ప్రతిపక్ష నేత, ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనా చారి పిలుపునిచ్చారు. రాజ్యాధికారంతోనే ఏ కులానికైనా గుర్తింపు, మనుగడ ఉంటాయన్నారు. ఐదు వృత్తులను వేర్వేరు కులాలుగా చూపెట్టి... విశ్వకర్మ జాతి జనాభాను తక్కువ చేసి చూపెట్టడం అత్యంత దారుణమని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నికల్లో కేవలం రెండు శాతం ఓట్లే అధికారాన్ని తారుమారు చేస్తున్న తరుణంలో రాష్ట్ర జనాభాలో 4-5 శాతం ఉండే విశ్వబ్రాహ్మణులు ఎన్నికల్లో కీలకంగా మారతారని వక్తలు పేర్కొన్నారు. మంగళవారం నాడు సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో విశ్వకర్మ కమ్యూనిటీ జేఏసీ ఆధ్వర్యంలో నిర్వహించిన రెండో రౌండ్ టేబుల్ సమావేశంలో తెలంగాణ తొలి శాసనసభాపతి పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ నాయకుడు తంగెళ్లపల్లి రవి హాజరై... విశ్వబ్రాహ్మణుల కులం గుర్తింపు, ఐక్యత గురించి మాట్లాడారు. గ్లోబల్ విశ్వకర్మ ఎన్ఆర్ఐ ప్రతినిధి చైతన్య కూడా పాల్గొని... తన సామాజిక వర్గం అభ్యున్నతికి తనవంతు కర్తవ్యాన్ని నిర్వర్తిస్తానన్నారు. ఈ రౌండ్ టేబుల్ సమావేశంలో భాగంగా ముఖ్యమైన ఎజెండాగా ఆరు తీర్మానాలను ప్రవేశపెట్టి, ఆమోదించుకున్నారు. ఇందులో ప్రధాన తీర్మానంగా ఐదు వృత్తులైనా... ఒక్కటే కులం... అదే విశ్వకర్మ, విశ్వబ్రాహ్మణుల కులం అని చాటిచెప్పారు. విశ్వకర్మల వృత్తులను భావితరాలకు చాటిచెప్పేందుకు మ్యూజియం ఏర్పాటుకు ప్రభుత్వం సహకరించాలని, వృత్తులను పరిరక్షించాలని, ఆర్థికంగా అండగా నిలవాలని తీర్మానాలు ఆమోదించారు. చివరగా తెలంగాణ సిద్ధాంత కర్త ప్రొఫెసర్ జయశంకర్ పేరుతో అధ్యయన కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని తీర్మానం చేశారు. పాలకులు తమ తప్పులను సరిదిద్దుకోని పక్షంలో, పోరాటానికి సన్నద్ధమవ్వాలని, న్యాయమైన డిమాండ్ల సాధనకు రాజకీయ నాయకులను, ప్రభుత్వాన్ని కలిసి ఒత్తిడి చేయాలని రౌండ్ టేబుల్ సమావేశంలో ప్రసంగించిన వక్తలంతా ముక్తకంఠంతో నినదించారు. వచ్చేనెలలో మూడో రౌండ్ టేబుల్ సమావేశం ఏర్పాటు చేసుకోవాలని నిర్ణయించారు. సమావేశంలో జర్నలిస్ట్ మరియు పారిశ్రామిక వేత్త దేవరకొండ కాళిదాస్, విశ్వకర్మ వేదిక వ్యవస్థాపకులు ఆడ్లూరి రవీంద్రా చారి, రచయితల సంఘం నుంచి గాజోజు నాగభూషణం, కుందారం గణేశాచారి, ఉపేంద్రాచారి, దుబ్బాక కిషన్‌రావు, ప్రముఖ ఆంకోలాజిస్ట్ డాక్టర్ చింతమడక సాయిరాం, వేదాస్ అధ్యక్షుడు కుమారస్వామి, సదాశ్రీ తదితరులు పాల్గొని విశ్వబ్రాహ్మణులు ఐక్యమత్యం కావాలన్నారు.

# సీజనల్ వ్యాధుల నియంత్రణలో నిర్లక్ష్యం వద్దు: డీఎంహెచ్‌వో డా. స్వర్ణ కుమారి

- వైద్యాధికారులతో సమీక్షా సమావేశం నిర్వహణ
- డెంగ్యూ, మలేరియా నివారణకు అప్రమత్తంగా ఉండాలని ఆదేశం
- అలసత్వం ప్రదర్శిస్తే శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరిక




**రంగారెడ్డి జిల్లా వెలుతురు జూలై 07:**

రంగారెడ్డి జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ కార్యాలయంలో జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖాధికారి డా. స్వర్ణ కుమారి అధ్యక్షతన జిల్లాలోని వైద్యాధికారులతో సీజనల్ వ్యాధుల నివారణ, నియంత్రణ, ముందస్తు సన్నద్ధతపై సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా డా. స్వర్ణ కుమారి మాట్లాడుతూ, వర్షాకాలంలో డెంగ్యూ, మలేరియా, చికున్‌గున్యా, వైరల్ జ్వరాలు, అతిసారం వంటి సీజనల్ వ్యాధుల నివారణకు అన్ని ప్రభుత్వ ఆరోగ్య సంస్థలు పూర్తి స్థాయిలో అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. ప్రతి వైద్యాధికారి తమ పరిధిలో వ్యాధుల పర్యవేక్షణను నిరంతరం నిర్వహిస్తూ, అనుమానిత కేసులను వెంటనే గుర్తించి తక్షణ చికిత్స అందించాలని సూచించారు.సీజనల్ వ్యాధులపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం, నీరు నిల్వ కాకుండా చర్యలు తీసుకోవడం, దోమల నివారణ చర్యలను ముమ్మరం చేయడం, జ్వరం లేదా ఇతర లక్షణాలు కనిపించిన వెంటనే సమీప ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాన్ని సంప్రదించేలా ప్రజలను చైతన్యపరచాలని వైద్యాధికారులకు సూచించారు.ప్రభుత్వం నిర్దేశించిన సీజనల్ వ్యాధుల నివారణ కార్యక్రమాలను ఎట్టి పరిస్థితుల్లోనూ నిర్లక్ష్యం చేయరాదని డీఎంహెచ్‌వో స్పష్టం చేశారు. విధుల నిర్వహణలో అలసత్వం లేదా నిర్లక్ష్యం ప్రదర్శించిన అధికారులపై కఠినమైన శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.ఈ సమావేశంలో జిల్లా క్షయవ్యాధి నియంత్రణ అధికారి డా. కళ్యాణ్ చక్రవర్తి, ఉప జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖాధికారి డా. పూనమ్, జిల్లాలోని వైద్యాధికారులు, సంబంధిత కార్యక్రమాల అధికారులు పాల్గొన్నారు.

# దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతి సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ ఘన నివాళి

**హైదరాబాద్ వెలుతురు జూలై 07:**

దివంగత ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి గారి జయంతి సందర్భంగా రవాణా మరియు బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఘనంగా నివాళులర్పించారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పాలన సాగించిన గొప్ప ప్రజా నాయకుడు డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి అని కొనియాడారు. రైతులు, పేదలు, బడుగు బలహీన వర్గాల సంక్షేమం కోసం అనేక ప్రజాహిత పథకాలను అమలు చేసి ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయారని గుర్తు చేసుకున్నారు.ప్రజల సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకునేందుకు చేపట్టిన పాదయాత్ర ఆయన రాజకీయ జీవితంలో ఒక మైలురాయిగా నిలిచిందని మంత్రి పేర్కొన్నారు. గ్రామీణాభివృద్ధి, వ్యవసాయం, విద్య, వైద్యం వంటి రంగాలకు ఆయన అందించిన సేవలు చిరస్మరణీయమని అన్నారు.డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి ఆశయాలు, ప్రజాసేవ పట్ల ఆయన చూపిన అంకితభావం నేటి తరానికి ఆదర్శప్రాయమని మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. ఆయన జయంతి సందర్భంగా ఆ మహానేతకు ఘన నివాళులు అర్పిస్తూ, ఆయన స్ఫూర్తితో ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేస్తున్నామని పిలుపునిచ్చారు.

# మహారాష్ట్రను ముంచెత్తిన జలప్రళయం

- భారీ వర్షాల భీభత్సం
- లోనావాలాలో రికార్డు వృష్టి
- స్తంభించిన ముంబయి-పుణె రవాణా
- విరిగిపడ్డ కొండచరియల కలకలం
- ముంబయికి ఆరెంజ్ అలర్ట్
- స్కూళ్లు, కాలేజీలకు సెలవు
- రోడ్లపై చేరిన వరద
- పుణె జిల్లాలో నష్టం
- కశ్మీర్‌లో మేఘ విస్ఫోటనం
- రంగంలోకి రెస్క్యూ టీమ్స్

**మహారాష్ట్ర వెలుతురు జూలై 07:**

మహారాష్ట్ర వ్యాప్తంగా వరుణుడు ప్రళయం సృష్టిస్తున్నాడు. గత కొన్ని రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న కుండపోత వర్షాలకు పశ్చిమ భారతం అతలాకుతలమవుతోంది. ముఖ్యంగా దేశ ఆర్థిక రాజధాని ముంబయి సహా పొరుగున ఉన్న పుణె జిల్లాలో రికార్డు స్థాయి వర్షపాతం నమోదైంది. కేవలం 24 గంటల వ్యవధిలోనే శతాబ్దపు భారీ వర్షం కురవడంతో జనజీవనం పూర్తిగా స్తంభించిపోయింది. నదులు, వాగులు, వంకలు ఉప్పొంగి ప్రవహిస్తుండటంతో లోతట్టు ప్రాంతాలు జలమయ మయ్యాయి. రహదారులు చెరువులను తలపిస్తుండగా, రైల్వే ట్రాక్‌లపైకి భారీగా నీరు చేరడంతో రవాణా వ్యవస్థకు తీవ్ర విఘాతం కలిగింది.

### లోనావాలాలో రికార్డు స్థాయి వృష్టి: 670 మి.మీ.ల వర్షపాతం

మహారాష్ట్రలోని ప్రముఖ పర్యాటక ప్రాంతం, పుణె జిల్లాలోని ప్రసిద్ధ హిల్ స్టేషన్ అయిన లోనావాలాలో వాతావరణం భీభత్సంగా మారింది. ఆదివారం ఉదయం నుంచి సోమవారం ఉదయం వరకు గడిచిన 24 గంటల వ్యవధిలోనే ఇక్కడ ఏకంగా 670 మిల్లీమీటర్ల అత్యంత భారీ వర్షపాతం నమోదైంది. ఈ స్థాయి వర్షం లోనావాలా చరిత్రలోనే అత్యంత అరుదైనదిగా వాతావరణ నిపుణులు పేర్కొంటున్నారు. కొండప్రాంతం కావడంతో కుండపోతగా కురిసిన వర్షపు నీరంతా ఒక్కసారిగా కిందికి ప్రవహించి ఘాట్ రోడ్లను ముంచెత్తింది. పర్యాటకులు రాకపోకలు సాగించే ప్రధాన మార్గాలన్నీ వరద ఉధృతికి కొట్టుకుపోయాయి.

### ఘాట్ రోడ్డులో కొండచరియల భీభత్సం.. రవాణా స్తంభన

భారీ వర్షాల కారణంగా ముంబయి–పుణె నగరాల మధ్య ఉన్న కీలకమైన కర్జత్–లోనావాలా ఘాట్ సెక్షన్‌లో కొండచరియలు విరిగి పడ్డాయి. కొండలపై నుంచి భారీగా మట్టిపెళ్లలు, పెద్ద పెద్ద బండరాళ్లు ఒక్కసారిగా రైల్వే ట్రాక్‌లు, జాతీయ రహదారులపైకి దూసుకువచ్చాయి. దీంతో గత రెండు రోజులుగా ఈ మార్గంలో ట్రాఫిక్ అంతరాయాలు కొన సాగుతున్నాయి. రైల్వే లైన్లపై పడిన శిథిలాలను తొలగించేందుకు రైల్వే కార్మికులు, విపత్తు నిర్వహణ బృందాలు తీవ్రంగా శ్రమిస్తున్నప్పటికీ, ఎడతెరిపి లేని వర్షం వల్ల పునరుద్ధరణ పనులకు ఆటంకం కలుగుతోంది. ముంబయి, పుణె నగరాల మధ్య నడిచే పలు ఎక్స్‌ప్రెస్ రైళ్లను అధికారులు రద్దు చేయగా, మరికొన్ని రైళ్లను పాక్షికంగా రద్దు చేశారు. రహదారి మార్గంలో కూడా కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోయాయి.

### పుణె జిల్లాలో 22 చోట్ల విరిగిపడ్డ మట్టిపెళ్లలు

వర్షాల ధాటికి ఒక్క ఘాట్ రోడ్డే కాకుండా పుణె జిల్లావ్యాప్తంగా కొండ ప్రాంతాలు కదిలిపోయాయి. జిల్లాలోని विभिन्न ప్రాంతాలలో సుమారు 22 చోట్ల కొండచరియలు, మట్టిపెళ్లలు విరిగిపడినట్లు యంత్రాంగం గుర్తించింది. అనేక గ్రామాలకు వెళ్లే రహదారులు ఈ మట్టి దిబ్బల కింద కప్పబడిపోయాయి. దీంతో బాహ్య ప్రపంచంతో ఆయా గ్రామాలకు సంబంధాలు తెగిపోయాయి. పర్వత ప్రాంతాల సమీపంలో నివసించే ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు స్థానిక యంత్రాంగం చర్యలు చేపట్టింది. అత్యవసరమైతే తప్ప ఘాట్ రోడ్లలో ప్రయాణాలు చేయవద్దని పోలీసులు హెచ్చరికలు జారీ చేశారు.

### ముంబయికి ఆరెంజ్ అలర్ట్.. విద్యాసంస్థలకు ముందస్తు సెలవు

మరోవైపు మహానగరం ముంబయి వరద గుప్పిట్లో చిక్కుకుంది.



ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా నగరంలోని లోతట్టు ప్రాంతాలైన కుర్లా, సైయన్, దాదర్, అంధేరి సబ్‌వేలు పూర్తిగా జలమయ మయ్యాయి. రోడ్లపై మోకాళ్లోతు నీరు చేరడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. లోకల్ రైళ్లు సైతం ఆలస్యంగా నడుస్తున్నాయి. కాగా, మంగళవారం కూడా నగరంలో అత్యంత భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ (IMD) హెచ్చరించింది. ఈ మేరకు ముంబయి నగరానికి 'ఆరెంజ్ అలర్ట్' జారీ చేసింది.వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో బృహన్ ముంబయి మున్సిపల్ కార్పొరేషన్ (BMC) అప్రమత్తమైంది. విద్యార్థుల భద్రతను దృష్టిలో ఉంచుకుని ముందస్తు జాగ్రత్త చర్యగా ముంబయి నగరంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలలకు సెలవు ప్రకటిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రజలు అత్యవసరమైతే తప్ప ఇళ్ల నుంచి బయటకు రాకూడదని మున్సిపల్ కమిషనర్ విజ్ఞప్తి చేశారు. ఏదైనా అత్యవసర పరిస్థితి వస్తే సహాయం కోసం కంట్రోల్ రూమ్ నంబర్లను అందుబాటులో ఉంచారు.

### ఉత్తరాదినా వణికిస్తున్న వర్షాలు: జమ్మూకశ్మీర్‌లో క్లౌడ్‌బరస్ట్

కేవలం పశ్చిమ భారతమే కాకుండా ఉత్తర భారతదేశంలోనూ వాతావరణం దారుణంగా మారింది. జమ్మూకశ్మీర్ పరిధిలోని పర్వత ప్రాంతాలలో హఠాత్తుగా క్లౌడ్‌బరస్ట్ (మేఘ విస్ఫోటనం) సంభవించింది. లడఖ్, జమ్మూకశ్మీర్ సరిహద్దుల్లోని కొన్ని ప్రాంతాల్లో నిమిషాల



వ్యవధిలోనే ఆకాశానికి చిల్లు పడినట్లుగా కుంభ వృష్టి కురిసింది. ఈ మేఘ విస్ఫోటనం కారణంగా కొండ వాగులు ఉగ్రరూపం దాల్చాయి. వరద నీరు ఒక్కసారిగా జనావాసాల్లోకి దూసుకురావడంతో స్థానికులు ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని పరుగులు తీశారు. కొండచరియలు విరిగి పడటంతో జాతీయ రహదారులు మూతపడ్డాయి. ఆయా ప్రాంతాల్లో చిక్కుకుపోయిన పర్యాటకులను, స్థానికులను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు సైన్యం, ఎన్డీఆర్ఎఫ్ (NDRF) బృందాలు రంగంలోకి దిగాయి.

### సహాయక చర్యల్లో యంత్రాంగం నిమగ్నం

మహారాష్ట్రలో తలెత్తిన ఈ విపత్కర పరిస్థితులపై ముఖ్యమంత్రి కార్యాలయం నిరంతరం సమీక్షిస్తోంది. వరద ప్రభావిత జిల్లాల కలెక్టర్లతో ముఖ్యమంత్రి మాట్లాడి పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ బలగాలను ముంబయి, పుణె, థానే, కొంకణ్ ప్రాంతాల్లో మోహరించారు. ముంబయి నగరంలో వరద నీటిని తోడేందుకు వందలాది పంపులను ఏర్పాటు చేశారు. ఘాట్ రోడ్లలో విరిగిపడిన కొండ చరియలను తొలగించేందుకు భారీ క్రేన్లు, జేసీబీలను రంగంలోకి దించారు. వర్ష తీవ్రత తగ్గుముఖం పడితే తప్ప రవాణా వ్యవస్థ సాధారణ స్థితికి రావడం కష్టమని అధికారులు పేర్కొంటున్నారు. ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని, పుకార్లను నమ్మవద్దని ప్రభుత్వం కోరింది.

# వయనాడ్‌లో మరోసారి కొండచరియల భీభత్సం

- కేరళలో విరుచుకుపడిన వరుణ ప్రళయం
- సొరంగం నిర్మాణ స్థలంలో ప్రమాదం
- కల్లాడి మీనాక్షి వంతెన వద్ద అలజడి
- శిథిలాల కింద ముప్పైమంది కూలీలు
- మలప్పురం-వయనాడ్ మార్గంలో రవాణా స్తంభన
- ఘటనాస్థలికి చేరుకున్న ఎన్డీఆర్ఎఫ్ బృందాలు
- వందమంది గ్రామస్థుల ముందస్తు తరలింపు
- ముఖ్యమంత్రి వీడీ సతీశన్ అత్యవసర సమీక్ష
- బాధిత ప్రాంతానికి మంత్రుల బృందం



**వయనాడ్ వెలుతురు జూలై 07:**

కేరళలోని వయనాడ్ జిల్లాను కొండచరియల ముప్పు మరోసారి వణికించింది. గత రాత్రి నుంచి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న రికార్డు స్థాయి కుంభవృష్టికి కొండప్రాంతాలు కదిలిపోయాయి. వ్యూహాత్మకంగా నిర్మిస్తున్న అనక్కంపొయిల్–కల్లాడి–మేప్పాడి జంట సొరంగం (ట్విన్ టన్నెల్) నిర్మాణ స్థలం వద్ద మంగళవారం ఉదయం భారీగా కొండచరియలు విరిగి పడ్డాయి. కల్లాడిలోని మీనాక్షి వంతెనకు అత్యంత సమీపంలో ఈ దురంతం చోటుచేసుకుంది. కొండపై నుంచి భారీగా మట్టిపెళ్లలు, బండరాళ్లు ఒక్కసారిగా వర్కర్లు ఉండే తాత్కాలిక నివాసాలపైకి దూసుకు వచ్చాయి. ఈ ఘోర ప్రమాదంలో ఇద్దరు కార్మికులు మరణించగా, శిథిలాల కింద మరో 30 మంది వరకు చిక్కుకుపోయినట్లు స్థానిక వర్గాలు వెల్లడించాయి.

### రంగంలోకి ఎన్డీఆర్ఎఫ్ బలగాలు

ప్రమాదం జరిగిన వెంటనే స్థానికులు స్పందించి కొందరు కార్మికులను సురక్షితంగా బయటకు తీశారు. సమాచారం అందుకున్న వెంటనే కల్పెట్టా నుంచి ఫైర్ అండ్ రెస్క్యూ సర్వీసెస్, స్థానిక పోలీసులు, మీనంగడి నుంచి జాతీయ విపత్తు నిర్వహణ బలగాలు ఘటనాస్థలికి చేరుకుని యుద్ధప్రాతిపదికన సహాయక చర్యలు చేపట్టాయి. కోజికోడ్ నుంచి కూడా అదనపు ఎన్డీఆర్ఎఫ్ బృందాలను రంగంలోకి దించారు. అయితే, ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షం, దట్టమైన పొగమంచు కారణంగా సహాయక చర్యలకు తీవ్ర ఆటంకం కలుగుతోంది. కొండచరియలు విరిగిపడటంతో సొరంగం పనులకు ఉపయోగించే పలు వాహనాలు కూడా భారీగా దెబ్బతిన్నాయి. ఈ ప్రమాదం కారణంగా మీనాక్షి వంతెన వద్ద నది ఉగ్రరూపంలో ఉప్పొంగి ప్రవహిస్తుండటంతో మలప్పురం – వయనాడ్ మార్గంలో రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి.

### ముఖ్యమంత్రి అత్యవసర సమీక్ష

వయనాడ్ ప్రమాద తీవ్రతపై కేరళ ముఖ్యమంత్రి వీడీ సతీశన్ ఉన్నతాధికారులతో అత్యవసర సమావేశం నిర్వహించారు. జిల్లా కలెక్టర్‌తో ఫోన్లో మాట్లాడి పరిస్థితిని సమీక్షించారు. యుద్ధప్రాతిపదికన శిథిలాలను తొలగించి, ప్రాణనష్టం జరగకుండా కార్మికులను త్వరగా రక్షించాలని ఆదేశించారు. సీఎం ఆదేశాల మేరకు రాష్ట్ర మంత్రులు అనిల్ కుమార్, టి.సిద్దిఖీ సహాయక చర్యలను పర్యవేక్షించేందుకు వయనాడ్‌కు బయల్దేరి వెళ్లారు. కాగా, ప్రమాద స్థలానికి సమీపంలో ఉన్న దాదాపు 100 మంది స్థానికులను ముందస్తు జాగ్రత్తగా సురక్షిత ప్రాంతాలకు తరలించారు. గతంలో 2024 జులైలో వయనాడ్‌లోని ముండక్కై, చూర్‌మాలా పరిసర ప్రాంతాల్లో కొండచరియలు విరిగిపడి దాదాపు 300 మందికి పైగా ప్రాణాలు కోల్పోయిన పాత భయానక జ్ఞాపకాలను ఈ తాజా ఉదంతం మరోసారి స్థానికుల్లో రేకెత్తించింది.

# హర్మూజ్ వద్ద మళ్లీ టెన్షన్

- అమెరికా-ఇరాన్ ఒప్పందం కుదిరినా తగ్గని ఉద్రిక్తతలు
- హర్మూజ్ జలసంధిలో వాణిజ్య నౌకలపై మళ్లీ క్షిపణి దాడులు
- ఇరాన్ ఐఆర్జీసీ దళాలే దాడికి పాల్పడినట్లు అమెరికా వెల్లడి
- ఒమన్ తీరంలో మంటల్లో చిక్కుకున్న మరో చమురు ట్యాంకర్
- ఖమేనీ అంతిమయాత్ర వేళ ఇరాన్ చర్యలపై ప్రపంచ దేశాల ఆందోళన
- రెచ్చగొడితే గంటల్లో వంతెనలు కూల్చేస్తామన్న డొనాల్డ్ ట్రంప్
- విద్యుత్తు సరఫరా నిలిపివేసి ఇరాన్ పని ముగిస్తామని హెచ్చరిక
- యుద్ధ ప్రభావం ఎవరిపైనా పడటం ఇష్టం లేదన్న యూఎస్ ప్రెసిడెంట్
- అంత్యక్రియల కోసం తాము విరామం ఇచ్చామని ట్రంప్ వ్యాఖ్యలు
- ట్రంప్ అంతాన్ని చూడాలంటూ వీధుల్లో ఇరానియన్ల భారీ నినాదాలు
- సహాయం చేసిన దేశాలకే ప్రాధాన్యమంటున్న ఇరాన్ కొత్త వైఖరి

**హర్మూజ్ వెలుతురు జూలై 07:**

అమెరికా–ఇరాన్ దేశాల మధ్య సుదీర్ఘ కాలంగా సాగుతున్న యుద్ధ వాతావరణానికి ముగింపు పలుకుతూ ఇరుపక్షాల మధ్య అవగాహన ఒప్పందం కుదిరినప్పటికీ, వ్యూహాత్మక హర్మూజ్ జలసంధిలో మాత్రం ఉద్రిక్తతలు పూర్తిస్థాయిలో అణగారడం లేదు. ఈ ప్రాంతంలో అంతర్జాతీయ నౌకాయానానికి ఎలాంటి అంతరాయం కలిగించబోమని ఒప్పందంలో భాగంగా ఇరాన్ అంగీకరించినప్పటికీ, క్షేత్రస్థాయిలో పరిస్థితులు అందుకు భిన్నంగా కనిపిస్తున్నాయి. తాజాగా హర్మూజ్ జలసంధి గుండా ప్రయాణిస్తున్న రెండు వాణిజ్య నౌకలపై క్షిపణి దాడులు జరగడం అంతర్జాతీయంగా కలకలం రేపుతోంది.



### వాణిజ్య నౌకలపై మిసైల్ దాడులు

అంతర్జాతీయ జలాల్లో ప్రయాణిస్తున్న రెండు వాణిజ్య నౌకలను లక్ష్యంగా చేసుకుని క్షిపణులను ప్రయోగించారని, ఇరాన్‌కు చెందిన ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్ దళాలే ఈ దాడులకు పాల్పడ్డాయని అమెరికా రక్షణ శాఖకు చెందిన ఒక ఉన్నతాధికారి వెల్లడించారు. ఈ మేరకు అంతర్జాతీయ మీడియా సంస్థలు కథనాలను ప్రసారం చేశాయి. ఈ ఘటన జరిగిన కొద్దిసేపటికే, హర్మూజ్ జలసంధిలోని ఒమన్ తీరానికి సమీపంలో ప్రయాణిస్తున్న మరో చమురు ట్యాంకర్ ప్రమాదకరమైన రీతిలో మంటల్లో చిక్కుకుందని యునైటెడ్ కింగ్‌డమ్ మారిటైమ్ ట్రేడ్ ఆర్గనైజేషన్ సెంటర్ ధ్రువీకరించింది. ఈ ట్యాంకర్‌పై జరిగిన దాడి వెనుక కూడా ఇరాన్ హస్తమే ఉండి ఉంటుందని అనుమానిస్తున్నారు. అయితే, ఈ ప్రమాదం వల్ల సముద్ర పర్యావరణానికి ఎలాంటి ముప్పు వాటిల్ల లేదని, ఈ దాడుల్లో జరిగిన ప్రాణనష్టానికి సంబంధించిన పూర్తి వివరాలు ఇంకా తెలియరావాల్సి ఉందని బ్రిటన్ మారిటైమ్ సంస్థ పేర్కొంది.

### ఖమేనీ అంత్యక్రియల వేళ అలజడి

ఇరాన్ దివంగత సర్వోన్నత నాయకుడు అయతుల్లా అలీ ఖమేనీ అంతిమయాత్ర దేశవ్యాప్తంగా సాగుతున్న తరుణంలోనే ఈ వరుస దాడులు చోటుచేసుకోవడం గమనార్హం. ప్రస్తుతం ఇరాన్ రాజధాని టెహ్రాన్‌తో పాటు ప్రముఖ నగరాల్లో ఖమేనీ అంత్యక్రియల ఊరేగింపులు భారీ ఎత్తున జరుగుతున్నాయి. దేశమంతా శోకసంద్రంలో మునిగి పోయిన ఈ క్లిష్ట సమయంలో వాణిజ్య నౌకలపై దాడులు జరగడం వెనుక ఇరాన్ అంతర్గత వ్యూహం ఉందా అనే కోణంలో నిపుణులు విశ్లేషిస్తున్నారు. ఇటీవలి ఘర్షణల సమయంలో తమకు అండగా నిలిచిన మిత్ర దేశాలకు మాత్రమే తాము ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తామని ఇరాన్ కొత్త పల్లవి అందుకోవడం అమెరికాకు తీవ్ర ఆగ్రహం కలిగిస్తోంది.

### ట్రంప్ తీవ్ర హెచ్చరికలు

ఇరాన్ ద్వంద్వ వైఖరిపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. ఒప్పంద నిబంధనలను ఉల్లంఘిస్తే ఊరుకునేది లేదని మీడియా సాక్షిగా ఇరాన్‌ను హెచ్చరించారు. "అమెరికా ఒప్పందం కుదుర్చుకుంటుంది, లేదా అనుకున్న పని పూర్తి చేస్తుంది. ఇరాన్ పని ముగించడం మాకు అంత పెద్ద కష్టమైన విషయమేమీ కాదు. కేవలం కొన్ని గంటల వ్యవధిలోనే వారి దేశంలోని కీలక వంతెనలను కూల్చివేయగలం. వారి విద్యుత్తు సరఫరా వ్యవస్థను పూర్తిగా నిలిపివేయగలం. ఇప్పటికే ఆ దేశం దగ్గర డబ్బు లేదు, ఆర్థికంగా చితికిపోయింది. పరిస్థితులు ఇంత దారుణంగా ఉన్నా నేను శాంతియుత ఒప్పందానికే మొగ్గుచూపుతున్నాను. ఎందుకంటే యుద్ధం వల్ల అమాయకులు నష్టపోవడం నాకు ఇష్టం లేదు" అని ట్రంప్ వ్యాఖ్యానించారు.

### ఇరాన్‌లో ఆగ్రహ జ్వాలలు

మరోవైపు ట్రంప్ చేసిన వ్యాఖ్యలు ఇరాన్ ప్రజల్లో అగ్గి రాజేసాయి. ఖమేనీ అంత్యక్రియల ఊరేగింపులో నల్లని దుస్తులు ధరించి లక్షలాదిగా పాల్గొన్న జనం అమెరికాకు, డొనాల్డ్ ట్రంప్‌నకు వ్యతిరేకంగా పిడికిలి బిగించి నినాదాలు చేశారు. ట్రంప్ అంతాన్ని చూసేవరకు విశ్రమించబోమంటూ వీధులన్నీ మార్మోగిపోయేలా ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇరాన్ ప్రజలు ఇంతలా మండిపడుతున్నా ట్రంప్ మాత్రం తన శైలిలో మరింత రెచ్చగొట్టేలా మాట్లాడారు. "మనం మంచివాళ్లం కాబట్టే, మానవతా దృక్పథంతో వారి నాయకుడి అంత్యక్రియల కోసం కొద్దిగా విరామం ఇచ్చాం" అంటూ ట్రంప్ చేసిన తాజా కామెంట్లు ఇరు దేశాల మధ్య మరింత ఉద్రిక్తతలకు కారణమవుతున్నాయి.

# అహ్మదాబాద్ పేలుళ్ల కేసులో 38 మందికి మరణశిక్ష

- గుజరాత్ హైకోర్టు సంచలన తీర్పు
- శిక్షలను సవాలు చేస్తూ నిందితులు దాఖలు చేసిన పిటిషన్లు కొట్టివేత
- మృతుల కుటుంబాలకు రూ.10 లక్షలు, క్షతగాత్రులకు రూ.5 లక్షల చొప్పున పరిహారం
- 2027 మార్చి 31లోగా బాధితులకు చెల్లింపులు పూర్తి చేయాలని ప్రభుత్వానికి స్పష్టీకరణ
- 2008 జూలై 26న 21 చోట్ల బాంబుల మోత.. 56 మంది అమాయకుల బలి, 246 మందికి గాయాలు
- గోధ్రా అల్లర్లకు ప్రతీకారంగానే దాడులు.. బాధ్యత ప్రకటించుకున్న ఇండియన్ ముజాహిదీన్
- సుదీర్ఘ విచారణ అనంతరం 49 మందిని దోషులుగా తేల్చిన ప్రత్యేక న్యాయస్థానం
- తొలుత ఇచ్చిన వాంగ్మూలాలు ఉపసంహరించుకున్న నలుగురు అప్రూవర్లకూ శిక్ష ఖరారు
- విచారణ సమయంలో జైల్లో టన్నెల్ తవ్వి తప్పించుకునేందుకు నిందితులు చేసిన కుట్ర భగ్నం

**అహ్మదాబాద్ వెలుతురు జూలై 07:**

దేశాన్ని అతలాకుతలం చేసిన 2008 అహ్మదాబాద్ వరుస బాంబు పేలుళ్ల కేసులో గుజరాత్ హైకోర్టు చారిత్రాత్మక తీర్పు వెలువరించింది. ఈ కేసులో 38 మంది నిందితులకు మరణశిక్ష, మరో 11 మందికి జీవితఖైదు విధిస్తూ 2022లో ప్రత్యేక న్యాయస్థానం (Special Court) ఇచ్చిన తీర్పును హైకోర్టు పూర్తిగా సమర్థించింది. కిందికోర్టు విధించిన శిక్షలను సవాలు చేస్తూ నిందితులు దాఖలు చేసిన పిటిషన్లన్నింటినీ న్యాయస్థానం కొట్టివేసింది.దోషులకు కఠిన శిక్షలు ఖరారు చేయడంతో పాటు, మానవతా దృక్పథంతో బాధితులకు అండగా నిలవాలని హైకోర్టు ఆదేశించింది. ఈ ఘోర కలికాలంలో ప్రాణాలు కోల్పోయిన మృతుల కుటుంబాలకు రూ. 10 లక్షల చొప్పున, తీవ్రంగా గాయపడిన వారికి రూ. 5 లక్షల చొప్పున పరిహారం అందించాలని గుజరాత్ ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఈ పరిహార చెల్లింపుల ప్రక్రియను మార్చి 31, 2027లోగా పూర్తి చేయాలని గడువు విధించింది.




### ఆ నాడు ఏం జరిగింది?

2008 జూలై 26న అహ్మదాబాద్ నగరం రక్తాశ్రువులు కార్చింది. ఉగ్రవాదులు పక్కా ప్రణాళికతో కేవలం 70 నిమిషాల వ్యవధిలో నగరవ్యాప్తంగా 21 ప్రాంతాల్లో వరుస బాంబు పేలుళ్లకు పాల్పడ్డారు. జనం రద్దీగా ఉండే ప్రాంతాలు, మార్కెట్లు, ఆఖరికి గాయపడిన వారిని చేర్పించిన ఆసుపత్రుల వద్ద కూడా బాంబులు పేల్చారు. ఈ ఘోర దురంతంలో 56 మంది అమాయకులు ప్రాణాలు కోల్పోగా, 246 మంది తీవ్రంగా గాయపడ్డారు. పేలుళ్ల తీవ్రత ఏ స్థాయిలో ఉందంటే.. ఆ శబ్దాల ధాటికి సమీపంలో ఉన్న అనేకమంది కొంతకాలం పాటు తమ వినికిడి శక్తిని సైతం కోల్పోయారు. ఈ దారుణం జరిగిన రెండు రోజుల తర్వాత సూరత్‌లోనూ పోలీసులు పలు బాంబులను గుర్తించి నిర్వీర్యం చేయడంతో పెద్ద ప్రమాదం తప్పింది.

### గోధ్రా అల్లర్లకు ప్రతీకారంగానే..

ఈ అమానవీయ ఘటనపై దర్యాప్తు చేపట్టిన అహ్మదాబాద్ నగర క్రైమ్ బ్రాంచ్.. నిందితులను పట్టుకునేందుకు విస్తృతంగా గాలించింది. దర్యాప్తు సంస్థలు వంద మందిని నిందితులుగా గుర్తించగా, అందులో 78 మందిపై సుదీర్ఘ విచారణ సాగింది. 2002లో జరిగిన గోధ్రా అనంతర అల్లర్లకు ప్రతీకారంగానే ఈ పేలుళ్లకు ఒడిగట్టినట్లు విచారణలో తేలింది. ఆ తర్వాత నిషేధిత ఉగ్రవాద సంస్థ 'ఇండియన్ ముజాహిదీన్' (IM) ఈ దాడులకు తామే బాధ్యులమని ప్రకటించుకుంది.

### కోర్టు విచారణ - నాటకీయ పరిణామాలు

దాదాపు 14 ఏళ్ల సుదీర్ఘ విచారణ అనంతరం 2022లో ప్రత్యేక న్యాయస్థానం తీర్పునిస్తూ.. 49 మందిని దోషులుగా తేల్చింది. ఇందులో 38 మందికి ఉరిశిక్ష, 11 మందికి జీవిత ఖైదు విధించింది. సాక్ష్యాధారాలు లేని కారణంగా మరో 28 మందిని నిర్దోషులుగా విడుదల చేసింది. ఈ కేసులో అప్రూవర్‌గా మారిన ఒక నిందితుడికి కోర్టు క్షమాభిక్ష ప్రసాదించగా.. తొలుత ఇచ్చిన వాంగ్మూలాలను ఉపసంహరించుకుని కోర్టును పక్కదారి పట్టించేందుకు ప్రయత్నించిన మరో నలుగురు అప్రూవర్లకు మాత్రం శిక్ష ఖరారు చేసింది.ఈ కేసు విచారణ సాగుతున్న సమయంలో జైల్లో తీవ్ర నాటకీయ పరిణామాలు చోటుచేసుకున్నాయి.

అహ్మదాబాద్‌లోని సబర్మతి సెంట్రల్ జైల్లో ఉన్న నిందితుల్లో 24 మంది.. ఏకంగా సొరంగం (టన్నెల్) తవ్వి జైలు నుంచి తప్పించుకునేందుకు సాహసోపేతమైన కుట్ర పన్నారు. అయితే సమయస్ఫూర్తితో వ్యవహరించిన పోలీసులు, జైలు అధికారులు ఆ కుట్రను సకాలంలో భగ్నం చేశారు.తాజాగా గుజరాత్ హైకోర్టు ప్రత్యేక కోర్టు ఇచ్చిన ఉరిశిక్షలను సమర్థిస్తూ తీర్పునివ్వడంపై బాధితుల కుటుంబాలు హర్షం వ్యక్తం చేస్తున్నాయి. న్యాయం జరిగిందని, ఉగ్రవాదులకు ఇలాంటి శిక్షలే సరైనవని వారు పేర్కొంటున్నారు.

# ప్రదీప్ కన్స్ట్రక్షన్స్‌కు భారీ షాక్.. !

- 17 అంతస్తుల భవనంపై జీహెచ్ఎంసీ నోటీసు!
- చెరువు పరిరక్షణ పరిమితిలో నిర్మాణమని ఆరోపణలు
- నిర్మాణ అనుమతి రద్దుకు జీహెచ్ఎంసీ చర్యలు

**హైదరాబాద్ వెలుతురు జూలై 07:**

హైదరాబాద్‌లోని ప్రముఖ నిర్మాణ సంస్థ ప్రదీప్ కన్స్ట్రక్షన్స్‌కు జీహెచ్ఎంసీ భారీ షాక్ ఇచ్చింది. సోమాజిగూడలోని రాజ్‌భవన్ రోడ్‌లో ఉన్న బహుళ అంతస్తుల గృహ నిర్మాణ ప్రాజెక్టుకు సంబంధించి నిర్మాణ అనుమతిని రద్దు చేయాలని ప్రతిపాదిస్తూ కారణం చెప్పాలంటూ నోటీసు జారీ చేసింది.ప్రదీప్ రెడ్డి బద్వేలుకు చెందిన ఈ ప్రాజెక్టులో రెండు నేలమాళిగలు, స్టిల్ట్, 17 అంతస్తులతో కూడిన రెండు టవర్లు, క్లబ్ భవనం నిర్మించారు. అయితే ఈ భవనం నిర్మించిన స్థలం చెరువు పరిరక్షణ పరిమితిలో ఉందని, ఆ భూమిపై తీవ్ర వివాదం ఉన్నట్లు వచ్చిన నివేదికల ఆధారంగా జీహెచ్ఎంసీ చర్యలు ప్రారంభించింది.జీహెచ్ఎంసీ చట్టంలోని నిబంధనల ప్రకారం, నిర్మాణ అనుమతి పొందే సమయంలో ముఖ్యమైన వాస్తవాలను దాచిపెట్టి, తప్పుదారి పట్టించే సమాచారం సమర్పించినట్లు ప్రాథమికంగా గుర్తించినందున నిర్మాణ అనుమతిని రద్దు చేసే ప్రక్రియను ప్రారంభించింది.అలాగే ఈ భవనానికి సంబంధించి సమర్పించిన వినియోగ అనుమతి దరఖాస్తును కూడా ప్రస్తుతం పెండింగ్‌లో ఉంచింది. ఈ వ్యవహారంపై విచారణ పూర్తయ్యే వరకు వినియోగ అనుమతి జారీ చేయలేదని జీహెచ్ఎంసీ స్పష్టం చేసింది.ప్రదీప్ కన్స్ట్రక్షన్స్ నుంచి వివరణ అందిన అనంతరం తదుపరి చర్యలపై జీహెచ్ఎంసీ నిర్ణయం తీసుకోనుంది.



# బీజేపీ బీఆర్ఎస్ ఒక్కటే..

- బీజేపీ నేతలకు దమ్ముంటే కాళేశ్వరం ప్రాజెక్టుపై సీబీఐ విచారణ జరిపించాలి..

**ధర్మారం వెలుతురు జూలై 07:**





కేంద్ర మంత్రి కిషన్ రెడ్డికి దమ్ముంటే రాష్ట్ర ప్రభుత్వం కాళేశ్వరం ప్రాజెక్టు పై తీర్మానం చేసి సిబిఐ విచారణకు పంపిన అంశంపై విచారణ జరిపించాలని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి లక్ష్మణ్ కుమార్ డిమాండ్ చేశారు. బంజారాల శీత్ల పండుగ సందర్భంగా మంగళవారం పెద్దపల్లి జిల్లా ధర్మారం మండలం లంబాడి తండాలో మంత్రి పాల్గొన్నారు.ఈ సందర్భంగా మంత్రి అడ్లూరి మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వం పై బిజెపి నాయకులు చేస్తున్నారని అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై సిబిఐ విచారణ కొరకు తీర్మానం చేసి కేంద్ర ప్రభుత్వానికి పంపిస్తే ఇప్పటివరకు విచారణ ముందుకు సాగడం లేదని మంత్రి లక్ష్మణ్ కుమార్ అన్నారు.కాళేశ్వరంపై సీబీఐ విచారణ కేంద్ర ప్రభుత్వం ఆదేశిస్తేనే బీజేపీ బీఆర్ఎస్ ఒకటి కాదని భావిస్తామని లేదంటే రెండు పార్టీలు ఒకటేనని ప్రజలకు వివరిస్తామని మంత్రి తెలిపారు.

# సీజేపీకి ఢిల్లీ హైకోర్టులో భారీ ఊరట

- కాక్రోచ్ జనతా పార్టీ అధికారిక 'ఎక్స్' ఖాతా పునరుద్ధరణ
- కేంద్ర ప్రభుత్వం విధించిన నిషేధాన్ని ఎత్తివేస్తూ న్యాయస్థానం ఆదేశాలు
- నీట్ పరీక్షల నేపథ్యంలో గతంలో ఆంక్షలు విధించిన యంత్రాంగం
- పరీక్షల ప్రక్రియ ముగిసినందున ఖాతా నిలిపివేతలో అర్థం లేదన్న కోర్టు
- విద్యార్థుల్లో గందరగోళం రేపకుండా ఉండేదుకే నని వివరించిన సొలిసిటర్ జనరల్
- కేంద్రం అభ్యంతరాలను తోసిపుచ్చుతూ ఉత్తర్వులు జారీ చేసిన జస్టిస్ స్వర్ణకాంత శర్మ
- సత్వరమే అకౌంట్ యాక్టివేట్ చేయాలని సామాజిక మాధ్యమానికి స్పష్టీకరణ
- కోర్టు తాజా తీర్పుపై హర్షం వ్యక్తం చేసిన సీజేపీ శ్రేణులు
- మరో 48 గంటల్లో అందుబాటులోకి రానున్న అధికారిక హ్యాండిల్
- వ్యంగ్య రాజకీయ ఉద్యమ వేదిక చట్టపరమైన పోరాటంలో విజయం

**ఢిల్లీ వెలుతురు జూలై 07:**

సోషల్ మీడియాలో విపరీతమైన ప్రజాదరణ పొందిన కాక్రోచ్ జనతా పార్టీకి ఢిల్లీ హైకోర్టులో భారీ ఊరట లభించింది. వివాదాస్పద కారణాల వల్ల గతంలో కేంద్ర ప్రభుత్వం నిలిపివేసిన ఆ పార్టీ అధికారిక సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ఎక్స్' (గతంలో ట్విటర్) ఖాతాను తక్షణమే పునరుద్ధరించాలని ఢిల్లీ హైకోర్టు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు సీజేపీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే దాఖలు చేసిన పిటిషన్‌పై జస్టిస్ స్వర్ణకాంత శర్మ ధర్మాసనం తుది ఉత్తర్వులు వెలువరించింది.




### నీట్ ముగిసింది.. ఇక ఆంక్షలు ఎందుకు?

జాతీయ అర్హత పరీక్ష (NEET) ముగిసిన నేపథ్యంలో, ఈ అకౌంట్‌పై కేంద్ర ప్రభుత్వం వ్యక్తంచేసిన అభ్యంతరాలను కోర్టు పూర్తిగా తోసిపుచ్చింది. విచారణ సందర్భంగా కేంద్రం తరపున హాజరైన సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా కోర్టుకు వివరణ ఇస్తూ.. నీట్ పరీక్షల సమయంలో విద్యార్థులు, తల్లిదండ్రులలో గందరగోళం లేదా శాంతిభద్రతల సమస్యలు తలెత్తకుండా ఉండేందుకే ముందస్తు జాగ్రత్తగా ఈ అకౌంట్‌ను తాత్కాలికంగా హోల్డ్‌లో ఉంచినట్లు తెలిపారు. అయితే ఇప్పుడు పరీక్షల ప్రక్రియ పూర్తయినందున సదరు ఖాతాపై నిషేధాన్ని కొనసాగించడంలో ఎలాంటి అర్థం లేదని హైకోర్టు అభిప్రాయపడింది. పరీక్షల నిర్వహణ సమయంలో సాంకేతిక కారణాల దృష్ట్యా ఆంక్షలు విధించినప్పటికీ, ప్రస్తుత తరుణంలో వాటిని పొడిగించాల్సిన అవసరం లేదని స్పష్టం చేసింది.

### శ్రేణుల హర్షం.. 24 గంటల్లో అకౌంట్ యాక్టివేట్!


హైకోర్టు తాజా ఉత్తర్వులతో కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) శ్రేణులు, మద్దతుదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కోర్టు ఆదేశాల నేపథ్యంలో మరో 24 నుంచి 48 గంటల్లో సీజేపీ అధికారిక 'ఎక్స్' హ్యాండిల్ తిరిగి భారత్‌లో పూర్తిగా యాక్టివేట్ అయ్యే అవకాశం ఉందని ఐటీ నిపుణులు పేర్కొంటున్నారు. ఐటీ చట్టంలోని సెక్షన్ 69(ఎ) కింద కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రిత్వ శాఖ జారీ చేసిన బ్లాకింగ్ ఆర్డర్లను సవాలు చేస్తూ సీజేపీ చేసిన చట్టపరమైన పోరాటానికి ఈ తీర్పుతో విజయం లభించినట్లయింది.

# గ్రామపంచాయతీలను బలోపేతం చేయడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యం

- గ్రామస్థాయిలో ఒక్క రూపాయి కూడా నిబంధనలకు విరుద్ధంగా ఖర్చు కాకూడదు
- నేటి నుంచి జిల్లాల్లో సర్పంచులు, కార్యదర్శులు, అధికారులకు మూడు రోజుల సమగ్ర శిక్షణ
- 16వ ఆర్థిక సంఘం నిధులు, GP SAP, వి.బి.జి. రామ్-జి చట్టంపై పూర్తి అవగాహన కల్పించాలి
- వి.బి.జి. రామ్-జి పనుల్లో 12 కోట్ల పని దినాల లక్ష్యాన్ని సాధించాలి
- శిక్షణ కార్యక్రమాలకు తప్పనిసరిగా హాజరుకావాలి..
- నిర్లక్ష్యం చేస్తే శాఖాపరమైన చర్యలు తప్పవు

**హైదరాబాద్ వెలుతురు జూలై 07:**

గ్రామపంచాయతీలే గ్రామాభివృద్ధికి కేంద్రబిందువని, గ్రామస్థాయిలో చేపట్టే ప్రతి అభివృద్ధి కార్యక్రమం ప్రజల అవసరాలకు అనుగుణంగా, నిబంధనలకు లోబడి అమలు కావాలని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి డా. దనసరి అనసూయ సీతక్క అధికారులను ఆదేశించారు. గ్రామపంచాయతీలు బలపడితేనే గ్రామ స్వరాజ్యం సాకారమవుతుందని, అందుకు అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.గ్రామపంచాయతీ సమగ్ర అభివృద్ధి ప్రణాళిక (GP SAP), 16వ ఆర్థిక సంఘం నిధుల వినియోగం, వి.బి.జి. రామ్-జి చట్టం అమలు, ఉపాధి హామీ పనులు, తాగునీటి సరఫరా, పారిశుద్ధ్యం, గ్రామీణ మౌలిక సదుపాయాల అభివృద్ధిపై జిల్లా అదనపు కలెక్టర్లు (లోకల్ బాడీస్), ఇంజినీర్-ఇన్-చీఫ్‌లు, CEOలు, DRDOలు, DPOలు, EE(PR), EE(RWS) అధికారులతో మంత్రి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, నూతన విధానాలు, మార్గదర్శకాలపై క్షేత్రస్థాయిలో పనిచేసే సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, ఇంజినీర్లు, సంబంధిత శాఖల అధికారులకు సమగ్ర అవగాహన కల్పించేందుకే జూలై 8 నుంచి 10 వరకు రాష్ట్రవ్యాప్తంగా మూడు రోజుల శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే రాష్ట్రస్థాయిలో మాస్టర్ రిసోర్స్ పర్సన్లకు శిక్షణ పూర్తయిందని, అదే నాణ్యతతో జిల్లాల్లో శిక్షణలు నిర్వహించాలని అధికారులను ఆదేశించారు.ప్రతి శిక్షణలో గ్రామపంచాయతీ సమగ్ర అభివృద్ధి ప్రణాళిక తయారీ, అన్ని శాఖల సమన్వయం, గ్రామ అవసరాల ప్రాధాన్యత నిర్ణయం, 16వ ఆర్థిక సంఘం నిధుల వినియోగ నిబంధనలు, వి.బి.జి. రామ్-జి చట్టంలోని కొత్త విధానాలు, పనుల ఎంపిక, నిధుల నిర్వహణ, పరిపాలనా ప్రక్రియలపై స్పష్టమైన అవగాహన కల్పించాలని సూచించారు. గ్రామస్థాయిలో ఒక్క రూపాయి కూడా నిబంధనలకు విరుద్ధంగా ఖర్చు కాకుండా ప్రతి అధికారి బాధ్యతగా వ్యవహరించాలని స్పష్టం చేశారు.వి.బి.జి. రామ్-జి పథకం కింద ఈ ఆర్థిక సంవత్సరానికి రూ.6,311 కోట్ల బడ్జెట్‌కు ప్రభుత్వం ఆమోదం తెలిపిందని, జూలై నుంచి వచ్చే ఏడాది మార్చి వరకు రాష్ట్రవ్యాప్తంగా 12 కోట్ల పని దినాలు కల్పించడమే లక్ష్యమని మంత్రి తెలిపారు. ప్రతి గ్రామపంచాయతీలో నెలకు కనీసం వెయ్యి పని దినాలు సృష్టించేలా కార్యాచరణ రూపొందించాలని, రాష్ట్రవ్యాప్తంగా ప్రతిరోజూ ఐదు లక్షల మంది కూలీలకు ఉపాధి కల్పించే దిశగా అధికారులు పనిచేయాలని ఆదేశించారు.ఎల్-నినో ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకుని నీటి సంరక్షణ పనులకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని మంత్రి సూచించారు. ప్రతి ఇంటికి ఇంకుడు గుంత (మ్యాజిక్ సోక్ పిట్), ప్రతి పొలానికి పంటకుంట (ఫార్మ్ పాండ్), ప్రతి గ్రామానికి ఊటకుంట (పర్కొలేషన్ ట్యాంక్) ఏర్పాటు, ప్రతి గ్రామంలో కనీసం ఒక బోర్‌వెల్ రీఛార్జ్ నిర్మాణం, రాష్ట్రవ్యాప్తంగా వెయ్యి కొత్త వ్యవసాయ బావుల తవ్వకానికి కార్యాచరణ చేపట్టాలని ఆదేశించారు.గ్రామాల్లో తాగునీటి సరఫరా, పారిశుద్ధ్యం, అంతర్గత రహదారులు, డ్రైనేజీ, పచ్చదనం, ప్రజా మౌలిక సదుపాయాలు, ఉపాధి కల్పన వంటి అంశాల్లో సంతృప్త స్థాయి (సాచ్యురేషన్) సాధించే దిశగా ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. ఇప్పటికే ఆమోదం పొందిన గ్రామపంచాయతీ భవనాలు, మహిళా భవనాలు, అంగన్‌వాడీ భవనాల నిర్మాణాలను గడువులోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.16వ ఆర్థిక సంఘం నిధులను కేంద్ర మార్గదర్శకాల ప్రకారమే వినియోగించాలని, ఆమోదించిన వార్షిక కార్యాచరణ ప్రణాళికకు అనుగుణంగా మాత్రమే ఖర్చు చేయాలని మంత్రి స్పష్టం చేశారు. నిబంధనల ఉల్లంఘనకు అవకాశం ఇవ్వకుండా ప్రతి లావాదేవీ పారదర్శకంగా ఉండాలని పేర్కొన్నారు.వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని తాగునీటి సరఫరాలో ఎలాంటి అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవాలని, సీజనల్ వ్యాధుల నివారణకు గ్రామస్థాయిలో పారిశుద్ధ్య కార్యక్రమాలు ముమ్మరం చేయాలని సూచించారు. ఘన వ్యర్థాల నిర్వహణ (SWM Rules–2026) పనులను నిర్దేశిత గడువులో పూర్తి చేయడంతో పాటు, వీధి కుక్కల నియంత్రణకు స్టెరిలైజేషన్ కార్యక్రమాలు, Animal Birth Control (ABC) కేంద్రాల ఏర్పాటుపై చర్యలు తీసుకోవాలని DPOలకు ఆదేశించారు.గ్రామపంచాయతీలు స్వయం సమృద్ధిగా ఎదగాలంటే స్వంత ఆదాయ వనరుల (OSR) పెంపుపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, ప్రతి గ్రామపంచాయతీ ఆదాయాన్ని పెంచే కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలని మంత్రి సూచించారు.జిల్లాల్లో నిర్వహించే మూడు రోజుల శిక్షణలకు సర్పంచులు, ఉపసర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, ఇంజినీరింగ్ అధికారులు, మండల, జిల్లా స్థాయి సంబంధిత అధికారులు తప్పనిసరిగా హాజరుకావాలని మంత్రి సీతక్క స్పష్టం చేశారు.





నిర్లక్ష్యంగా గైర్హాజరయ్యే వారిపై శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ శిక్షణలను సాధారణ కార్యక్రమంగా కాకుండా గ్రామాభివృద్ధికి దిశానిర్దేశం చేసే అవకాశంగా ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు.ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి దాన కిశోర్, కమిషనర్ దివ్య దేవరాజన్, ప్రత్యేక కమిషనర్ శ్రీలక్ష్మి, ఇంజినీర్-ఇన్-చీఫ్‌లు, జిల్లా అదనపు కలెక్టర్లు (లోకల్ బాడీస్), CEOలు, DRDOలు, DPOలు, EE(PR), EE(RWS) తదితర అధికారులు పాల్గొన్నారు.

# 2034 నాటికి కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయడమే లక్ష్యం: సీఎం రేవంత్ రెడ్డి

- తెలంగాణ ఫుడ్స్‌లో కొత్త బాలామృతం ప్లాంట్ ప్రారంభం
- మహిళల సాధికారతకు ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని వెల్లడి
- పోషకాహారం, విద్య, సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం

**హైదరాబాద్ వెలుతురు జులై 07:**







తెలంగాణ ఫుడ్స్‌లో నూతన బాలామృతం ప్లాంట్‌ను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు మెరుగైన పోషకాహారం అందించడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. ఆనాడు మాజీ ప్రధాని ఇందిరా గాంధీ మహబూబ్‌నగర్ జిల్లాలో ప్రారంభించిన కార్యక్రమం అంచెలంచెలుగా అభివృద్ధి చెంది నేడు ఆధునిక బాలామృతం ప్లాంట్‌గా రూపుదిద్దుకోవడం ఆనందంగా ఉందన్నారు.ఇందిరా గాంధీ, సోనియా గాంధీ, ప్రియాంక గాంధీ నుంచి మంత్రి సీతక్క వరకు మహిళలు రాజకీయాల్లో తమ సత్తా చాటారని సీఎం పేర్కొన్నారు. ప్రజా ప్రభుత్వం మహిళల సాధికారతకు పెద్దపీట వేస్తోందని, రాష్ట్రంలో రెండు కోట్లకు పైగా మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించామని చెప్పారు. ఇందిరమ్మ ఇళ్లను మహిళల పేరుతోనే మంజూరు చేస్తున్నామని, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందిస్తున్నామని తెలిపారు.రాష్ట్రంలోని కోట్లాది మందికి సన్నబియ్యం పంపిణీ చేస్తున్నామని, పట్టణ ప్రాంతాల్లో పేదల కోసం లక్ష ఇళ్ల నిర్మాణాన్ని లక్ష్యంగా పెట్టుకున్నామని సీఎం వెల్లడించారు. వెయ్యి ఆర్టీసీ బస్సులకు మహిళలను యజమానులుగా చేస్తున్నామని, వెయ్యి మెగావాట్ల సౌర విద్యుత్ ఉత్పత్తి ప్రాజెక్టు బాధ్యతలను కూడా మహిళలకు అప్పగించామని చెప్పారు.2034 నాటికి రాష్ట్రంలో కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయడమే తన లక్ష్యమని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ఆ దిశగా ప్రభుత్వం కార్యాచరణ అమలు చేస్తోందని తెలిపారు. మహిళలను ఆర్థికంగా బలోపేతం చేయడమే కాకుండా గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం అందించేందుకు ఆధునిక బాలామృతం ప్లాంట్‌ను ప్రారంభించామని పేర్కొన్నారు.అభివృద్ధి చెందిన ఆరోగ్య తెలంగాణ నిర్మాణమే ప్రభుత్వ లక్ష్యమని సీఎం చెప్పారు. పేద విద్యార్థులు ఆకలితో పాఠశాలకు వెళ్లకూడదనే ఉద్దేశంతో ప్రభుత్వ పాఠశాలల్లో అల్పాహార పథకాన్ని అమలు చేస్తున్నామని తెలిపారు. విద్యార్థులతో పాటు ఉపాధ్యాయులకు కూడా అల్పాహారం, మధ్యాహ్న భోజన సదుపాయం కల్పిస్తున్నామని చెప్పారు. కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దుతున్నామని, నాణ్యమైన విద్యతో పాటు విద్యార్థుల ఆరోగ్యంపైనా ప్రత్యేక దృష్టి పెట్టామని వివరించారు.ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలు ఓటు బ్యాంకు రాజకీయాల కోసం కాదని, భావితరాల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని చేపడుతున్న చర్యలని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. రాజకీయాలకు అతీతంగా ఉప్పల్ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తామని ఆయన తెలిపారు.

# కడియం శ్రీహరి వ్యవహారశైలిపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి మంత్రి కొండా సురేఖ ఫిర్యాదు

**హైదరాబాద్ వెలుతురు జులై 07:**



స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే శ్రీ కడియం శ్రీహరి దేవాదాయ, ధర్మాదాయ శాఖ మంత్రిగా తనకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా, దేవాదాయశాఖ అధికారులతో అధికారిక సమీక్ష నిర్వహించడం పై మంత్రి కొండా సురేఖ గారు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిగారికి ఫిర్యాదు చేశారు. కడయం శ్రీహరి ప్రభుత్వ పరిపాలనా విధానాలు, మంత్రిగా తన అధికార పరిధిని బేఖాతరు చేశారని మంత్రి సురేఖ లేఖలో పేర్కొన్నారు.మంత్రి కొండా సురేఖ తన ఫిర్యాదు లేఖలో, దేవాదాయ, ధర్మాదాయ శాఖకు సంబంధించిన పరిపాలన, విధాన నిర్ణయాలు, అధికారిక సమీక్షలు, అభివృద్ధి కార్యక్రమాల పర్యవేక్షణ తదితర అంశాలు సంబంధిత శాఖా మంత్రి పరిధిలోకి వస్తాయని స్పష్టం చేశారు. అయినప్పటికీ, శాఖా మంత్రికి ఎలాంటి సమాచారం ఇవ్వకుండా ఎమ్మెల్యే కడియం శ్రీహరి దేవాదాయ శాఖ డైరక్టర్ తో పాటు శాఖ అధికారులను సమావేశపరచి పలు దేవాలయాల అభివృద్ధి, నిధుల కేటాయింపులు, మాస్టర్ ప్లాన్ల రూపకల్పన, దేవాలయ భూముల పరిరక్షణ, ఆక్రమణల తొలగింపు, అధికారులకు గడువులు నిర్దేశించడం వంటి అంశాలపై అధికారిక సమీక్ష నిర్వహించడం పరిపాలనా పరంగా అభ్యంతరకరమని, RULES OF BUSINESS స్ఫూర్తిని ఉల్లంఘించడమేనని పేర్కొన్నారు. శాఖా పరిపాలనకు సంబంధించిన విధానపరమైన నిర్ణయాలు సంబంధిత శాఖా మంత్రి ఆధ్వర్యంలోనే జరగాల్సి ఉంటుందనే విషయం ప్రజా జీవితంలో అనుభవజ్ఞులైన ప్రతి ప్రజాప్రతినిధికి విదితమేనని, అలాంటి పరిస్థితుల్లో శాఖా మంత్రిని పూర్తిగా పక్కనపెట్టి అధికారిక సమీక్ష నిర్వహించడం ప్రభుత్వ పరిపాలనా వ్యవస్థలో అనుచిత సంప్రదాయానికి దారితీస్తుందని మంత్రి తన లేఖలో స్పష్టం చేశారు.ఇలాంటి చర్యలు ప్రభుత్వంలో పరిపాలనా సమన్వయాన్ని దెబ్బతీయడమే కాకుండా అధికార యంత్రాంగంలో అయోమయ పరిస్థితులకు దారితీసే అవకాశం ఉందని, భవిష్యత్తులో ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా పార్టీ స్థాయిలో తగిన చర్యలు తీసుకోవాలని మంత్రి విజ్ఞప్తి చేశారు. ఈ వ్యవహారంపై సమగ్రంగా పరిశీలించి, సంబంధిత అంశాలపై వివరణ కోరడంతో పాటు, పార్టీ క్రమశిక్షణా కమిటీ ద్వారా విచారణ జరిపించి తగిన చర్యలు తీసుకోవాలని మంత్రి తన ఫిర్యాదులో కోరారు.

# వలస కార్మికుల పిల్లల చెంతకే అంగన్వాడి సేవలు

- మొబైల్ అంగన్వాడి మంచి ఆలోచన.. విజయవంతమైతే మరిన్ని వాహనాలు
- కార్మికుల పిల్లలకు పోషకాహారం, ఆరోగ్యం, విద్య అందాలి
- కార్మిక, ఉపాధి, శిక్షణ & గనుల శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి

**హైదరాబాద్ వెలుతురు జులై 07:**



వలస కార్మికుల పిల్లలకు పోషకాహారం, ఆరోగ్య సంరక్షణ, ప్రీ–స్కూల్ విద్య వంటి అంగన్వాడి సేవలను చేరువ చేసేందుకు మొబైల్ అంగన్వాడి కేంద్రాలు ఎంతగానో ఉపయోగపడతాయని కార్మిక, ఉపాధి, శిక్షణ & గనుల శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి గారు అన్నారు. కార్మికులు ఉపాధి కోసం ప్రాంతాలు మారుతున్న నేపథ్యంలో వారి పిల్లలు ప్రభుత్వ సంక్షేమ సేవలకు దూరం కాకుండా ఇలాంటి వినూత్న కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమని పేర్కొన్నారు.కార్మిక శాఖ సహకారంతో మహిళా, శిశు సంక్షేమ శాఖ రూపొందించిన మొబైల్ అంగన్వాడి వాహనాన్ని మంగళవారం ఎంసీఆర్ హెచ్‌ఆర్‌డీలో మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్కతో కలిసి మంత్రి వివేక్ వెంకటస్వామి జెండా ఊపి ప్రారంభించారు. ఈ వాహనం మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలోని ఇందిరమ్మ కాలనీలో అంగన్వాడి సేవలను అందించనుంది.ఈ సందర్భంగా మంత్రి వివేక్ వెంకటస్వామి మాట్లాడుతూ.. చిన్నారుల ఆరోగ్యకరమైన ఎదుగుదలలో అంగన్వాడి కేంద్రాల పాత్ర అత్యంత కీలకమన్నారు. ‘‘అంగన్వాడి కేంద్రాల ద్వారా లక్షలాది మంది చిన్నారులకు ఎంతో మేలు జరుగుతోంది. అంగన్వాడి సేవలను మొబైల్ కేంద్రాల ద్వారా అవసరమైన ప్రాంతాలకు తీసుకెళ్లాలన్న మంత్రి సీతక్క ఆలోచన అభినందనీయం’’ అని పేర్కొన్నారు.వలస కార్మికులు ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి వెళ్తుండటంతో వారి పిల్లలు అంగన్వాడి సేవలను పూర్తిస్థాయిలో పొందలేకపోతున్నారని మంత్రి తెలిపారు. మొబైల్ అంగన్వాడి వాహనాలు నేరుగా కార్మికులు నివసించే ప్రాంతాలకు వెళ్లడం ద్వారా వారి పిల్లలకు ఎంతో ప్రయోజనం కలుగుతుందన్నారు. ‘‘వలస కార్మికులు, వారి పిల్లలు ఈ సేవలను సద్వినియోగం చేసుకోవచ్చు. మంచి ఉద్దేశంతో ప్రారంభించిన ఈ కార్యక్రమం విజయవంతమైతే రానున్న రోజుల్లో మరిన్ని మొబైల్ అంగన్వాడి కేంద్రాలను అందుబాటులోకి తీసుకొచ్చేందుకు చర్యలు తీసుకుంటాం అని మంత్రి వివేక్ వెంకటస్వామి వెల్లడించారు.కార్మికుల సంక్షేమం అంటే కేవలం ఉపాధి, వేతనాలకే పరిమితం కాదని, వారి కుటుంబాలు, పిల్లల ఆరోగ్యం, విద్య, భవిష్యత్తును కూడా దృష్టిలో పెట్టుకోవాల్సిన అవసరం ఉందన్నారు. మహిళా, శిశు సంక్షేమ శాఖతో కలిసి కార్మిక శాఖ ఇలాంటి ప్రజాప్రయోజన కార్యక్రమాలకు పూర్తి సహకారం అందిస్తుందని స్పష్టం చేశారు.మంత్రి సీతక్క మాట్లాడుతూ.. అంగన్వాడి కేంద్రాలు లేని ప్రాంతాల్లో నివసించే చిన్నారులు, ముఖ్యంగా ఉపాధి కోసం హైదరాబాద్ వంటి నగరాలకు వలస వచ్చే కార్మికుల పిల్లలు పోషకాహారం, ఆరోగ్య సంరక్షణ, ప్రీ–స్కూల్ విద్య వంటి సేవలకు దూరమవుతున్నారని తెలిపారు. ఒక్క చిన్నారి కూడా ప్రభుత్వ సేవలకు దూరం కాకూడదనే లక్ష్యంతో మొబైల్ అంగన్వాడి కేంద్రాలను అందుబాటులోకి తీసుకొస్తున్నట్లు చెప్పారు.

# 7 నుండి 8 ఎకరాల వరకు భూమి కలిగిన రైతులకు రైతుభరోసా నిధుల విడుదల

- కేవలం 7 రోజుల్లోనే రైతుభరోసా కింద 7750.45 కోట్లు జమ
- నేడు 7 నుండి 8 ఎకరాల సాగు భూమి ఉన్న 58,831 మంది రైతుల ఖాతాలలో 259.73 కోట్లు జమ
- ఇప్పటివరకు మొత్తం 68.96 లక్షల మంది రైతులకు రూ.7750.45 కోట్ల రైతుభరోసా సాయం
- మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

**హైదరాబాద్, వెలుతురు జులై 7:**



రాష్ట్ర ప్రభుత్వం రైతుభరోసా పథకం కింద నేడు 7 వ విడతలో 7 నుండి 8 ఎకరాలకు వరకు సాగుభూమి కలిగిన రైతుల ఖాతాల్లో రూ. 259.73 కోట్లను నేరుగా జమ చేసినట్లు వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వెల్లడించారు. ఈ విడతలో 58,831 మంది రైతులు, 4.32 లక్షల ఎకరాల సాగుభూమికి సంబంధించిన రైతుభరోసా సాయాన్ని పొందారని మంత్రి తెలిపారు.మంత్రి తుమ్మల మాట్లాడుతూ, రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా విడతల వారీగా రైతుభరోసా నిధులను విడుదల చేస్తున్నామని, ఇప్పటికే 6 దశలలో 7 ఎకరాల వరకు భూమి కలిగిన రైతులకు నిధులు విడుదల చేయగా, ఈ రోజు 7 నుండి 8 ఎకరాల వరకు భూమి కలిగిన రైతులందరికీ రైతుభరోసా సాయం అందించమన్నారు.ఇప్పటివరకు రైతుభరోసా పథకం కింద మొత్తం 68.96 లక్షల మంది రైతులకు, 129.17 లక్షల ఎకరాల సాగుభూమికి సంబంధించి రూ.7750.45 కోట్ల సహాయాన్ని ప్రభుత్వం విడుదల చేసినట్లు మంత్రి తెలిపారు. రైతు సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, అర్హులైన ప్రతి రైతుకు రైతుభరోసా అందేలా ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని ఆయన స్పష్టం చేశారు.

# ఆర్థిక భారం ఉన్నా పేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం: ఎమ్మెల్యే కోరం కనకయ్య

**ఇల్లందు, వెలుతురు జులై 7:**



గత ప్రభుత్వం చేసిన అప్పుల కారణంగా రాష్ట్రంపై ఆర్థిక భారం ఉన్నప్పటికీ పేదల సంక్షేమంలో ఎలాంటి రాజీ పడకుండా ప్రభుత్వం పనిచేస్తోందని ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య అన్నారు.కళ్యాణలక్ష్మి, సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేసిన సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో ఈ చెక్కులు సంవత్సరానికి ఒకసారి మాత్రమే అందేవని, ప్రస్తుతం ప్రజా ప్రభుత్వం నెలనెలా లబ్ధిదారులకు అందజేస్తోందని తెలిపారు.

గత ప్రభుత్వంలో రేషన్ కార్డు పొందాలంటే పైరవీలు చేయాల్సి వచ్చేదని, డబ్బులు ఖర్చు చేయాల్సి వచ్చేదని ఆరోపించారు. ప్రస్తుతం అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ఎలాంటి ఖర్చు లేకుండా రేషన్ కార్డులు మంజూరు చేస్తున్నామని, వాటితో పాటు సన్నబియ్యం కూడా పంపిణీ చేస్తున్నామని పేర్కొన్నారు.ప్రజలు ఏ ప్రభుత్వం ఏ మేరకు ప్రజా సంక్షేమం కోసం పనిచేసిందో ఆలోచించి నిర్ణయం తీసుకోవాలని ఎమ్మెల్యే కోరం కనకయ్య పిలుపునిచ్చారు.

# “కలిసి వచ్చే కాలం లేదు”

కాలం కలిసి రాలేదని
ఎందుకు తడబడుతావు?..
ధైర్యంతో నిలబడాలి...
నీ ఆత్మవిశ్వాసమే కలిసి వొచ్చే కాలం!..
నీ పట్టుదలనే నీ ఉన్నతకి స్థానం.
నిందించుకుంటూ కుర్చోకు!..
నిరాశతో దిగులుగా ఉండకు..
కుంగిపోకు.. కుమిలిపోకు
దివ్యమైన చూపుతో దిగాంతాలు దాటు !..
చైతన్య స్ఫూర్తితో శరవేగంగా కదులు!..
ఆశయం మీద దృష్టి పెట్టు...
ఆలోచనకు పదును పెట్టు...
అనుకున్నది సాధించు!..
ఆశించింది అందే వరకు చైతన్యం విడవకు!..
నీ మానసిక సంకల్ప బలమే
నీ జీవితంలో నింపే కొత్త వెలుగు ...
నీమదిలో మెదిలే సృజన శీలత...
నీకునీవే తలుచుకొని...
నీకునీవె పిలుచుకొని...
గుండె అరలలో కలువపరిచే స్పందల్ని తొలగించి...
మనసుపోరలలో కదిలే కలతల్ని తుడిచి వేయాలి..
నీలోని జవసత్వాల్ని కూడకట్టుకొని...
గమ్యం వైపు కదిలిపోవాలి !...
నీకు నీవే సమర్థుడవు ...
అన్నీ సామర్థ్యాలు నీలోనే...
నిన్ను నిలబెట్టుకునే...
నైతికవిలువల్ని వదులొద్దు !..
అభివృద్ధి చోటు నీలోనే...
భవిష్యత్తుకు బాట నీనుంచే ...
సాధించే కర్తగా కర్తవ్యంతో సాగు!...
నిట్టూర్చుకుంటూ కూర్చోకు
నీకునీవే ఓ ప్రతిభ శాలివి ...
ప్రగతి వైపు పరుగులు పడాలి...
స్పర్థలకు స్పందించకు...
ఆత్మాభిమానంతో ముందుకు కదులు!..
నీకు నీవే ఓ సహకారంకావాలి
నీకు నీవే ఓ నిర్వచనమై నిలువాలి..
నీలోని నిర్లక్ష్యాన్ని వదిలించు...
లక్ష్యం వైపు పయనించు..
అనుకున్నది అలవోకగా అందుతుంది!..
కలిసి రాని కాలం కొరకు కన్నీలు పెట్టొద్దు..
కలసి వచ్చే కాలంకొరకు ఎదురు చూడొద్దు..
కల్పించుకొని నీకు నీవే కాలమై కదలిపో...!!

**అంబటి నారాయణ,నిర్మల్**
**9849326801**



# రూ. 338 కోట్లతో నాలుగు లేన్ల రహదారులకు శ్రీకారం

**ఇబ్రహీంపట్నం వెలుతురు జూలై 07:**

రూ.338 కోట్ల వ్యయంతో ఇబ్రహీంపట్నం, మేడ్చల్, మహేశ్వరం నియోజకవర్గాల్లో హైబ్రిడ్ అన్యుటీ మోడల్ (HAM) విధానంలో చేపట్టనున్న ఆధునిక నాలుగు లేన్ల రహదారుల నిర్మాణ పనులకు రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మంగళవారం శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో పార్లమెంట్ సభ్యులు కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, ఈటల రాజేందర్, చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, ఇబ్రహీంపట్నం శాసనసభ్యులు మల్‌రెడ్డి రంగారెడ్డి,ఎమ్మెల్సీ శంకర్ నాయక్,పాల్గొన్నారు.అనంతరం నిర్వహించిన బహిరంగ సభలో మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ.బ్రహీంపట్నం ప్రజలు, కార్యకర్తలు, నాయకులు తనపై ఉంచిన విశ్వాసం వల్లే రాష్ట్రంలో కీలకమైన రోడ్లు, భవనాల శాఖ మంత్రిగా సేవ చేసే అవకాశం లభించిందన్నారు. ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకోవడం తన బాధ్యత అని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రహదారుల అభివృద్ధికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, ఇప్పటికే రూ.85 కోట్ల విలువైన రహదారి పనులు పూర్తి చేశామని, మరో రూ.275 కోట్లతో పలు రహదారి అభివృద్ధి పనులు చేపడుతున్నామని తెలిపారు. అదనంగా రూ.100 కోట్ల విలువైన కొత్త రహదారి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించినట్లు వెల్లడించారు.

పార్టీలు వేర్వేరు అయినప్పటికీ అభివృద్ధి విషయంలో అందరూ కలిసి పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. ట్రాఫిక్ సమస్యల పరిష్కారం, జాతీయ రహదారుల విస్తరణ, ఇబ్రహీంపట్నం లో గల ప్రాంతాల్లో పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయడం వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని తెలిపారు. ప్రజలకు ఇచ్చిన హామీలన్నింటినీ అమలు చేస్తూ తెలంగాణను మరింత అభివృద్ధి పథంలో నడిపిస్తామని మంత్రి స్పష్టం చేశారు.పార్లమెంట్ సభ్యులు చామల కిరణ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ, ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో రూ.338 కోట్లతో 140కు పైగా రహదారి పనులు చేపట్టినట్లు తెలిపారు. గ్రామాలు, బస్తీల్లో రోడ్లు, డ్రైనేజీల నిర్మాణానికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. విద్య, వైద్యం, మౌలిక వసతుల అభివృద్ధిపై ప్రభుత్వం దృష్టి సారించిందని, ప్రభుత్వ పాఠశాలలను ఆధునిక తెలంగాణ పబ్లిక్ స్కూల్స్‌గా తీర్చిదిద్దుతున్నట్లు పేర్కొన్నారు. లక్ష్మీరెడ్డిపాలెం వద్ద ఫ్లైఓవర్, అండర్‌పాస్ నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు.ఇబ్రహీంపట్నం శాసనసభ్యులు మల్‌రెడ్డి రంగారెడ్డి మాట్లాడుతూ, ఇబ్రహీంపట్నం నియోజకవర్గానికి రూ.338 కోట్ల విలువైన రహదారి పనులు మంజూరు కావడం చారిత్రాత్మకమని పేర్కొన్నారు. ఇందులో సుమారు రూ.275 కోట్ల పనులు నేరుగా ఇబ్రహీంపట్నం పరిధిలో చేపడుతున్నట్లు తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో నియోజకవర్గంలో 200 పడకల ఆసుపత్రి, ప్రభుత్వ పాఠశాలల ఆధునీకరణ, రహదారుల విస్తరణ వంటి పలు అభివృద్ధి కార్యక్రమాలు వేగంగా కొనసాగుతున్నాయని చెప్పారు. అలాగే రూ.2,300 కోట్లతో సమీకృత మార్కెట్ ఏర్పాటు ద్వారా వేలాది మందికి ఉపాధి అవకాశాలు కల్పించనున్నట్లు తెలిపారు.తెలంగాణ రాష్ట్ర రోడ్డు అభివృద్ధి సంస్థ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమంతో పాటు అభివృద్ధికి కూడా సమాన ప్రాధాన్యత ఇస్తోందన్నారు.

రాష్ట్రవ్యాప్తంగా రోడ్లు, భవనాల శాఖ ద్వారా భారీ స్థాయిలో అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు తెలిపారు. భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకొని ప్రధాన రహదారులను నాలుగు లేన్లుగా అభివృద్ధి చేయడం ద్వారా రవాణా సౌకర్యాలు మెరుగుపడటంతో పాటు ఉపాధి, పెట్టుబడులు, ప్రాంతీయ అభివృద్ధికి ఊతం లభిస్తుందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, కార్పొరేషన్ చైర్మన్ చల్లా నర్సింహారెడ్డి, ఎమ్మెల్సీ శంకర్ నాయక్, రంగారెడ్డి జిల్లా జాయింట్ కలెక్టర్ చంద్రారెడ్డి, గడ్డి అన్నారం మార్కెట్ కమిటీ చైర్మన్ మధుసూదన్‌రెడ్డి, ప్రజాప్రతినిధులు, అధికారులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

# చిన్నారులే దేశ సంపద, ఏ చిన్నారి అంగన్వాడి సేవలకు...

**(మొదటి పేజీ తరువాయి)**



ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ, ఇప్పటివరకు సాంప్రదాయ అంగన్వాడి కేంద్రాలకు వచ్చే చిన్నారులకే పోషకాహారం, ఆరోగ్య సంరక్షణ, ప్రీ–స్కూల్ విద్య, తల్లి శిశు సంక్షేమ సేవలు అందుబాటులో ఉండేవని, అయితే అంగన్వాడి కేంద్రాలు లేని ప్రాంతాల్లో నివసించే చిన్నారులు, ముఖ్యంగా పనుల కోసం హైదరాబాద్ వంటి నగరాలకు వలస వచ్చే కార్మికుల పిల్లలు ఈ సేవలకు దూరమవుతున్నారని అన్నారు. అలాంటి ఒక్క చిన్నారి కూడా ప్రభుత్వ సేవలకు దూరం కాకూడదనే లక్ష్యంతో ఈ మొబైల్ అంగన్వాడి కేంద్రాలను అందుబాటులోకి తీసుకొస్తున్నామని చెప్పారు.అంగన్వాడి కేంద్రాల్లో లభించే అన్ని సేవలు మొబైల్ అంగన్వాడి కేంద్రాల్లో కూడా అందుబాటులో ఉంటాయని మంత్రి తెలిపారు. పోషకాహారం, ఆరోగ్య పరీక్షలు, ఎదుగుదల పర్యవేక్షణ, ప్రీ–స్కూల్ విద్యతో పాటు తల్లి శిశు సంక్షేమానికి సంబంధించిన అన్ని సేవలను ఈ వాహనాల ద్వారా అందిస్తామని చెప్పారు. వలస కార్మికులు ఎక్కువగా నివసించే ప్రాంతాలకు ఈ మొబైల్ అంగన్వాడి వాహనాలు నేరుగా వెళ్లి సేవలు అందిస్తాయని పేర్కొన్నారు.ఒక్కో మొబైల్ అంగన్వాడి వాహనం దాదాపు పది అంగన్వాడి కేంద్రాలకు సమానంగా సేవలు అందించే సామర్థ్యాన్ని కలిగి ఉందని, ఒక్కో మొబైల్ అంగన్వాడి కేంద్రం ద్వారా సుమారు 300 మంది లబ్ధిదారులకు సేవలు అందనున్నాయని మంత్రి సీతక్క తెలిపారు. ప్రభుత్వం సేవలను ప్రజలు ఉన్న చోటుకే తీసుకెళ్లాలన్న ఆలోచనతో ఈ కార్యక్రమాన్ని రూపొందించిందన్నారు.చిన్నారి చిరునవ్వే నిజమైన అభివృద్ధికి ప్రతీక అని పేర్కొన్న మంత్రి సీతక్క, స్వాతంత్ర్యోద్యమ తొలి దశల్లో గ్రామాలకు వెళ్లి అక్షరాస్యత, విజ్ఞానాన్ని పంచిన చైతన్య రథాల మాదిరిగానే ఈ మొబైల్ అంగన్వాడి కేంద్రాలు కూడా ప్రతి చిన్నారికి పోషకాహారం, ఆరోగ్యం, విద్యను చేరవేసి ఆరోగ్యవంతమైన భావితరాన్ని నిర్మించడంలో కీలక పాత్ర పోషిస్తాయని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం ప్రతి చిన్నారి సమగ్ర అభివృద్ధికి అత్యున్నత ప్రాధాన్యత ఇస్తోందని మంత్రి సీతక్క స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మహిళా శిశు సంక్షేమ శాఖ సెక్రెటరీ శృతి ఓజా, జాయింట్ డైరెక్టర్ మోతి, మేడ్చల్ మల్కాజ్గిరి డి డబ్ల్యూ ఓ శారద, కార్మిక మహిళా శిశు సంక్షేమ శాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# నారాయణఖేడ్ అభివృద్ధి కాంగ్రెస్ తో సాధ్యం

**వెలుతురు నారాయణఖేడ్ జూలై 07 :**



సంగారెడ్డి జిల్లా :– రూ.52.9 కోట్ల వ్యయంతో చేపట్టనున్న వివిధ అభివృద్ధి పనులకు ఈనెల 9న రాష్ట్ర అటవీ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ, కార్మిక శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామిలు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేయనున్నట్లు ఎమ్మెల్యే సంజీవరెడ్డి తెలిపారు. మంగళవారం క్యాంప్ ఆఫీస్ లో ఏర్పాటు చేసిన ప్రెస్ మీట్ లో ఆయన మాట్లాడుతూ..

పట్టణ శివారులోని వెంకటాపూర్ చౌరస్తా వద్ద రూ.3.90 కోట్లతో అత్యాధునికంగా నిర్మించిన అర్బన్ పార్కును మంత్రులు ప్రారంభించనున్నారని చెప్పారు. జూకల్ శివారులో రూ.47 కోట్లతో నిర్మించనున్న ఏటీసీ భవనానికి, పర్యావరణ పరిరక్షణతో పాటు పర్యాటకులను ఆకర్షించేలా రూ.2 కోట్లతో చేపట్టనున్న ఎకో టూరిజం ప్రాజెక్టు పనులకు వారు శంకుస్థాపనలు చేయనున్నట్లు వివరించారు. పై కార్యక్రమంలో ఎంపీ సురేష్ షెట్కార్, కాంగ్రెస్ జిల్లా నాయకులు పాల్గొంటారన్నారు. ఇట్టి కార్యక్రమాలలో నియోజకవర్గంలోని వివిధ గ్రామాల సర్పంచ్లు, ప్రజా ప్రతినిధులు పాల్గొని విజయవంతం చేయాలని ఎమ్మెల్యే కోరారు.

# ఘనంగా ఎమ్మార్పీఎస్ 32వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

**మోత్కూర్, జులై7,వెలుతురు న్యూస్ :**



మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి ఆవిర్భవించి 32 సంవత్సరాలు పూర్తైన సందర్భంగా యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూర్ మండల కేంద్రంలో జెండా ఆవిష్కరణ చేసి ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు.కార్యక్రమంలో బందెల శ్రీను,కూరెళ్ల సైదులు చెడిపల్లి ఆదిత్య,గణపాక నవీన్, మేడి వినయ్, మెంట సునీల్,నల్ల సందీప్ తదితర నాయకులు పాల్గొన్నారు.

# హైటెక్స్ నోవోటల్ లో గ్రీన్ గ్రౌత్ సమ్మిట్ 2026 లో పాల్గొన్న మంత్రి పొన్నం ప్రభాకర్





- **గ్రీన్ గ్రోత్ ఎకానమీ సమ్మిట్–2026 వంటి ప్రతిష్ఠాత్మక వేదికలో పాల్గొనే అవకాశం లభించడం సంతోషంగా ఉంది..**

**హైదరాబాద్ వెలుతురు జూలై 07:**

గ్రీన్ గ్రోత్ ఎకానమీ సమ్మిట్–2026 వంటి ప్రతిష్ఠాత్మక వేదికలో పాల్గొనే అవకాశం లభించడం సంతోషంగా ఉంది. నేడు ప్రపంచం ఎదుర్కొంటున్న అతిపెద్ద సవాళ్లలో వాతావరణ మార్పులు, పర్యావరణ కాలుష్యం, ఇంధన భద్రత ప్రధానమైనవి. ఈ సవాళ్లను అధిగమించేందుకు అభివృద్ధితో పాటు పర్యావరణ పరిరక్షణకు సమాన ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం ఉంది అదే గ్రీన్ గ్రోత్ లక్ష్యం.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారి నాయకత్వంలో తెలంగాణ ప్రభుత్వం సుస్థిర అభివృద్ధికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తోంది.పరిశ్రమలు, మౌలిక సదుపాయాలు, రవాణా, పట్టణాభివృద్ధి, పునరుత్పాదక ఇంధన రంగాల్లో పర్యావరణహిత విధానాలను అమలు చేస్తూ రాష్ట్రాన్ని హరితాభివృద్ధి దిశగా ముందుకు తీసుకెళ్తోంది.రవాణా శాఖ మంత్రిగా ప్రజా రవాణాను మరింత ఆధునికంగా, కాలుష్య రహితంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నాం.ఎలక్ట్రిక్ వాహనాల వినియోగాన్ని ప్రోత్సహించడం, ఛార్జింగ్ మౌలిక వసతులను విస్తరించడం, ప్రజా రవాణాలో పరిశుభ్రమైన సాంకేతికతను ప్రోత్సహించడం మా లక్ష్యం.హరితాభివృద్ధి అంటే కేవలం పర్యావరణ పరిరక్షణ మాత్రమే కాదు. అది ఉపాధి కల్పన, నైపుణ్యాభివృద్ధి, పారిశ్రామిక ప్రగతి, మహిళా సాధికారతకు కూడా బలమైన పునాది. గ్రీన్ టెక్నాలజీ, కృత్రిమ మేధస్సు (AI), ఎలక్ట్రిక్ మొబిలిటీ, పునరుత్పాదక ఇంధన రంగాల్లో తెలంగాణ యువతకు అపార అవకాశాలు ఉన్నాయి. ప్రభుత్వం స్కిల్ డెవలప్‌మెంట్, పరిశ్రమలకు ప్రోత్సాహకాలు, పెట్టుబడుల ఆకర్షణ ద్వారా ఈ అవకాశాలను మరింత విస్తరిస్తోంది.హైదరాబాద్ నేడు ప్రపంచ పెట్టుబడులకు, సాంకేతిక ఆవిష్కరణలకు కేంద్రంగా నిలుస్తోంది. అనుకూల పారిశ్రామిక విధానాలు, శాంతిభద్రతలు, మెరుగైన మౌలిక వసతులు, నైపుణ్యం కలిగిన మానవ వనరులు తెలంగాణను పెట్టుబడులకు అత్యంత ఆకర్షణీయ రాష్ట్రంగా నిలబెట్టాయి.భావితరాలకు స్వచ్ఛమైన గాలి, పరిశుభ్రమైన పర్యావరణం, సుస్థిర అభివృద్ధిని అందించడం మనందరి ఉమ్మడి బాధ్యత. ప్రభుత్వం, పరిశ్రమలు, విద్యాసంస్థలు, పౌర సమాజం కలిసి పనిచేస్తే గ్రీన్ గ్రోత్ లక్ష్యాలను మరింత వేగంగా సాధించగలం.గ్రీన్ తెలంగాణ – సుస్థిర తెలంగాణ అనే లక్ష్యంతో తెలంగాణ ప్రభుత్వం ముందుకు సాగుతోంది. ఈ సమ్మిట్ ద్వారా వెలువడే ఆలోచనలు, విధానాలు, భాగస్వామ్యాలు రాష్ట్రంతో పాటు దేశ హరితాభివృద్ధికి దోహదపడాలని ఆకాంక్షిస్తున్నాను.కాలుష్య నియంత్రణతో పాటు పర్యావరణ పరిరక్షణ మా ప్రభుత్వ అత్యంత ప్రాధాన్య అంశాల్లో ఒకటి. పరిశుభ్రమైన, ఇంధన సామర్థ్యం కలిగిన రవాణా వ్యవస్థను అభివృద్ధి చేయడం ద్వారా కాలుష్యాన్ని తగ్గించి, భావితరాలకు స్వచ్ఛమైన పర్యావరణాన్ని అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తోంది.అందులో భాగంగానే విద్యుత్ వాహనాల (ఈవీ) వినియోగాన్ని తెలంగాణ ప్రభుత్వం విస్తృతంగా ప్రోత్సహిస్తోంది. రవాణా శాఖ మంత్రిగా రాష్ట్రంలో ఈవీల వినియోగం పెరగడానికి అవసరమైన చర్యలు తీసుకుంటున్నాము.నా నియోజకవర్గమైన హుస్నాబాద్‌లో 384 మహిళా స్వయం సహాయక సంఘాలు ఉన్నాయి. పర్యావరణ పరిరక్షణను దృష్టిలో ఉంచుకొని నియోజకవర్గంలో స్టీల్ బ్యాంక్ పంపిణీ చేశాం.. ప్లాస్టిక్ నిషేధించాం.పర్యావరణ పరిరక్షణతో పాటు మహిళా సాధికారతను కూడా ఈ కార్యక్రమం బలోపేతం చేస్తోంది.రవాణా శాఖ మంత్రిగా, నా నియోజకవర్గ ప్రజాప్రతినిధిగా, అలాగే తెలంగాణ ప్రభుత్వంలో భాగస్వామిగా హరితాభివృద్ధి లక్ష్యాల సాధనకు కట్టుబడి ఉన్నాను. ఆధునిక, పర్యావరణహిత విధానాలను అమలు చేస్తూ గ్రీన్ గ్రోత్ దిశగా తెలంగాణను ముందుకు తీసుకెళ్లేందుకు మా ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోంది.హరిత తెలంగాణ సుస్థిర తెలంగాణ నిర్మాణమే మా లక్ష్యం.పర్యావరణాన్ని పరిరక్షిస్తూ భావితరాలకు ఆరోగ్యకరమైన భవిష్యత్తును అందించడం మనందరి బాధ్యత తెలంగాణ ప్రభుత్వం సుస్థిర అభివృద్ధి, ఉపాధి కల్పన అనే రెండు లక్ష్యాలను సమాంతరంగా ముందుకు తీసుకెళ్తోంది. వాతావరణ మార్పుల ప్రభావాన్ని తగ్గించేందుకు చర్యలు తీసుకుంటూనే యువతకు నైపుణ్యాలు పెంపొందించి ఉపాధి అవకాశాలు కల్పించడంపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నాం.రాష్ట్రంలో స్కిల్ యూనివర్సిటీ ద్వారా యువతకు భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా శిక్షణ అందిస్తున్నాం. అదే సమయంలో పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యం కలిగిన మానవ వనరులను తీర్చిదిద్దేందుకు అనేక కార్యక్రమాలు అమలు చేస్తున్నాం.కృత్రిమ మేధస్సు (AI), సమాచార సాంకేతికత (IT), గ్రీన్ ఎనర్జీ, ఎలక్ట్రిక్ మొబిలిటీ వంటి భవిష్యత్ రంగాల్లో తెలంగాణను అగ్రస్థానంలో నిలపాలనే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోంది. ఈ రంగాల్లో పెట్టుబడులను ఆకర్షించేందుకు అవసరమైన ప్రోత్సాహకాలను అందిస్తూ, ప్రపంచ స్థాయి సంస్థలతో భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేస్తున్నాం.తెలంగాణ–2047 విజన్‌తో సమగ్ర, సమ్మిళిత అభివృద్ధిని లక్ష్యంగా పెట్టుకొని రాష్ట్రాన్ని ముందుకు తీసుకెళ్తున్నాం. అభివృద్ధి ఫలాలు సమాజంలోని ప్రతి వర్గానికీ చేరేలా ప్రభుత్వం కృషి చేస్తోంది.రవాణా శాఖ మంత్రిగా ప్రజా రవాణా వ్యవస్థను మరింత ఆధునికంగా, పర్యావరణహితంగా తీర్చిదిద్దేందుకు చర్యలు చేపడుతున్నాం. ప్రజా రవాణా బలోపేతం కావడం వల్ల కాలుష్యం తగ్గడమే కాకుండా ప్రజలకు మెరుగైన సేవలు అందుతాయి.హైదరాబాద్ నేడు ప్రపంచ స్థాయి పెట్టుబడులకు, పరిశ్రమలకు, సాంకేతిక సంస్థలకు అత్యంత అనుకూలమైన నగరంగా ఎదిగింది. ఇక్కడి వాతావరణం, శాంతిభద్రతలు, మౌలిక వసతులు దేశ విదేశాల నుంచి వచ్చే పెట్టుబడిదారులకు విశ్వాసాన్ని కల్పిస్తున్నాయి.దేశ రాజధాని ఢిల్లీలో వాయు కాలుష్యం ఎంత తీవ్రమైన సమస్యగా మారిందో మనందరికీ తెలుసు. అలాంటి పరిస్థితి హైదరాబాద్‌లో రాకుండా ఇప్పటి నుంచే ప్రభుత్వం ముందస్తు చర్యలు తీసుకుంటోంది. గాలి నాణ్యతను కాపాడటం, పచ్చదనాన్ని పెంపొందించడం, కాలుష్య నియంత్రణకు అవసరమైన విధానాలను సమర్థంగా అమలు చేయడం ద్వారా భావితరాలకు ఆరోగ్యకరమైన తెలంగాణను అందించడమే మా ప్రభుత్వ లక్ష్యం.






Edited, Printed, Published and Owner by BAKKA YADAIAH, Published & Printed at SRI SHANTHI PUBLICATIONS H.No. 7-2-31/221/2, S.V. Colony, Bairamalaguda, Saroornagar, Mdl.R.R. DIST, Telangana-79. EDITORG BAKKA YADAIAH, R.N.I. TEL TEL /2019 / 78609. Cell:91773 87328, Email: velthurunewspaper@gmail.com